PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక :133 | విజయవాడ, ఆదివారం 15 డిసెంబర్ 2024 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 15 December 2024 | Rs

విషాదంలోనూ వివక్షేనా!

- కేంద్రం తీరుపై కేరళ ఎంపీల నిరసన
- వయనాడ్‌కు న్యాయం చేయాలని ఆందోళన

7

శంభు సరిహద్దుల్లో రైతులపై జల ఫిరంగులతో విరుచుకుపడుతున్న హర్యానా పోలీసులు

శంభు సరిహద్దులో రైతులపై కర్కశం

- టియర్ గ్యాస్, నీటి ఫిరంగులు ప్రయోగించిన బిజెపి ప్రభుత్వం
- 17 మంది రైతులకు గాయాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఢిల్లీ చలో' పాదయాత్ర చేస్తున్న రైతులపై శంభు సరిహద్దు వద్ద హర్యానాలోని బిజెపి ప్రభుత్వం మరోసారి కర్కశంగా అణిచివేతకు పాల్పడింది. శనివారం మధ్యాహ్నం పాదయాత్ర ప్రారంభించిన అన్నదాతలపై పోలీసులు బాష్పవాయువులు షెల్స్, నీటి ఫిరంగలను ప్రయోగించారు. ఈ ఘటనలో 17 మంది రైతులకు గాయాలు అయ్యాయి. టియర్ గ్యాస్ గ్రెనేడ్లు పేల్చడంతో వచ్చిన పొగను పీల్చడంతో మరికొందరు రైతులు ఆస్పత్రిలో చేరారు. తమ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పంజాబ్ నుంచి పాదయాత్రగా వచ్చిన రైతులపై పోలీసులు ఈ దాడికి దిగారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల తరువాత ఢిల్లీ పాదయాత్రను పంజాబ్-హర్యానా సరిహద్దు శంభు వద్ద రైతులు తిరిగి ప్రారంభించారు. 101 మంది రైతుల జాతా హర్యానా సిబ్బంది ఏర్పాటు చేసిన బారికేడ్‌లను చేరుకున్నారు. దీంతో పోలీసులు ఒక్కసారిగా రైతులపై జల ఫిరంగులు, టియర్ గ్యాస్ ప్రయోగించారు. దీంతో రైతులు చెల్లాచెదురు అయ్యారు. ఒక్కసారిగా శంభు వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అంతకు ముందు అంబాలా డిప్యూటీ కమీషనర్ పార్త్ గుప్తా, అంబాలా పోలీస్ సూపరంటెండెంట్ ఎస్ఎస్ భోరియా రైతులతో మాట్లాడుతూ ఢిల్లీకి వెళ్లాలంటే, ఢిల్లీ నుంచి అనుమతి పొందాలని సూచించారు. వెనక్కి వెళ్లిపోవాలని రైతులకు ఆదేశించారు. అయితే రైతులు వెనక్కి తగ్గలేదు. ముందుకే సాగారు. కొన్ని కిలో మీటర్ల నడుమ పారా మిలటరీ బలగాలతో సహా హర్యానా పోలీసులు భారీస్థాయిలో బారికేడ్లు వేసి, రైతులను అడ్డుకున్నారు. శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న వారిపై పోలీసులు దాడి చేశారని రైతు నాయకుడు సర్వన్ సింగ్ పాంధర్ అన్నారు. తమ వద్ద జెండాలు, బట్టలు మాత్రమే ఉన్నాయని, డిమాండ్లపై చర్చించేందుకు ఢిల్లీ వెళ్లనున్నామని చెప్పారు. ఖన్నౌరీలో నిరాహారదీక్ష చేస్తున్న రైతు నేత కన్వీనర్ జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యం క్షీణించిందని, ప్రధాని సహా ప్రజల కళ్ల ముందే ఇదంతా జరుగుతోందని సర్వన్ సింగ్ విమర్శించారు.

ఈ నెల 18న రైల్‌రోకో

గాయపడ్డ రైతులకు సరైన మిగతా 7లో





పార్లమెంటులో మాట్లాడుతున్న ప్రధాని మోడీ, రాహుల్ గాంధీ

మన ప్రజాస్వామ్యం స్ఫూర్తిదాయకం

- లోక్‌సభలో ప్రధాని మోడీ
- రాజ్యాంగం ప్రజలకు రక్షణనిస్తే బిజెపి దాడిచేస్తోంది : రాహుల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో రాజ్యాంగంపై ప్రత్యేక చర్చ శనివారం కూడా కొనసాగింది. శనివారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోడీ చర్చకు సమాధానమిస్తూ భారతదేశ గతమెంతో ఘనమైనదని చెప్పారు. రాజ్యాంగ నిర్మాతల దీర్ఘకాలిక దృక్పథం, సహకారంతో మనం ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్యం, దేశ గణతంత్రం చాలా గొప్పదని కొనియాడారు. దేశ ప్రజాస్వామ్యం ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. మనది అతి పెద్ద ప్రజాస్వామ్యం మాత్రమే కాదని, ప్రజాస్వామ్యానికి తల్లి కూడా అని మోడీ అన్నారు. స్వాతంత్ర్యం సాధించిన సమయంలో దేశ భవిష్యత్‌పై కలిగిన సందేహాలు, సవాళ్లను అధిగమించి.. భారత రాజ్యాంగం మనలను ఇక్కడి వరకు తీసుకువచ్చిందన్నారు.

'మన మధ్య ఐకమత్యం దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. భిన్నత్వంలో ఏకత్వం మనదేశ గొప్ప విధానం. అయితే బానిస మనస్తత్వం కలిగిన కొంతమంది దేశాభివృద్ధికి ఆటంకం కలిగించారు. కొందరు స్వార్థపరుల వల్ల అనేక కష్టాలు పడ్డాం. మన ఐక్యత దెబ్బతీసేందుకు కొందరు విషబీజాలు నాటారు. పేదలకు ఇబ్బంది లేకుండా వన్ నేషన్.. వన్ రేషన్ కార్డు తెచ్చాం' అని తెలిపారు. దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిదని, వారికి అన్ని రంగాల్లో గౌరవం దక్కాలన్నారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ విమర్శలు చేశారు. కాంగ్రెస్‌కు చెందిన ఒక కుటుంబం రాజకీయ ప్రయోజనాల కోసం పదేపదే రాజ్యాంగ సిద్ధాంతాలను బలహీనపరుస్తూ వచ్చిందని విమర్శించారు. భావ ప్రకటనా స్వేచ్ఛకు కళ్లెం వేస్తూ, అసమ్మతిని అణిచి వేసేందుకు రాజ్యాంగ సవరణలు తెచ్చిందని అన్నారు. 'రాజ్యాంగం 25 ఏళ్లు పూర్తయినప్పుడు రాజ్యాంగం చిరిగింది. 1975లో అత్యవసర పరిస్థితి మిగతా 7లో

ఎన్‌టిఆర్‌కు భారతరత్న సాధిస్తా

- వజ్రోత్సవ వేడుకల్లో సిఎం చంద్రబాబు
- 'తారక రామం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి, విజయవాడ అర్బన్, కంకిపాడు :

నందమూరి తారక రామారావు (ఎన్‌టిఆర్)కు భారతరత్న సాధిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలో ఎన్‌టిఆర్ లిటరేచర్-సావనీర్ అండ్ వెబ్ సైట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌టిఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలో ఆయన హాజరై ప్రసంగించారు. వేదికపై ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ నిలువెత్తు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 2025 ఎన్‌టిఆర్ కేలండర్, ఎన్‌టిఆర్ సినీ ప్రస్థానంపై రూపొందించిన 'తారక రామం' పుస్తకాన్ని సిఎం చంద్రబాబుతోపాటు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో ఎన్‌టిఆర్ చిరస్మరణీయుడుగా నిలిచిపోతారన్నారు. ఆయన స్ఫూర్తితో స్వర్ణాంధ్ర విజన్-2047 కల సాకారం చేసుకుందామన్నారు. సినీ, రాజకీయ రంగాల్లో ఎన్‌టిఆర్‌ది చెరగని ముద్ర అని కొనియాడారు. జాతీయ భావాలతో ప్రాంతీయ పార్టీ నడిపిన ఏకైక వ్యక్తి అని అన్నారు. తెలుగుజాతి ఉన్నంత వరకు ఎన్‌టిఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ చిరస్థాయిగా ఉంటుందని చెప్పారు. రాయలసీమలో కరువు, దివిసీమలో తుపాన్ వచ్చినప్పుడు ఎన్‌టిఆర్ జోలిపట్టి విరాళాలు సేకరించారని గుర్తుచేశారు. సమాజమే దేవాలయం, పేదలే దేవుళ్లని చెప్పిన ఎన్‌టిఆర్ స్ఫూర్తితో పేదరికం లేని సమాజం కోసం కృషి చేస్తున్నామని, స్వర్ణాంధ్రప్రదేశ్ సాధిస్తామని చెప్పారు. ఎన్‌టిఆర్‌కు భారత రత్న ఇవ్వడమంటే తెలుగుజాతిని గౌరవించడమేనని చెప్పారు.

పాఠ్యాంశంగా చేర్చాలి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలకు, కార్యదక్షతకు ఎన్‌టిఆర్ మారుపేరన్నారు. ఎన్‌టిఆర్ జీవిత చరిత్రను విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాలని చెప్పారు. నేటి తరం తెలుసుకోవాల్సిన ఎన్నో విషయాలు ఎన్‌టిఆర్ జీవితంలో ఉన్నాయని అన్నారు. సమాజానికి ఉపయోగపడే ఎన్నో సందేశాలను సినిమాల రూపంలో ఎన్‌టిఆర్ చూపించారన్నారు. తెలుగు భాష ఔన్నత్యానికి రామారావు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాజకీయ కార్యదర్శి, మాజీ ఎంఎల్‌సి టిడి జనార్ధన్ ఛైర్మన్‌గా ఉన్న ఎన్‌టిఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ మొదటి సినిమా హీరోయిన్ కృష్ణవేణి, సినీనటి, మాజీ ఎంపి జయప్రద, సినీనటి ప్రభ, ఎన్‌టిఆర్ కుమారులు మోహనకృష్ణ, రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎన్‌టిఆర్ లిటరేచర్ కమిటీ అధ్యక్షులు టిడి జనార్ధన్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సినీ ప్రముఖులను జ్ఞాపికలను అందించి సత్కరించారు.

ఎన్‌టిఆర్ సినీ జీవిత విశేషాల సమాహారం

ఎన్‌టిఆర్ సినీ జీవిత ప్రస్థానంలోని వివిధ ఘట్టాలను, వివిధ ఇంటర్వ్యూలలో ఆయన చెప్పిన విశేషాలను 'తారక రామం' పుస్తకంలో పొందుపరిచారు. ఆయన వ్యక్తిత్వం, నటనా వైదుష్యం, క్రమశిక్షణ, వివిధ పాత్రలను ఆయన పోషించిన తీరును వివరించారు. నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా ఎన్‌టిఆర్ చేసిన కృషిని రంగురంగుల ఫోటోలతో పుస్తకంలో వివరించారు.

ఎన్‌టిఆర్ నిలువెత్తు విగ్రహానికి నివాళులర్పిస్తున్న చంద్రబాబు

రెగ్యులర్ చేయాలి

- సిఎంకు కాంట్రాక్టు లెక్చరర్స్ జెఎసి వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లోని కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్‌చేయాలని కాంట్రాక్ట్ లెక్చరర్ల జెఎసి కోరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును జెఎసి చైర్మన్ కె సురేష్, కో చైర్మన్ కె శ్రీనివాస్‌లు శనివారం టిడిపి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జివో 114 అమలు నేపథ్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ కొంతమేరకు పూర్తయిందని సిఎంకు తెలిపారు. నిలిచిన రెగ్యులరైజేషన్‌ను తిరిగి ప్రారంభించాలని కోరారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పెడింగ్‌లో ఉన్న మే నెల వేతన సమస్యను పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్నట్లే కాంట్రాక్ట్ లెక్చరర్లకు కూడా ఉద్యోగ విరమణ వయసును 62ఏళ్లకు పెంచాలని కోరారు. రెగ్యులరైజేషన్ పెండింగ్ అంశాన్ని పరిశీలించి న్యాయం చేస్తామని సిఎం చంద్రబాబు వారికి హామీ ఇచ్చారు.

వైసిపి ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీపార్వతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నందమూరి లక్ష్మీపార్వతిని నియమించారు. ఈ మేరకు శనివారం పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటన విడుదల చేశారు. అలాగే వైసిపి గుంటూరు ఎస్‌సి విభాగం అధ్యక్షులుగా తెనాలికి చెందిన గడ్డేటి సురేంద్రను నియమించారు.

కార్పొరేట్ మాఫియాతో తీవ్ర నష్టం

- వైసిపి బాటలోనే టిడిపి కూటమి పాలన
- సిపిఎం గుంటూరు జిల్లా మహాసభలో సిహెచ్ బాబూరావు

ప్రారంభ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

కార్పొరేట్ మాఫియాను నిరోధించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. దేశంలో జమిలి ఎన్నికలు జరిగితే ప్రజాసామ్యానికి ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో సిపిఎం 25వ జిల్లా మహాసభ శనివారం ప్రారంభమైంది. మహాసభకు అధ్యక్షవర్గంగా కె.నళినీకాంత్, ఎస్ఎస్.చెంగయ్య, ఎల్.అరుణ వ్యవహరించారు. తొలుత సిపిఎం జెండాను సీనియర్ కార్యకర్త తియ్యగూర అంజిరెడ్డి ఆవిష్కరించారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, జిల్లా కమిటీ సభ్యులు వల్లభనేని సాంబశివరావు చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం బాబూరావు ప్రారంభోపన్యాసం చేస్తూ, జమిలి ఎన్నికలు ప్రాంతీయ పార్టీలకు నష్టమని తెలిపారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' పేరుతో రాజకీయ లబ్ధి కోసం బిజెపి చేస్తోన్న కుట్రలో ప్రాంతీయ పార్టీలూ చిక్కుకుంటున్నాయన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి బిజెపి పాలనలో ముప్పు ఏర్పడిందని, దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగం అమలుకు కుట్ర చేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి కమ్యూనిస్టులు, లౌకికవాదులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం, రేషన్, గంజాయి అక్రమ వ్యాపారాలు చేసే మాఫియాతోపాటు జాతీయ స్థాయిలో అదానీ వంటి కార్పొరేట్ మాఫియాను కూడా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అదానీ విద్యుత్ ఒప్పందాల వల్ల రాష్ట్రంపై రూ.లక్ష కోట్ల భారం పడిందని, ఈ ఒప్పందాలు రద్దు చేసుకుంటే మోడీకి కోపం వస్తుందని టిడిపి, జనసేన, వైసిపి నాయకులు ఈ భారాన్ని ప్రజలపై మోపుతున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అదానీతో ఒప్పందం అమలు ఫలితమేనన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలు అడ్డుకోవాలని, మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. వైసిపి బాటలోనే టిడిపి కూటమి ప్రభుత్వ పాలన ఉందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ ప్రజలపై భారం మోపే విషయంలో టిడిపికి, వైసిపికి తేడా లేదన్నారు. సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు ఇచ్చిన హామీలపై మీనమేషాలు లెక్కిస్తుండడం సరికాదని తెలిపారు. నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేస్తున్నామని చెప్తోన్న టిడిపి కూటమి ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని ఎందుకు సరఫరా చేయలేకపోతోందని ప్రశ్నించారు. మద్యాన్ని విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, బెల్టు షాపులు ఊరూవాడా ఏర్పాటు చేశారని వివరించారు. గత ఆరు నెలల కాలంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు పెరిగాయని, మద్యం, గంజాయి వల్ల నేరాలు పెరుగుతున్నాయని, ఈ విషయం ప్రభుత్వానికి తెలిసినా నియంత్రించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజకీయాల్లో ప్రజలకు ప్రత్యామ్నాయం చూపించే శక్తి కమ్యూనిస్టులకే ఉందన్నారు. పార్టీ రాజకీయ కార్యకలాపాల నివేదికను సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రవేశపెట్టారు. జిల్లా సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. రాజధానిలో రైతులకు, నిరుపేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దళితులు, విద్యా రంగ సమస్యలు, కార్మికుల సమస్యలపై కూడా తీర్మానాలను ఆమోదించింది.

జయంతి సభలో మాట్లాడుతున్న ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి.మధు

సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలకు స్ఫూర్తి బసవపున్నయ్య

- జయంతి సభలో పి.మధు

ప్రజాశక్తి - విజయవాడ : తన చిన్నతనంలోనే సంఘ సంస్కరణ ఉద్యమాలకు, సాంస్కృతిక రంగంలో అభ్యుదయ భావజాల వ్యాప్తికి మాకినేని బసవపున్నయ్య కృషి చేశారని ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి.మధు అన్నారు. మతోన్మాద శక్తులు సాంస్కృతిక రంగాన్ని కబ్జాచేసి పక్కదారి పట్టిస్తున్న నేటి తరుణంలో బసవ పున్నయ్య స్ఫూర్తితో లౌకికవాదం, సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మార్క్సిస్టు సిద్ధాంత కర్త, స్వాతంత్ర సమరయోధుడు మాకినేని బసవపున్నయ్య 112వ జయంతి కార్యక్రమం శనివారం విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన జరిగింది. ముందుగా బసవపున్నయ్య చిత్రపటానికి పి.మధుతోపాటు ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, జె.జయరాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. రాజమండ్రిలో కందుకూరి విద్యాసంస్థలను బసవపున్నయ్య పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా మహిళాభ్యుదయ ఉద్యమానికి కృషి చేశారన్నారు. తన గ్రామంలో దళితులను బోటులో ఎక్కించడానికి నిరాకరిస్తే దానిని వ్యతిరేకిస్తూ దళితుల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం, అంటరానితనం నిర్మూలన కోసం ఉద్యమించారని తెలిపారు. పి.మురళీకృష్ణ మాట్లాడుతూ... సమాజంలో సంస్కరణ భావాలను వెదజల్లిన వైతాళికుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లిన గొప్ప సిద్ధాంతకర్త బసవపున్నయ్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె బాధ్యులు టి.క్రాంతి, యు.వి.రామరాజు, ఐజాక్, పి.విజయ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల హత్య : ఓ కొడుకు ఘాతుకం

ప్రజాశక్తి-బాపట్ల : తల్లిదండ్రులను కన్నకుమారుడే కిరాతకంగా హత్య చేసిన ఘటన బాపట్ల మండలం అప్పికట్లలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...అప్పికట్లకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పాగోలు విజయభాస్కరరావు (70), వెంకట సాయికుమారి(65) దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు చీరాల బోసునగర్‌లో పోస్టల్ శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. తన తండ్రి ఉద్యోగ విరమణ అనంతరం వచ్చిన డబ్బులను, ఆస్తిపాస్తులను కుమార్తెకు ఇస్తున్నారనే అక్కసుతో తల్లిదండ్రులతో కుమారుడు గత కొన్ని రోజులుగా గొడవ పడుతున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి తల్లిదండ్రులపై దాడి చేసి హత్య చేశాడు. నిందితుడిని గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు పోలీసులు తరలించారు. బాపట్ల రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభ్యుదయ రచయిత్రి సత్యవతి కన్నుమూత

- మహిళా సంఘాల నేతలు నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ అభ్యుదయ రచయిత, సంస్కరణ వాది వేములపల్లి సత్యవతి (92) శనివారం తెల్లవారుజామున కన్నుమూశారు. వయోభార సమస్యలతో కుమారుడి ఇంట్లోనే మరణించారు. గత కొంతకాలంగా ఆమె హైదరాబాద్ ఉప్పల్‌లో కుమారుడి ఇంట్లో ఉంటున్నారు. ఉప్పల్ ప్రశాంతినగర్ శ్మశానవాటికలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె భర్త ప్రముఖ హేతువాది, రచయిత పోట్లూరి వెంకటేశ్వరరావు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్యవతి స్వగ్రామం నల్గొండ జిల్లా బిబి నగర్. హైదరాబాద్‌లోని పలు విద్యాసంస్థల్లో హిందీ టీచర్‌గా ఆమె సేవలందించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో స్ఫూర్తి పొంది తాపీ రాజమ్మతో కలిసి కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘాల్లో పనిచేశారు. తొమ్మిదేళ్ల వయస్సులోనే బాల్య వివాహాన్ని ఎదిరించారు. కమ్యూనిస్టు నాయకురాలు, ప్రజా వైద్యులు డాక్టర్ అచ్చమాంబ సహకారంతో విద్యనభ్యసించారు. మహిళలపై జరుగుతున్న హింస సంఘటనలపై స్పందించి పలు సందర్భాల్లో విశ్లేషణాత్మక రచనలు చేశారు. సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యంతో చాలా సన్నిహితంగా ఉండేవారు. ఉప్పల్‌లోని నివాసం వద్ద సత్యవతి భౌతికకాయానికి ఐద్వా నేతలు మల్లు లక్ష్మి, ఆశాలత, సామాజిక కార్యకర్త సునీత, తదితరులు నివాళు లర్పించారు. తన అమ్మమ్మగారి ఊరైన ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కాటూరుకు ఎక్కువగా వస్తుండేవారు.

ఐద్వా నేతల సంతాపం

ఆమె మృతి పట్ల ఐద్వా జాతీయ నాయకురాలు ఎస్. పుణ్యవతి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, పూర్వ కార్యదర్శి కె.స్వరూపరాణి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సుధా తదితరులు సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అభ్యుదయ వాదిగా, రచయితగా, ఉపాధ్యాయురాలిగా సమాజ సేవచేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.

ఆయిల్ పామ్ ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం

- పండ్ల సాగు ఆధారంగా క్లస్టర్ల ఏర్పాటు
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం గణనీయంగా పెంచి తద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం వచ్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో శనివారం వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, సూక్ష్మ సేద్యం విభాగ ప్రత్యేక అధికారితో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపొందించేందుకు, పరిశ్రమలకు మండలాల కేటాయింపులకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్‌ఫెడ్ పరిధిలో ఏలూరు జిల్లాలో నూతన ఆయిల్ పామ్ పరిశ్రమ నిర్మాణానికి డిపిఆర్ తక్షణమే రూపొందించాలన్నారు. సిఎం చంద్రబాబు సూచనలతో నూతన పరిశ్రమ నిర్మాణానికి వేగంగా చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. 2014-19 టిడిపి హయాంలో వ్యవసాయ యాంత్రీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1,226 కోట్లు ఖర్చు చేస్తే, ఐదేళ్ల జగన్ ప్రభుత్వం కేవలం రూ.367 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. వ్యవసాయ యంత్రపరికరాలు గడిచిన ఐదేళ్ల కాలంలో వినియోగం లేకపోవడంతో ఇప్పుడు కేటాయింపులు రూ.157 కోట్లకు వచ్చాయన్నారు. రాష్ట్రంలో పండ్ల తోటల సాగు ఆధారంగా క్లస్టర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన ఉత్పత్తులను పండించేలా, ఎగుమతులను పెంచేలా ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అందుకు తగినట్లు కసరత్తు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ కమిషనరు ఢిల్లీరావు, ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, సూక్ష్మసేద్యం విభాగ ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నెల్లూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బిల్లులు దహనం చేస్తున్న నాయకులు

ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి

- పలుచోట్ల విద్యుత్ బిల్లులు దహనం

ప్రజాశక్తి-యంత్రాంగం

టిడిపి కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం పలుచోట్ల విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలతో పాటు ఆదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని, ప్రీపెయిడ్ కరెంటు స్మార్ట్ మీటర్లు బిగించే ఆలోచనను తక్షణమే ఉపసంహరించుకోవాలని నినదించారు.

చిత్తూరు జిల్లా పలమనేరు విద్యుత్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ.. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. నెల్లూరులో బైపాస్ రోడ్డులోని మిలీనియం విద్యుత్ సబ్‌స్టేషన్, కిసాన్‌నగర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కరెంట్ బిల్లులు దహనం చేశారు. ముందుగా మినీ బైపాస్ రోడ్డులోని పిటిజె పెట్రోల్ బంక్ వద్ద నుండి మిలీనియం సబ్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు సొసైటీ సెంటర్లో ధర్నా నిర్వహించారు. అనంతరం కరెంట్ బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. యలమంచిలి శివాలయంపేట, కాపులపాలెం, చించినాడ అరుంధతీపేట వద్ద ఆదోళనలు నిర్వహించారు. ఉండి విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా, విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఆకివీడులో పలుచోట్ల కరెంటు బిల్లులను తగులబెట్టారు. విశాఖ నగరంలోని మధురవాడ శివశక్తినగర్‌లో సిఐటియు, ఐద్వా ఆధ్వర్యాన విద్యుత్ బిల్లులను దహనం చేశారు. తగరపువలస వై.జంక్షన్, అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు.

పార్వతీపురం పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆధ్వర్యాన బిల్లులను దహనం చేశారు. తక్షణమే ప్రభుత్వం ట్రూప్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో టవర్ క్లాక్ వద్ద సిపిఎం పట్టణ కార్యదర్శి జివెల్ నరసింహులు ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరులో విద్యుత్ బిల్లులు దహనం చేశారు.

గుంటూరుకు విజయపాల్ తరలింపు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

మాజీ ఎంపి, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో ముద్దాయిగా ఉన్న సిఐడి విశ్రాంత అదనపు ఎస్‌పి ఆర్.విజయపాల్ విచారణ ఒంగోలులో పూర్తయ్యింది. ఈయనను రెండు రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. ప్రత్యేక విచారణ అధికారిగా ప్రకాశం ఎస్‌పి దామోదర్ ఉండడంతో విజయపాల్‌ను శుక్రవారం విచారణ కోసం ఒంగోలుకు తీసుకొచ్చారు. శుక్ర, శనివారాల్లో విచారించారు. విచారణకు సహకరించలేదని, తనకేమీ తెలియదని, గుర్తులేదన్న సమాధానాలే విజయపాల్ నుంచి ఎక్కువగా వినిపించాయని సమాచారం. పోలీసు కస్టడీలో విచారణ పూర్తి కావడంతో ఆయనను గుంటూరుకు తరలించారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా సావిత్రి పూలే జయంతి : బిటిఎ విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా కొనియాడుతున్న సావిత్రిభాయి పూలే జయంతి జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ప్రతియేటా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చేబ్రోలు శరత్ చంద్ర, సౌపాటి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు.

జమిలి ఎన్నికలతో ప్రజాస్వామ్యానికి ముప్పు

- ఎన్నికల హామీలను విస్మరించడం తగదు
- సిపిఎం ఏలూరు జిల్లా మహాసభలో వి ఉమామహేశ్వరరావు

సిపిఎం ఏలూరు జిల్లా మహాసభలో మాట్లాడుతున్న వి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- బుట్టాయగూడెం

జమిలీ ఎన్నికలు దేశ ప్రజాస్వామ్యానికి ముప్పని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను విస్మరించడం తగదని అన్నారు. బుట్టాయగూడెంలోని ఆర్ సత్యనారాయణరాజు స్మారక ప్రాంగణంలో సిపిఎం ఏలూరు జిల్లా 26వ మహాసభ శనివారం ప్రారంభమైంది. తొలుత సిపిఎం జెండాను పార్టీ సీనియర్ నాయకులు గుత్తుకొండ వెంకట కృష్ణారావు ఆవిష్కరించారు. అనంతరం ఈ కాలంలో మృతి చెందిన నేతలకు, కార్యకర్తలకు నివాళులర్పించారు. ఆ తర్వాత తెల్లం రామకృష్ణ, డిఎన్‌విడి ప్రసాద్, కె.శ్రీనివాస్, ఎం.జీవరత్నం, ఎన్.పద్మాంజలి అధ్యక్షవర్గంగా ప్రతినిధుల మహాసభ ప్రారంభమైంది. ఉమామహేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేస్తూ భిన్నత్వంలో ఏకత్వానికి మన దేశం ప్రతి రూపమని, కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలతో దీనికి తీవ్ర విఘాతం కలుగుతోందని, ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ప్రస్తుతం రాజ్యాంగంపై చర్చ జరుగుతోందని, వందేళ్ల క్రితమే కమ్యూనిస్టులు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కావాలని ఉద్యమించారని గుర్తు చేశారు. అనివార్యంగా అప్పటి జాతీయ కాంగ్రెస్ సభలో స్వేచ్ఛ, స్వాతంత్రం కోసం తీర్మానం చేశారని తెలిపారు. సమాజానికి కమ్యూనిస్టుల అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తోందని, ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే భాష, ఒకే ఎన్నిక (జమిలి) పేరుతో ప్రజాస్వామ్యానికి ముప్పు తెస్తోందని వివరించారు. జమిలి ఎన్నికలకు వైసిపి, టిడిపి, జనసేన ఆమోదం తెలపడం బాధాకరమన్నారు. జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలు మనుగడ కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2047 విజన్ అంటూ, నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి అంటూ, శక్తి, సంపద, సామగ్రాభివృద్ధి అంటూ నిత్యం కార్పొరేట్ల జపం చేస్తున్నారని అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, నాణ్యమైన విద్యుత్ ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఎన్నికైన నాటి నుంచి ప్రజలపై భారాలు మోపడం, మోసగించడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని వివరించారు. బొగ్గు, నీటి, గాలితో విద్యుత్ తయారీకి తక్కువగా ఖర్చవుతున్నా కార్పొరేట్ల లాభాల కోసం ఛార్జీలు పెంచుతున్నారన్నారు. గతంలో జరిగిన విద్యుత్ ఉద్యమాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ మహాసభలో కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లాలో ప్రజా ఉద్యమాల బలోపేతానికి కార్యాచరణ ప్రణాళిక మహాసభలో సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు.

నీటి సంఘాల ఎన్నికల్లో ఘర్షణలు

- ఏలూరు, కాకినాడ, ఎన్‌టిఆర్ జిల్లాల్లో పలుచోట్ల వాయిదా

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఎక్కువచోట్ల ప్రశాంతంగా జరగగా..కొన్ని చోట్ల ఘర్షణలకు దారి తీసింది. ఏలూరు, కాకినాడ, ఎన్‌టిఆర్ జిల్లాల్లోని పలుచోట్ల ఎన్నికలను వాయిదా వేశారు. ఎన్‌ఒసి ఇవ్వలేదని పోలవరం మండలంలో వైసిపి నాయకులు నిరసనకు దిగారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలంలోని మొత్తం 144 నీటి సంఘాలకు 126 ఏకగ్రీవమయ్యాయని, 18 అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డాయని తహశీల్దార్ ప్రశాంతి తెలిపారు. బూరుగుగూడెం గ్రామంలోని 18 నీటి సంఘాలకు ఎన్నికలు జరగ్గా.. ఓటర్ లిస్టులో పేర్లు తప్పుగా నమోదు చేశారని, రైతులను వైసిపి నాయకులు బెదిరించారని, ఈ ఎన్నిక వాయిదా వేయాలని టిడిపి కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఎన్నికలను వాయిదా వేయించాలనే కుట్రతో ఈ విధంగా మాట్లాడుతున్నారని వైసిపి నాయకులు, కార్యకర్తలు అన్నారు. ఈ నేపథ్యంలో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ జరిగింది. ఇరు గ్రూపుల నాయకులు, కార్యకర్తలు నెట్టుకుంటూ పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఎన్నికల అధికారుల వద్దకు వెళ్లి ఎన్నికల పత్రాలు చించివేశారు. దీంతో ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పోలవరం మండలం కొత్తపట్టిసీమలో తమకు కావాలనే ఎన్‌ఒసి ఇవ్వలేదంటూ స్థానిక వైసిపి నాయకులు నిరసనకు దిగారు.

కాకినాడ జిల్లా గొల్లప్రోలులో పోలింగ్ కేంద్రంలోకి దూసుకువెళ్తున్న వైసిపి నాయకులు

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం ఎ.కొత్తపల్లిలో రెడ్డివాని పెద్దవాని చెరువుకు జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో కొందరు ఓటర్లు సకాలంలో పోలింగ్ కేంద్రానికి చేరుకోకపోవడంతో వారిని ఎన్నికల అధికారులు లోపలికి అనుమతించలేదు. దీంతో వారంతా ఆందోళనకు దిగారు. ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో ఎన్నికల అధికారి కె.అప్పారావు ఎన్నికను వాయిదా వేశారు. ఈ క్రమంలో ఆయన పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తుండగా కొందరు రైతులు ఆయనను అడ్డగించే ప్రయత్నం చేశారు. పోలీసు రక్షణలో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. కె.కోటపాడు మండలంలో వి.సంతపాలెం నాగారాయుడు చెరువు, గొండు పాలెం సీతమ్మ చెరువుల ఎన్నికలు వివాదాల కారణంగా నిలిచిపోయాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తి నీటి సంఘం ఎన్నికల సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. టిడిపి కూటమి పార్టీల నాయకులు, వైసిపి నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ఎన్నికను నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు.

కృష్ణాజిల్లా పెడనలోని నందిగామ సబ్‌డివిజన్ మూడవ నంబర్‌లో టిడిపి నాయకులు బలపరిచిన వ్యక్తికి కేవలం రెండు ఓట్లు మాత్రమే రావడంతో ఎన్నికల అధికారిపై ఆయన దాడికి దిగారు. ఎన్నికల అధికారి చేతికి గాయమైంది. ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం మండలం గణపవరంలో టిడిపిలో రెండు గ్రూపుల మధ్య పోరు కాస్త ఎన్నిక వాయిదాకు దారితీసింది. ఎన్నికలకు సంబంధించి టిడిపిలోని ఒక గ్రూపు వారు తమకు సమాచారం ఇవ్వలేదని అధికారులపై వాదనకు దిగారు. అక్కడే ఉన్న వైసిపి, టిడిపిలోని మరో గ్రూపు వారు ఎన్నిక నిర్వహించాలని పట్టుబట్టారు. సమయం దాటి పోవడంతో ఎన్నికను వాయిదా వేసినట్లు రిటర్నింగ్ అధికారి ఎస్.ఆనంద కుమారి ప్రకటించారు. రెడ్డిగూడెం మండలంలోని రంగాపురం రావుల చెరువుట్యాంకు ఎన్నిక వాయిదా పడింది. తమకు మెజార్టీ ఉండడంతో టిడిపి వారు ఎన్నికను అడ్డుకునేందుకు ప్రయత్నించి గొడవకు దిగారని వైసిపి వారు ఆరోపించారు. దీంతో ఎన్నికను వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.

హక్కులను కాలరాస్తున్న పాలకులు

- ప్రజాచైతన్యంతోనే తిప్పికొట్టగలం
- మానవ హక్కుల వేదిక మహాసభలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజాస్వామిక హక్కులను పాలకులు కాలరాస్తున్నారని పలువురు వక్తలు విమర్శించారు. ప్రజాచైతన్యం ద్వారానే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడం సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు. అనంతపురంలోని యాపిల్ ఫంక్షన్ హాల్‌లో మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభ శనివారం ప్రారంభమైంది. ఈ మహాసభకు మన రాష్ట్రంతోపాటు తెలంగాణ నుంచి కూడా ప్రతినిధులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ మానవహక్కుల వేదిక అధ్యక్షులు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో మాజీ ఎమ్మెల్సీ, మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ.. నిత్యం కరువుకు నిలయమైన అనంతపురం జిల్లా పౌర ఉద్యమాలకు పెట్టింది పేరని అన్నారు. మానవ హక్కుల వేదిక ఉద్యమంతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా పంచుకున్నారు. 2009లో అనంతపురంలో జరిగిన మానవహక్కుల వేదిక మూడవ రాష్ట్ర మహాసభలోనూ బాలగోపాల్‌తో కలిసి పాల్గొన్నట్టు గుర్తు చేశారు. అనంతరం దేశంలో ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక స్థితిగతులతోపాటు, ప్రజా ఉద్యమాలను పాలకులు ఏ రకంగా అణచివేస్తున్నారన్న విషయాలను ఆయన తెలియజేశారు. ప్రజాచైతన్యంతోనే ఈ విధానాలను తిప్పికొట్టగలమని సూచించారు. ఈ మహాసభ నిర్మాణాత్మకంగా జరిగి విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఒపిడిఆర్ నాయకులు రామ్‌కుమార్ పాల్గొని సౌహార్ద సందేశం ఇచ్చారు. నేడు దేశంలో ప్రశ్నించే గొంతుకలను నిర్దాక్షిణ్యంగా పాలకులు అణచివేస్తున్నారని విమర్శించారు. ఆదివాసీ సమస్యలపై పోరాడే స్టాలిన్‌ను ఏరకంగా నిర్బంధించి చంపేశారని తెలిపారు. ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వర్గాల తరపున గొంతెత్తేందుకు పౌరహక్కుల సంఘాలు మరింతగా ముందుకు పోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో కలిసొచ్చే అందరితోనూ తాము పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భుజంగరావు మాట్లాడుతూ దేశంలో ప్రజా సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఈ క్రమంలో మానవ హక్కులు సైతం హరించివేయబడుతున్నాయని తెలిపారు. ప్రధానంగా అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే క్రమంలో ఆదివాసీలను నిర్వాసితులుగా మార్చేస్తున్నారని అన్నారు. ఆదివాసీ హక్కులను పాలకులు కాలరాస్తున్నారని తెలిపారు. డెమోక్రటిక్ పీపుల్స్ ఫోరం నాయకులు శ్రీధర్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకులను ఫేక్ ఎన్‌కౌంటర్ల పేరుతోనూ, ఇతర రూపాల్లోనూ అణచివేస్తున్నారన్నారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్య తీసుకురావాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్ రసూల్, ఎస్ఎం.బాషా, జిల్లా నాయకులు సుబ్బన్న, ఆహ్వాన సంఘం నాయకులు దాదా గాంధీ తదితరులు పాల్గొన్నారు.


మహాసభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

సచివాలయాల్లో అనధికార డిప్యుటేషన్లు రద్దు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు అనధికారికంగా ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో వీరిని తక్షణం వెనక్కి పిలిపించుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 1,806 మంది కార్యదర్శులు డిప్యుటేషన్లపై ఇతర శాఖల్లో, ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నట్లు గుర్తించారు. వాస్తవానికి అత్యవసర పరిస్థితుల్లో కేవలం వారం రోజులు మాత్రమే వీరికి డిప్యుటేషన్‌కు అనుమతిచ్చేందుకు నిబంధనలు అవకాశం కల్పిస్తాయి. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న డిప్యుటేషన్లు మాత్రం నిబంధనలకు వ్యతిరేకంగా జరిగినట్లు గుర్తించారు. సొంత శాఖలో కాకుండా ఇతర శాఖల్లో విధులు నిర్వహిస్తుండడం వల్ల సచివాలయాల్లో పనులు స్తంభించిపోతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

లక్ష్యాలను అధిగమించడంలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులను రాజధాని అభివృద్ధి ప్రాంత పరిధిలో తప్ప మిగిలిన అన్ని ప్రాంతాల్లో డిప్యుటేషన్లను రద్దు చేసి, కార్యదర్శులను వెనుక్కు పిలిపించాలని ఆదేశించింది.

వేలకోట్ల విద్యుత్ భారాలు

- స్కీమ్‌వర్కర్లను తొలగించేందుకు ప్రభుత్వం కుట్ర
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ
- రెండో రోజూ కొనసాగిన జిల్లా మహాసభ

మాట్లాడుతున్న సుబ్బరావమ్మ, వేదికపై శ్రీనివాసరావు, తదితరులు

ప్రజాశక్తి- చీమకుర్తి, ఒంగోలు బ్యూరో

ట్రూ అప్ ఛార్జీల పేర విద్యుత్ ఛార్జీలను పెంచారని, ప్రజలపై కోట్లాది రూపాయల భారాలను మోపుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. సుబ్బరావమ్మ విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగులగొట్టాలని చెప్పిన లోకేష్... అధికారంలో వచ్చాక, షాపులకు కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. త్వరలో ఇళ్లకు కూడా స్మార్ట్ మీటర్లు బిగించడానికి సిద్ధం అవుతున్నారని వివరించారు. చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో (కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్)లో రెండోరోజైన శనివారం సిపిఎం జిల్లా మహాసభ సందర్భంగా ప్రతినిధుల సభ జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ ప్రారంభోపన్యాసం చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రాగానే స్కీమ్ వర్కర్లను తొలగించేందుకు సిద్ధమైందని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలతో బలవంతంగా రాజీనామాలు చేయించారని, వారి స్థానంలో అధికార పార్టీకి చెందిన వారిని నియమిస్తున్నారని తెలిపారు. ఇసుక సమస్య నేటికీ పరిష్కారం కాలేదని, మహిళలు వద్దన్నా మద్యాన్ని ఊరూవాడా విచ్చలవిడిగా బెల్టుషాపుల ద్వారా విక్రయిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై వచ్చిన వ్యతిరేకతను దారి మళ్లించడానికి, అణచివేయడానికి మతోన్మాద అజెండాతో పాటు క్రిమినల్ చట్టాలలో మార్పులు తీసుకొచ్చారని విమర్శించారు. ఉద్యమాలను, హక్కులను కాలరాసేందుకే క్రిమినల్ చట్టాలలో మార్పులు చేశారని పేర్కొన్నారు. చేతులకు బేడీలు వేసే పద్ధతిని పునరుద్ధరించారని తెలిపారు. జమిలి ఎన్నికలను కేంద్రం ముందుకుతెచ్చిందని, ప్రతిపక్షాలు, ప్రజలు వ్యతిరేకిస్తున్న కేబినెట్ ఆమోదించిందన్నారు. కీలక రంగాలన్నింటినీ అదానీ, అంబానీలకు అప్పగిస్తున్నారని విమర్శించారు. రైతుల భూములను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. విద్య, వైద్యం గిరిజనులకు అందడం లేదని పేర్కొన్నారు. అదానీ విద్యుత్ కుంభకోణంపై చంద్రబాబు, జగన్ మౌనం దాల్చారన్నారు. ప్రజల హక్కులను కాపాడేందుకు పోరాటాలతో, ఉద్యమాలతో ముందుకు పోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. సభకు అధ్యక్షవర్గంగా పూనాటి ఆంజనేయులు, సోమయ్య, కె.రమాదేవి వ్యవహరించారు. జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ రాజకీయ నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు హాజరై మహాసభను పర్యవేక్షించారు. మహాసభ ప్రారంభ సూచికగా ఎర్ర జెండాను సీనియర్ నాయకులు జాలా అంజయ్య ఆవిష్కరించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి సీనియర్ నాయకులు వై.సిద్దయ్య పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పమిడి కోటయ్య చిత్రపటానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, తవనం చెంచయ్య చిత్రపటానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు, అంద్రా మాల్యాద్రి పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న సిఎం చంద్రబాబు

డోకిపర్రు వెంకన్న సేవలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు (కృష్ణా జిల్లా)

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు మహాక్షేత్రంలోని వెంకటేశ్వర స్వామిని శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దర్శించుకున్నారు. ముందుగా తాడేపల్లిలోని తన నివాసం నుంచి హెలీకాప్టర్‌లో డోకిపర్రుకు చేరుకున్నారు. అక్కడి నుంచి వాహనంలో మహాక్షేత్రానికి చేరుకున్న సిఎంకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పివి కృష్ణారెడ్డి, సుధా దంపతులు స్వాగతం పలికారు. శ్రీ వెంకటేశ్వర స్వామి అంతరాలయంలో చంద్రబాబు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో వేదపండితులు సిఎంను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందించారు. సిఎం వెంట ఎంఇఐఎల్ డైరెక్టర్ సిహెచ్.సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

రైతు వినోద్‌కుమార్ ఆత్మహత్యకు బాధ్యులపై చర్యలు

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నెల్లూరు జిల్లా రైతు నక్కల వినోద్‌కుమార్ ఆత్మహత్యకు కారణమైన ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని, రైతు కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇదే అంశంపై సిఎం చంద్రబాబు, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు లేఖ రాశామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే నిర్వాసితులను సమీకరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. రామాయపట్నం పోర్టు నిర్మాణానికి భూ సేకరణలో భూమి సేకరించి ఏళ్లు గడుస్తున్నా పరిహారం రాక, పరిహారం వస్తుందో రాదో అనే ఆందోళనతో యువ రైతు వినోద్‌కుమార్ బలవన్మరణానికి పాల్పడటం ప్రభుత్వ యంత్రాంగంలో రైతుల పట్ల, రైతుల జీవనోపాధి సమస్యల పట్ల ఉన్న నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోందన్నారు. రామాయపట్నం ఓడరేవు నిర్మాణంలో భూమి కోల్పోయి ఎందరికి మొరపెట్టుకున్నా పరిహారం రాకపోవడంతో వినోద్‌కుమార్ మనస్తాపానికి గురై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ ఘటనలో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి అప్పటి అధికార పార్టీ నేతల ఆదేశాలతో తనకు రావాల్సిన పరిహారం రాకుండా అన్యాయం చేశారని, తన ఆత్మహత్యకు గల కారణాలను సెల్ఫీ వీడియో ద్వారా సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. యువరైతు ఆత్మహత్యకు కారణమైన డిప్యూటీ కలెక్టర్ పద్మావతిపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకులు, రెవెన్యూ అధికారులు రైతుల జీవితాలతో ఏ రకంగా ఆటలాడుతున్నారో ఈ ఘటన స్పష్టం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశ్రామికవాడలో ఉద్యోగాలు కల్పిస్తాం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి- రణస్థలం (శ్రీకాకుళం జిల్లా)

పైడిభీమవరం పారిశ్రామికవాడలో కొత్తగా ఉద్యోగాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలోని డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ అతిథి గృహంలో ఎచ్చెర్ల, రణస్థలం, పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. అనంతరం మంత్రి కొండపల్లి విలేకరులతో మాట్లాడుతూ.. పైడిభీమవరం పారిశ్రామికవాడలో ప్రస్తుతం 30 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని, ఆ సంఖ్యను 50 వేలకు పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామికరంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని, తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడి రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని అన్నారు. పైడిభీమవరం పారిశ్రామికవాడలో తాగునీటి లభ్యతపై ఆందోళన వ్యక్తమవుతోందని తెలిపారు. తారక రామ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ఆ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. వ్యర్థ జలాలను శుద్ధ జలాలుగా మార్చి స్థానిక అవసరాలకు వినియోగించుకోవచ్చని అన్నారు. పారిశ్రామికవాడలో కాలుష్య నియంత్రణకు కఠినమైన ఆంక్షలను విధించినట్లు తెలిపారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ ఈశ్వరరావు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా రాష్ట్రానికే తలమానికమైన పైడిభీమవరం పారిశ్రామికవాడను మరింత అభివృద్ధి చేసేందుకు రోడ్ మ్యాప్ రూపొందించినట్లు వివరించారు. సమావేశంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపులో రాష్ట్రానికి అవార్డు

- అందుకున్న ఎపిఎస్‌ఇసిఎం సిఇఒ కుమార్ రెడ్డి

ఇంధన పొదుపులో అవార్డు అందుకుంటున్న ఎపిఎస్‌ఇసిఎం సిఇఒ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భవనాలు, పరిశ్రమలు, మున్సిపాల్టీ, వ్యవసాయం, డిస్కామ్‌లు, రవాణా రంగాల్లో ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య చర్యలను ప్రోత్సహించడం, అమలు చేయడంలో సుస్థిర ప్రదర్శన కనబరిచినందుకు జాతీయ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు-2024 రాష్ట్రానికి దక్కింది. రాష్ట్ర ఎనర్జీ ఎఫిషియెన్సీ పెర్ఫార్మెన్స్ అవార్డు (గ్రూప్-2) విభాగంలో మొదటి బహుమతి దక్కింది. జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కేంద్ర పునరుత్పాదక విద్యుత్‌శాఖ మంత్రి శ్రీపాద్ నాయక్, కేంద్ర విద్యుత్‌శాఖ అదనపు కార్యదర్శి నాగులపల్లి శ్రీకాంత్ చేతుల మీదగా రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ సిఇఒ బివివిపి కుమార్ రెడ్డి ఈ అవార్డును న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వం, ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సహాయ సహకారాలు, అన్ని ప్రభుత్వ విభాగాలు, వినియోగదారుల సహకారంతో ఈ అవార్డు సాధించినట్లు చెప్పారు. ప్రభుత్వం అన్ని విభాగాల్లో ఎనర్జీ ఎఫిషియెన్సీని ప్రోత్సహించడానికి ఎనర్జీ కన్జర్వేషన్ సెల్‌ను ఏర్పాటు చేసి కార్యక్రమాలను అమలు చేసిందని తెలిపారు. క్లీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు, స్థానిక ఉపాధి అవకాశాలను కల్పించేందుకు, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 దోహదపడుతుందన్నారు. అవార్డును కైవసం చేసుకునేందుకు రాష్ట్రం ఎంతో కృషి చేసిందని చెప్పారు. రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్‌కు సహకారం అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపితో మాట్లాడుతున్న పట్టణ సిఐ నరసింహులు

రెండోరోజూ కడప ఎంపి అవినాష్‌రెడ్డి హౌస్ అరెస్టు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డిని పోలీసులు రెండోరోజూ హౌస్ అరెస్ట్‌లో ఉంచారు. నీటి సంఘాల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా శుక్రవారం, శనివారం రెండు రోజులు పాటు పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అర్ధరాత్రి నుంచి అవినాష్ ఇంటి దగ్గరే పోలీసులు గస్తీ నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు అవినాష్‌రెడ్డి తన ఇంటి నుంచి వైసిపి కార్యాలయానికి చేరుకున్నారు. ఉన్నతాధికారుల అనుమతి వచ్చేంత వరకు బయటకు వెళ్లకూడదని ఎంపితో పట్టణ సిఐ నరసింహులు చెప్పారు. నీటి సంఘాల ఎన్నికలను తమ పార్టీ బహిష్కరించిందని, తనను అడ్డుకోవడం ఏంటని, తనకు వ్యక్తిగత పనులు ఉన్నాయని అడ్డు తప్పుకోవాలని పోలీసులను కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పనిచేస్తున్నామని పోలీసులు సమాధానం చెప్పడంతో ఆయన ఎస్‌పికి ఫోన్ చేశారు. ఆయన స్పందించకపోవడంతో పార్టీ కార్యాలయంలోనే వైసిపి నాయకులు, కార్యకర్తలతో ఉండిపోయారు.

మరో గ్రంథాలయ ఉద్యమానికి శ్రీకారం

- ప్రముఖులు, సాహితీవేత్తల పిలుపు

గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ ప్రదర్శనలో సాహితీవేత్తలు, ప్రచురణ కర్తలు

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

మరో గ్రంథాలయ ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సిన సమయం ఆసన్నమైందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సాహిత్య, సాంస్కృతిక సంస్థలు, పుస్తక ప్రచురణకర్తల ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమంలో భాగంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద నుండి కార్ల్ మార్క్స్ రోడ్డు, బీసెంట్ రోడ్డు మీదుగా లెనిన్ సెంటరు వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో వివిధ సంస్థల ప్రతినిధులు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు, విజ్ఞాన సందేశాలతో కూడిన నినాదాల ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగు నాట సామాజిక చైతన్య సాధనలో, పురోగమనంలో గ్రంథాలయాలు ఎంతో గొప్ప పాత్ర పోషించాయన్నారు. 1914లో దేశ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం వంటి వారు సాగించిన పోరాట ఫలితంగా 1956లో గ్రంథాలయ చట్టం ఏర్పడిందని వివరించారు. ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న గ్రంథాలయాల పరిస్థితి నేడు రోజురోజుకూ దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివ ప్రసాద్ అధ్యక్షోపన్యాసం చేస్తూ 1914లో గ్రంథాలయ ఉద్యమం విజయవాడ నుండే ప్రారంభమైందని గుర్తు చేస్తూ, అదే స్ఫూర్తితో ఇప్పుడు ఇక్కడి నుండే పునర్వికాస ఉద్యమం ప్రారంభించినట్లు తెలిపారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కొత్తగా గ్రంథాలయాలు ప్రారంభించడం, పాత వాటిని ఆధునీకరించడం, పుస్తకాలు కొనుగోలు చేయడం, అవసరమైన సిబ్బందిని నియమించడం వంటివి జరుగుతున్నాయని, మన రాష్ట్రంలో మూడేళ్ల క్రితం గ్రంథాలయాల కోసం కొనుగోలు చేసిన పుస్తకాలకు ఇప్పటివరకు ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని తెలిపారు. ప్రముఖ రచయిత దేవినేని మధుసూదనరావు మాట్లాడుతూ ఇటీవల మెక్సికో, జపాన్ దేశాలను సందర్శించానని, అక్కడ గ్రంథాలయాల నిర్వహణ ఎంతో గొప్పగా ఉందని వివరించారు. సాహితీ స్రవంతి కార్యదర్శి వొరప్రసాద్, జనసాహితీ నాయకులు చందు నాగేశ్వరరావు, ప్రచురణ కర్తలు కె.లక్ష్మయ్య (ప్రజాశక్తి), టి.మనోహర్ నాయుడు (విశాలాంధ్ర), వెంకట నారాయణ (పల్లవి), గుత్తికొండ లక్ష్మి (సాహితీ) మాట్లాడుతూ ప్రజలు చెల్లిస్తున్న ఆస్తి పన్నులో గ్రంథాలయ పన్ను కూడా ఉంటుందని, కానీ దాని ద్వారా వస్తున్న ఆదాయంలో గ్రంథాలయాల నిర్వహణకు ఇవ్వాల్సిన డబ్బులను ప్రభుత్వాలు ఇవ్వడంలేదని అన్నారు. పిల్లలకు బాల్యం నుండి చదువు పట్ల ఆసక్తి పెంచి విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు ప్రవచనాలు చెపితే జ్ఞానం రాదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు పిన్నమనేని మురళీకృష్ణ, అక్కినేని వనజ, చంద్రరావు, గోళ్ల నారాయణరావు, మోతుకూరి అరుణ కుమార్, చలపాక ప్రకాష్, చిన్నం పెంచలయ్య, పి.చంద్రనాయక్, ఆర్.పిచ్చయ్య, సింగంపల్లి అశోక్ కుమార్, చిగురుపాటి భాస్కరరావు, కొప్పర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హోదాతోనే రాష్ట్రానికి విజన్ : షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎప్పటికైనా ప్రత్యేక హోదాతోనే రాష్ట్రానికి విజన్ అని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి టిడిపి మద్దతు ఇస్తున్నందున విభజన హామీలపై ప్రధానిని నిలదీయాలని సిఎం చంద్రబాబును డిమాండ్ చేస్తూ 'ఎక్స్'లో శనివారం పోస్టు పెట్టారు. కేంద్రం గల్లా పట్టి రాష్ట్ర హక్కులను సాధించాలని సూచించారు. ప్రజలకు చంద్రబాబు మరోసారి విజన్ - 2047 పేరుతో అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం దశ - దిశ మారాలంటే కావాల్సింది విజన్లు కాదని, విభజన హామీల అమలు అని అన్నారు. విభజన సమయంలో యుపిఎ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టులు జాతీయ హోదా, నూతన రాజధానికి ఆర్థిక సహాయం, బుందేల్ ఖండ్ తరహాలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిందని చెప్పారు. కడపలో స్టీల్ ఫ్యాక్టరీ, దుగరాజపట్నం పోర్టు, నూతన రైల్వే జోన్, పెట్రోలియం వర్సిటీ, వంటి అనేక అంశాలను చట్టంలో పొందుపరిచిందన్నారు. గడిచిన పదేళ్లలో ప్రత్యేక హోదా వచ్చి ఉంటే పన్నుల్లో రాయితీలు ఉండేవని, వేల సంఖ్యలో కొత్త పరిశ్రమలు వచ్చేవని, లక్షల్లో ఉపాధి అవకాశాలు లభించేవని తెలిపారు. విభజన హామీలు బుట్టదాఖలు చేయడంలో ప్రధాన ముద్దాయి ప్రధాని మోడీ, రెండో ముద్దాయి చంద్రబాబు, మూడో ముద్దాయి జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ముగ్గురూ కలిసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని చెప్పారు. 25 మంది ఎంపిలను ఇస్తే ఎందుకు ఇవ్వరో చూస్తానని శపథాలు చేసిన జగన్.. రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేశారన్నారు.

రాజధానిలో మరో రూ.20 వేల కోట్లతో అభివృద్ధి పనులు

- ఎక్కువ మంది ఇళ్లు కోల్పోకుండా రోడ్ల నిర్మాణం : మంత్రి నారాయణ

వెంకటపాలెం వద్ద రహదారులకు సంబంధించిన డిజైన్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, అధికారులు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతి నిర్మాణ పనులకు సంబంధించిన రూ.22 వేల కోట్ల టెండర్లకు సిఆర్‌డిఎ అథారిటీ ఇప్పటికే ఆమోదం తెలిపిందని, సోమవారం జరిగే సమావేశంలో మరో రూ.20 వేల కోట్లకు అనుమతులు పొందుతామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. రాజధానిలోని రహదారులు, పలు నిర్మాణాలను పరిశీలించేందుకు ఆయన మంగళగిరి, ఎర్రబాలెం, నవులూరు, వెంకటపాలెంలో శనివారం పర్యటించారు. 16వ నంబరు జాతీయ రహదారికి అనుసంధానం చేసే ఇ11, ఇ13 రోడ్లు నిర్మించే ప్రాంతాలు, పశ్చిమ బైపాస్ నిర్మాణ పనులు, వెంకటపాలెం వద్ద కృష్ణా నదిపై నిర్మాణంలో ఉన్న విజయవాడ వెస్ట్ బైపాస్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజధాని కోసం 58 రోజుల్లో 34 వేల ఎకరాల భూమిని రైతులు స్వచ్ఛందంగా ఇచ్చారని, అమరావతి నిర్మాణానికి ఉన్న ఇబ్బందులను తొలగించుకుంటూ వచ్చామని తెలిపారు. 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో తూర్పు నుండి పడమరకు 16 రోడ్లు, ఉత్తరం నుండి దక్షిణానికి 18 రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకొని రాజధాని నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. సీడ్ కేపిటల్ నుంచి ఇ11, ఇ13, ఇ15 రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానం చేసేలా డిజైన్లు సిద్ధం చేస్తున్నామన్నారు. రోడ్ల నిర్మాణానికి అటవీ భూమి తీసుకునే ప్రక్రియ చివరి దశకు వచ్చిందని తెలిపారు. ఇ11 రోడ్డు ఎయిమ్స్ పక్కన సర్వీసు రోడ్డులో కలుస్తుందని, ఇ13 రోడ్డు డిజిపి కార్యాలయం పక్కన కలుస్తుందని వివరించారు. రోడ్ల నిర్మాణంలో ఇళ్లు కోల్పోయేవారు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

15,547 కోట్ల యుపిఐ లావాదేవీలు

న్యూఢిల్లీ : యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ), ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు రూ.223 లక్షల కోట్ల విలువ గల 15,547 కోట్ల లావాదేవీలను పూర్తి చేసినట్లు ఆర్థిక మంత్రిత్వశాఖ శనివారం వెల్లడించింది. భారత్‌కు సంబంధించిన డిజిటల్ చెల్లింపుల విప్లవం ఇతర దేశాలకు కూడా వేగంగా విస్తరిస్తోంది. ప్రస్తుతం యుపిఐ... యుఎఇ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్ వంటి కీలక మార్కెట్లలో పనిచేస్తోంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) ద్వారా 2016లో ప్రారంభమైన యుపిఐ, ఒక మొబైల్ అప్లికేషన్‌తో బహుళ బ్యాంకు ఖాతాలను ఏకీకృతం చేయడం ద్వారా దేశానికి సంబంధించిన చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది. ఈ సిస్టం ద్వారా ఇబ్బందులు లేకుండా నిధుల బదిలీ, వ్యాపారులకు చెల్లింపులు, పీర్-టు-పీర్ లావాదేవీలను అనుమతినిస్తుంది. 2024, అక్టోబర్‌లో యుపిఐ (1,658 కోట్ల ఆర్థిక లావాదేవీలతో) రూ.23.49 లక్షల కోట్ల విలువ గల లావాదేవీలను ప్రాసెస్ చేసింది. 632 బ్యాంకులు యుపిఐ ప్లాట్‌ఫామ్‌కు అనుసంధానం కలిగి ఉన్నాయి.

'ఆధునీకరణ' ఒప్పందాల్లో అవినీతి?

- విశాఖ పోర్టు బెర్తుల అగ్రిమెంట్లలో అవకతవకలు
- చేతులు మారుతున్న కోట్ల రూపాయలు
- బిజెపి పిపిపి విధానంతో తప్పుడు పద్ధతులకు ఆస్కారం

విశాఖ పోర్టు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల పదిన చోటుచేసుకున్న విశాఖ పోర్టులోని వెస్ట్ క్యూ-6 (డబ్ల్యూ-6) బెర్తు ఆధునీకరణ వ్యవహారం విశాఖ పోర్టు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పోర్టులోని బెర్తుల ఆధునీకరణ విషయంలో జరుగుతున్న ఒప్పందాలు నీతిబద్ధమైవేనా? అనే ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. పిపిపి విధానం కొందరు అధికారులకు, ప్రైవేట్ ఆపరేటర్లకు కాసులు కురిపించేదిగా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ఒప్పందాల అనుభవాలను, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికను కేంద్ర ప్రభుత్వం, పోర్టు అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

తాజా ఒప్పందం కథాకమామిషు...

ఈ నెల పదిన వెస్ట్ క్యూ-6 (డబ్ల్యు-6) బెర్తు ఆధునికీకరణ కోసం విశాఖ పోర్టు అథారిటీ మెస్సర్స్ ఇంటిగ్రేటెడ్ కార్గో టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్‌కు చెందిన ఎస్‌పివి కంపెనీ)తో విశాఖ పోర్టు ఒప్పందం చేసుకుంది. ఇందుకోసం రూ.165.70 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు నిర్ణయించారు. దీంట్లో రూ.77.20 కోట్లు సదరు యాజమాన్యం చెల్లించినట్లు పోర్టు వర్గాలు వెల్లడించాయి. ఈ బెర్తు ద్వారా 5.18 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక నిర్వహణ సామర్థ్యానికి తగ్గకుండా కార్గో చేయాలన్నది ఒప్పందం. 30 ఏళ్లపాటు ఈ కాంట్రాక్టు అమల్లో ఉంటుంది. 18 నెలల్లో బెర్త్ ఆధునీకరణలో భాగంగా రెండు కొత్త హార్బర్ మొబైల్ క్రేన్‌లు, రెండు మొబైల్ హాపర్‌లు, లోడర్లు, ట్రక్కులు, ఫోర్క్ లిఫ్ట్‌లు, ఇతర ఆధునిక పరికరాలను అందుబాటులోకి తేవాల్సి ఉంది. వంద మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనున్నట్లు విశాఖపట్నం పోర్టు అథారిటీ (విపిఎ) కార్యదర్శి టి.వేణుగోపాల్ వెల్లడిస్తున్నారు.

ఇదే బెర్తుపై గతంలో ఏం జరిగింది?

వెస్ట్ క్యూ-6 బెర్తును ఎబిజి ఇంటర్నేషనల్‌కు రెండేళ్ల క్రితం పిపిపిలో పోర్టు ఇచ్చింది. ఈ సంస్థ యజమాని బెర్తును ఆధునీకరణ వసతులతో నిర్మించాడు. నిబంధనల ప్రకారం ఎంతైతే లోతులో తవ్వాలో అంతే తవ్వి క్రేన్‌లను ఏర్పాటు చేసుకున్నారు. అయితే, వ్యాపారం సక్రమంగా చేయలేదు. దీంతో, పోర్టు యాజమాన్యం ఈ ఎబిజి ఇంటర్నేషనల్ కంపెనీని టెర్మినేట్ చేసింది. అంతా బాగా ఉన్న ఈ వెస్ట్ క్యూ-6 బెర్తుపై ఇప్పుడు రూ.165 కోట్లు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చిందని తాజాగా పోర్టులో చర్చ జరుగుతోంది. పిపిపికి ఇవ్వాల్సిన అవసరం లేకపోయినా, ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి పోర్టు కార్గో హ్యాండ్లింగ్ ద్వారా ఏటా రూ.500 కోట్లకుపైగా టర్నోవర్ సాధిస్తోంది. ఈ క్రమంలో బెర్తులను పోర్టు యాజమాన్యమే నిర్వహించుకుని ముందుకెళ్లాల్సిన సమయంలో పిపిపికి మరో ఆపరేటర్‌కు ఇచ్చేశారు. ఒకవేళ నిజంగా ప్రైవేట్ వ్యక్తే ఇంత డబ్బు పెడతాడా? పెడితే అదంతా రికవరీ చేసుకోకుండా ఎలా ఉంటాడు? అన్నది ప్రశ్న. గత పిపిపి ఆపరేటర్ వల్ల పోర్టుకు వచ్చిన లాభం ఏమిటి? నష్టం ఎంత? అనే వివరాలను ఎక్కడా విశాఖ పోర్టు యాజమాన్యం బయటపెట్టలేదు.

పిపిపి విధానమంటేనే మోసం.. అధికారులకు వరం!

పిపిపి విధానంలో ప్రైవేట్ ఆపరేటర్ చేసే భాగోతాన్ని పరిశీలిస్తే.. బ్యాంకుల వద్దకు వెళ్లి వర్కింగ్ కేపిటల్ పేరుతో సదరు ఆపరేటర్ రుణం తీసుకుంటారు. గతంలో అదానీ అలా చేసి వ్యాపారం చేయకుండా చేతులెత్తేసి పోర్టును మోసగించి సుమారు రూ.220 కోట్లు తనకు చెల్లించాలంటూ వాదనకు దిగారు. ఆ విషయంలో అదానీకి వత్తాసుగా కేంద్రంలోని మోడీ సర్కారు 2017లో ముందుకొచ్చింది. అదానీ కట్టాల్సిన లీజు సొమ్మును, ఆయన వదిలేసి వెళ్లిన ఎక్విప్‌మెంట్‌ను బ్యాలెన్స్ చేసుకోవాలని ఉచిత సలహా ఇచ్చి పోర్టు ఆదాయానికి కేంద్రం గండి కొట్టింది. గతంలో ఎస్‌ఇ వేర్ హౌసింగ్ సంస్థ పోర్టులో కన్వేయర్ బెల్టును వదిలేసి వెళ్లిపోయింది. 2012లో వేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పిపిపి విధానం ఫెయిలైనట్లు నివేదించింది. ఆ విషయాన్ని కేంద్ర బిజెపి సర్కారు పెడచెవిన పెట్టి పోర్టులకు నష్టం చేస్తోంది.

సంపాదకీయం

రక్షణ కవచం

'వేగం కన్నా... ప్రాణం మిన్న', 'అతి వేగం... ప్రాణానికే ప్రమాదం...' వంటి సూక్తులు నిత్యం వింటుంటాం. బైక్ నడపడంలో తాము నేర్పరులమని, శిరస్త్రాణం అవసరం లేదని, ఇది శిరోభారం మాత్రమేనని భావిస్తుంటాం. శిరస్త్రాణం (హెల్మెట్) ఒక రక్షణాస్త్రం... ద్విచక్ర వాహనదారుల తలకు భద్రత కల్పించే రక్షణ కవచం. శిరస్త్రాణంతో ప్రాణం పదిలం. 'సోదరా... నెత్తిన పెట్టుకో హెల్మెట్/ అది నీ తల చుట్టూ గట్టి సాకెట్/ హెల్మెట్ వుంటే నీ లైఫ్ నాటౌట్/ హెల్మెట్ లేకుంటే నీ లైఫ్ రనౌట్' అంటాడో కవి. ఎండావానలకు, మంచు, చలి, దుమ్మూధూళికి కూడా రక్షణగా నిలుస్తుంది. యువత బైక్ ఎక్కితే చాలు...మితిమీరిన వేగం, మద్యం మత్తులో నడపడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం పరిపాటిగా మారింది. ఇటీవల యువత సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్, ఓవర్‌టేక్ చేయడం, నిర్లక్ష్యంగా హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తూ నిండుప్రాణాలు బలిపెట్టుకుంటున్నారు. కుటుంబాలకు, ఆత్మీయులకు దు:ఖాన్ని మిగుల్చుతున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్న సంఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. 'శరీరానికి శిరస్సు ప్రధానం, ఇంద్రియాలలో నేత్రం ప్రధానం, షడ్రుచులలో ఉప్పు ప్రధానం, నదులకు నీరు ప్రధానం' అని సుభాషిత రత్నావళి చెబుతుంది. కానీ, శిరస్సుకు శిరస్త్రాణం ప్రధానం అని జీవితం చెబుతుంది.

ఉరుకుల పరుగుల జీవితంలో వేగానికున్న ప్రాధాన్యత భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. హెల్మెట్ లేకపోతే ఏమౌతుందిలే అన్న చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల ఎంతోమంది యువకులు ప్రాణాలను కోల్పోతున్నారు. దేశంలో ఏడాదికి సగటున 1.78లక్షల మంది రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారని, అందులో 60మంది 18నుంచి 34 ఏళ్లలోపు వారేనని సాక్షాత్తూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల లోక్‌సభలో వెల్లడించారు. దేశంలో ప్రతి గంటకూ దాదాపు 53 ప్రమాదాలు, 19 మరణాలు జరుగుతున్నాయి. దీనిలో 45శాతం ద్విచక్ర వాహన ప్రమాదాలేనని కేంద్రమంత్రి తెలిపారు. దేశంలో ప్రస్తుతం యువ జనాభా ఎక్కువగా వుంది. అయితే, ప్రస్తుతం 15 ఏళ్ల లోపు వున్న బాలల శాతం 2036 నాటికి గణనీయంగా తగ్గనుందని 'భారతదేశంలో మహిళలు-పురుషులు 2023' నివేదిక వెల్లడిస్తోంది. దీనికంటే ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే... ద్విచక్ర వాహన ప్రమాదాలలో చనిపోతున్న వారిలో ఎక్కువమంది యువతే కావడం. రాష్ట్రంలో 99 శాతం మంది హెల్మెట్ ధరించకుండా బైక్‌లు నడుపుతున్నారని, హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయాలని ఎ.పి హైకోర్టు గతంలోనే స్పష్టం చేసింది. తాజాగా 'హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, గత జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల రాష్ట్రంలో 667 మంది చనిపోయారని' తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హెల్మెట్ వినియోగించేలా చేయడంలో పోలీసులు కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే అంతమంది చనిపోయారని, పోలీసుల అలసత్వం వల్లే ఈ పరిస్థితి నెలకొందని హైకోర్టు వ్యాఖ్యానించింది.

ఒక పరిమితి వరకే బండి వేగం మన చేతుల్లో వుంటుంది. ఆ పరిమితి దాటితే... ఆ వేగాన్ని కంట్రోల్ చేయడం కష్టం. వేగాన్ని నియంత్రించుకోలేకపోతే...అది ప్రమాదానికి దారితీస్తుంది. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ పెట్టుకోవాలని 'మోటారు వాహనాల చట్టం 1998లోని 129, 177 సెక్షన్లు చెబుతున్నాయి. దీని ప్రకారం జరిమానా విధించడమే కాదు, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే అవకాశం కూడా వుంటుంది. మనం ప్రయాణించే రోడ్డు...రేస్ ట్రాక్ కాదు. వాహనం ఎక్కగానే రేసింగ్ మూడ్‌లోకి వెళ్లిపోవడం వల్ల కోరి ప్రమాదాన్ని తెచ్చుకోవడమే అవుతుంది. టైర్లు, బ్రేకులు, బైక్ కండిషన్ పట్ల శ్రద్ధ పెట్టాలి. చాలావరకు రోడ్డు ప్రమాదాలు, టైర్లు, బ్రేకులు విఫలమవడం వల్లనే జరుగుతాయి. హెల్మెట్ ధరిస్తే... ప్రాణాలు కోల్పోకుండా కనీసం గాయాలతోనైనా బయటపడే అవకాశం వుంటుంది. హెల్మెట్లు ప్రమాదాలలో మరణాన్ని నివారించగలవు, నిరోధించగలవు. అయితే, అది మాత్రమే చాలదు. బైక్ నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మీకే కాదు, తోటి ప్రయాణీకులకు కూడా ప్రమాదమేనన్న విషయం గుర్తించాలి. డ్రైవింగ్‌లో దరి చేరనివ్వకు నిర్లక్ష్యం. హెల్మెట్ ధరించి నిలుపుకో నీ ప్రాణం.

మహనీయుల మాట

చట్టం పేదవాళ్ళను
కాల్చుకు తింటుంది.
ధనికులు మాత్రం
ఆ చట్టాన్నే పాలిస్తారు.

- ఆలివర్ గోల్డ్‌స్మిత్,
ప్రసిద్ధ ఆంగ్లో-ఐరిష్
నవలా రచయిత, కవి.

జమిలి పాట..రాజ్యాంగానికి పోటు..



ఒక చిన్న ఇంట్లో అందరి పెళ్లిళ్లు, అందరి చదువులు ఒకేసారి జరగవు గానీ ఇంత పెద్ద దేశంలో అన్ని ఎన్నికలు ఒకే సారి జరగాలనడం ఏం తర్కం? ఏం ఇంగితం? కేంద్రంలో ప్రభుత్వాలు నాలుగు సార్లు కూలిపోయాయి. మరో రెండు సార్లు ముందే ప్రధాని ఎన్నికలకు వెళ్లారు. మరి ఇలాంటి సమయాల్లో అన్ని రాష్ట్రాలలో అనవసరంగా సభల రద్దు ఖర్చు తగ్గిస్తుందా పెంచుతుందా? ఈ దేశాన్ని రాష్ట్రాల కలయిక అని రాజ్యాంగం చెబుతుందే గానీ కేంద్రీకృత ఏకరూప అని చెప్పడం లేదే? ప్రపంచ బ్యాంకు లేదా అంతర్జాతీయ పెట్టుబడి చెప్పే ప్రపంచీకరణ విధానాలు ఒకే విధంగా అమలు చేసే ఏకీకృత మార్కెట్‌గా రుద్దడం కోసమే దీనిపై ఇంత హడావుడి. అదే విధంగా ఏకరూప మెజార్టీ మతతత్వ నిరంకుశత్వంతో రాష్ట్రాలను మండలాల స్థానిక సంస్థల స్థాయికి దించే సంఘపరివార్ కుట్ర కూడా. అందుకే మలి దశలో స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ఈ పరంపరలో కలపడమంటే అర్థం అదే. ఒకే పన్ను, ఒకే రేషన్, ఒకే చట్టం, ఒకే విద్య, ఒకే మతం, ఒకే బిజెపి, ఒకే మోడీ అన్నదాని పరాకాష్ట.

పార్లమెంటు ఉభయ సభలూ ప్రస్తుతం అతి కీలకమైన రెండు అంశాలపై చర్చ తలపెట్టాయి. ఇందులో ఒకటి నడుస్తుండగా మరొకటి నిర్ణయం కావలసి వుంది. మరొకటి సోమవారం మోడీ ప్రభుత్వం తీసుకు రానున్నది. నిజానికి ఈ మూడూ పరస్పర సంబంధం లేనివేమీ కాదు. రేపు తీసుకు వస్తామంటున్న మార్పులు చేర్పులు గానీ రాజ్యాంగ మూల స్ఫూర్తికి పూర్తి విరుద్ధమైనవి. వాటిని జనంతో మింగించేందుకే ఏవో వేడుకలు, ఉత్సవాలు, చర్చలు అంటూ మాయ నాటకం నడిపిస్తున్నారు. అదానీకి సంబంధించిన ఆరోపణలతో సహా పలు కీలకాంశాలు దాటవేసేందుకు కూడా ఈ ప్రహసనం తీసుకొచ్చారని చెప్పాలి. ప్రభుత్వం తరపున లోక్‌సభలో చర్చలో పాల్గొన్న సీనియర్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాజ్యాంగంలో నిబంధనలను గురించిగాక ఏకగ్రీంగా ప్రకటించిన రాజ్యాంగ ప్రతిని ప్రశ్నించడంతో మొదలు పెట్టారు. రాముడు సీత విగ్రహాలతో ఏవో మత చిహ్నాలు వుంటే వాటిని లేకుండా చేశారని ఆరెస్సెస్ చిరకాల ఆరోపణలు సభలో వల్లెవేశారు. రాజ్యాంగ నిర్మాతలు కోవిదులైన వారిని గౌరవించకపోగా దాంట్లో భారతీయత ఏ మాత్రం లేదని తిట్టిపోసిన ఆరెస్సెస్ భావ ప్రవక్తలైన వినాయక దామోదర సావర్కర్, జనసంఘ్ వ్యవస్థాపకుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ వంటి వారి పేర్లు జపించారు. మత రాజకీయాలను ఆ నాడే తిరస్కరించిన భగత్‌సింగ్‌ను తమ ఖాతాలో వేసుకుని మాట్లాడారు. ఇందిరా గాంధీ కుటుంబాన్ని విమర్శించే పేరిట నాటి కాంగ్రెస్ నాయకత్వాన్ని స్వాతంత్ర పోరాట విలువలను తిరస్కరించే బిజెపి, ఆరెస్సెస్ బాణీయే ఈ చర్చలో అడుగడుగునా గోచరిస్తున్నది. మరోవైపు కాంగ్రెస్, ఎస్‌పి, సిపిఎం తదితర పార్టీలు ప్రజాస్వామ్యం, లౌకిక విలువలు, రాష్ట్రాల హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాలకు హాని కలుగుతున్న తీరును ప్రస్తావిస్తే వారికి మహా కంటగింపుగా వుంటున్నది. అడుగడుగునా అడ్డు తగులుతూ చర్చను రచ్చగా మారుస్తున్నారు. కాంగ్రెస్ తరపున వయనాడ్ నుంచి ఎన్నికైన ప్రియాంక గాంధీ తొలి ప్రసంగం కూడా ఈ అంశంపైనే కావడం విశేషం.

తెలకపల్లి రవి

జమిలి జుమ్లా

ఇప్పటికే కేంద్ర క్యాబినెట్ జమిలి ఎన్నికల బిల్లుకు ఆమోదం తెల్పింది గనక సోమవారం నాడు న్యాయ శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ దాన్ని సభలో ప్రవేశ పెడతారని ప్రకటించారు. ఈ లోగా వీలైన ప్రతి చోటా బిజెపి, ఎన్‌డిఎ నాయకులు దానికి మద్దతు ప్రకటిస్తూ కొత్త కొత్త సిద్ధాంతాలు తీసుకొస్తున్నారు. తెలుగు రాష్ట్రాల వరకూ చూస్తే ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగుదేశం జమిలిని బలపరుస్తున్నదని స్పష్టంగా ప్రకటించారు. ఇప్పుడు బిల్లు ఆమోదించినా 2029లోనే శాసనసభ ఎన్నికలు జరుగుతాయని ఆయన కొత్త సవరణ ప్రకటించారు. మరోవంక దీనిపై స్పష్టమైన వైఖరి తీసుకోని వైసిపి మాత్రం రాజ్యాంగ కోణం కన్నా తమకు తొందరగా మళ్లీ ఎన్నికలు వస్తాయన్న ఆనందంతో పొంగిపోతున్నది. స్వయంగా ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ జమిలికి సిద్ధంగా వుండాలంటుంటే వారి మీడియా, ఆ పార్టీ ప్రతినిధులు కూడా జమిలి జపమే చేస్తున్నారు. తెలంగాణలో బిఆర్‌ఎస్ కూడా సూటిగా స్పందించకుండా మరింత స్పష్టత రావాలని చెబుతున్నది. కానీ వాస్తవానికి రేవంత్ సర్కారు గడువుకు ముందే తొలగిపోతుందనే ఆనందం వారిలో తొంగి చూస్తున్నది. ప్రాంతీయ పార్టీలుగా ఈ మూడూ సమాఖ్య విధానానికి రాజ్యాంగ స్ఫూర్తికీ పూర్తి విరుద్ధమైన ఈ మార్పును గట్టిగా వ్యతిరేకించాల్సింది పోయి తాత్కాలిక దృష్టితో మాట్లాడటం దురదృష్టకరం. చంద్రబాబు నాయుడు బిల్లు ఆమోదించినా ఎన్నికలు రాబోవని నమ్మకంగా చెబుతున్నారంటే మోడీ తీరు, ఆరెస్సెస్, బిజెపి రాజకీయాలు ఆయనకు తెలియవనా? ఎన్‌డిఎలో చేరే నాటికే వారి విధానాలు ఇలానే వుంటాయని చంద్రబాబు వంటి వారికి బాగా తెలుసు. ఏమైనా అధికారం కోసం మోడీతో రాజీపడి ఆయన హుకుంలను ఆమోదించక తప్పదని తల వంచుతున్నారు. బిజెడి, అకాలీదళ్, ఎఐడిఎంకె, లోక్ జనశక్తి వంటివి బలపర్చాయని నివేదిక చెబుతున్నది. బిఆర్‌ఎస్, ముస్లింలీగ్, నేషనల్ కాన్ఫరెన్స్, వైసిపి, టిడిపి వంటివి అధికారికంగా సమాధానమివ్వలేదట. డిఎంకె, ఆప్, ఎస్‌పి, వంటి ప్రాంతీయ పార్టీలతో పాటు కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, బిఎస్‌పి, ఎస్‌పి వంటివి గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. చిన్నా పెద్ద కలిపి 32 పార్టీలు బలపరుస్తుంటే 15 వ్యతిరేకిస్తున్నాయని లెక్క చెబుతున్నారు. గతంలో కొంత బలపర్చిన పార్టీలు కూడా ఇప్పుడు వ్యతిరేక వైఖరి తీసుకున్నాయని దీనిపై నివేదికనిచ్చిన కమిటీ అధ్యక్షుడు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వెల్లడించారు. గురువారం నాడు ఈ నివేదికను ఆమోదించిన కేంద్ర క్యాబినెట్ ఆ దిశలో ముందుకు పోవాలని నిర్ణయించింది. ఇందుకు సభలో ఎన్‌డిఎ సంఖ్యాబలం సరిపోతుందా అనేది ఒకటైతే రాజ్యాంగ పరంగా ఇది చెల్లుతుందా అనేది మరొకటి.

మాజీ రాష్ట్రపతి సేవలు

దేశానికి రాష్ట్రపతి అంటే రాజకీయ పార్టీలకు అతీతంగా రాజ్యాంగ బాధ్యతలు నిర్వహించినట్టు లెక్క. అలాంటి వారికి తదుపరి కాలంలో మరో బాధ్యత అప్పగించడం గతంలో ఎరగనిది. కానీ మోడీ సర్కారు మాజీ సిజెఐలతో పాటు రాష్ట్రపతులను కూడా రంగంలోకి దింపడం చూస్తున్నాం. 2023లో విడుదల చేసిన ఉన్నత స్థాయి కమిటీ నియామకం ఉత్తర్వు 11019/3/23లో కోవింద్‌కు జమిలి ఎన్నికల నిర్ణయం అమలును చర్చించమన్నారే గాని సిఫార్సు కోసం ఆ కమిటీని వేయలేదు. పైన చెప్పుకున్న రాజ్యాంగ నిబంధనలకు ఇది పూర్తి వ్యతిరేకమైన నిర్ణయం. రాజ్యాంగం 75(3) అధికరణం లోక్‌సభ పదవీ కాలాన్ని, 164(1) శాసనసభల పదవీ కాలాన్ని విడివిడిగా పేర్కొంటున్నది. సభ రెండు సమావేశాల మధ్య వ్యవధి ఆరు నెలలకు మించి వుండరాదంటున్నది. 83(2) లోక్‌సభ విషయంలోనూ, 172(1) శాసనసభల విషయంలోనూ ఇతరేతరంగా రద్దు కాకపోతే మాత్రమే అయిదేళ్ల పదవీ కాలం అంటున్నాయి తప్ప కాల పరిమితి లేదు. వీటిలో దేనికి దానికి స్వంత అస్తిత్వం ఏర్పాటు ముగింపు రద్దు అవకాశాలున్నాయి. 83వ అధికరణం లోక్‌సభ కాల పరిమితినీ, 85 రద్దు అవకాశాన్ని చెబితే 172వ అధికరణం శాసనసభ గడువునూ 174 రద్దునూ చెబుతున్నాయి. రాష్ట్రాలకు అదనంగా 356 కింద రాష్ట్రపతి రద్దు చేసే మరో అధికరణం వుంది. ఆ తర్వాత ఆరు మాసాల లోపు మరో సభ సమావేశం కావాలని వుంది. దీని అర్థమేటంటే రాజ్యాంగ నిర్మాతలు కృత్రిమంగా సభలను పొడిగించాలని గానీ, ప్రజల ఆమోదం (ఎన్నికలు) లేకుండా పాలన నడిపించాలని గానీ ఎంతమాత్రం కోరుకోలేదు. పైగా 1967 వరకూ లోక్‌సభ శాసనసభల ఎన్నికలు ఒకేసారి జరిగాయంటే దానికి కారణం కాంగ్రెస్ గుత్తాధిపత్యం వుండటమే. తర్వాత కాలంలోనూ ప్రతిపక్ష ప్రభుత్వాలను కేంద్రం నిరంకుశంగా రద్దు చేయడం వల్లనే రెంటికీ మధ్య అంతరం వచ్చింది. భవిష్యత్తులో కూడా ప్రభుత్వాలు కూటములు అయిదేళ్లు తప్పక కొనసాగుతాయనే గ్యారంటీ వుందా? కానీ ఆ పేరిట కృత్రిమంగా పొడిగించడం అంటే ప్రజల ఆమోదం లేని పాలన రుద్దడమే.

అంతా ఒకే పెత్తనమా?

ఒకే దఫా ఎన్నికల ఖర్చు ఎన్నికల్లో గెలవని పాలన సాగి ప్రజాధనం గల్లంతవుతుంది. దీనివల్ల రూ.5,000 కోట్లు ఆదా అవుతాయని జిడిపి పెరుగుతుందని తాడూ బొంగరం లేని కథలు చెబుతున్నారేగానీ బాధ్యత లేని పాలన వల్ల ఎన్ని వేల కోట్లు దారి తప్పుతాయో వేరే చెప్పాలా? ఒక చిన్న ఇంట్లో అందరి పెళ్లిళ్లు అందరి చదువులు ఒకేసారి జరగవు గానీ ఇంత పెద్ద దేశంలో అన్ని ఎన్నికలు ఒకే సారి జరగాలనడం ఏం తర్కం? ఏం ఇంగితం? కేంద్రంలో ప్రభుత్వాలు నాలుగు సార్లు కూలిపోయాయి. మరో రెండు సార్లు ముందే ప్రధాని ఎన్నికలకు వెళ్లారు. మరి ఇలాంటి సమయాల్లో అన్ని రాష్ట్రాలలో అనవసరంగా సభల రద్దు ఖర్చు తగ్గిస్తుందా పెంచుతుందా? ఈ దేశాన్ని రాష్ట్రాల కలయిక అని రాజ్యాంగం చెబుతుందే గానీ కేంద్రీకృత ఏకరూప అని చెప్పడం లేదే? ప్రపంచ బ్యాంకు లేదా అంతర్జాతీయ పెట్టుబడి చెప్పే ప్రపంచీకరణ విధానాలు ఒకే విధంగా అమలు చేసే ఏకీకృత మార్కెట్‌గా రుద్దడం కోసమే దీనిపై ఇంత హడావుడి. అదే విధంగా ఏకరూప మెజార్టీ మతతత్వ నిరంకుశత్వంతో రాష్ట్రాలను మండలాల స్థానిక సంస్థల స్థాయికి దించే సంఘపరివార్ కుట్ర కూడా. అందుకే మలి దశలో స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ఈ పరంపరలో కలపడమంటే అర్థం అదే. ఒకే పన్ను, ఒకే రేషన్, ఒకే చట్టం, ఒకే విద్య, ఒకే మతం, ఒకే బిజెపి, ఒకే మోడీ అన్నదాని పరాకాష్ట. వీరు ఇది అధ్యక్ష తరహా పాలనను రుద్దే ప్రయాణం లాంటిదే. అలా రాజ్యాంగం రెండుసార్లు మార్చుకున్న శ్రీలంక వంటి ఇరుగు పొరుగు దేశాలు కూడా మళ్లీ వెనక్కు రావలసి వచ్చింది. ప్రపంచంలో భారత దేశంలా ఇన్ని భాషలు, విభిన్నతలు గల దేశాలు వేళ్ల మీద లెక్క పెట్టదగినన్ని కూడా లేవు. అటు మార్కెట్ ఇటు మతతత్వం అవసరాల కోసం ఆరాటపడటమే గానీ చిన్నవీ పెద్దవీ కలిపితే 28 రాష్ట్రాలు గల ఈ దేశంలో ఇది ఆచరణ సాధ్యం కూడా కాదు. స్థిరత్వం జపం వాస్తవంలో మరింత అస్థిరతకూ మరింత ఆర్థిక భారానికి దారితీస్తుంది. 15 రాజ్యాంగ సవరణలు చేయాలి. రాష్ట్రాలలోనూ ఆమోదించాలి. ఇందుకు లోక్‌సభలో 362 కావలసి వుంటే 299 ఎంపీల మద్దతు మాత్రమే వుంది. ఎటూ చేరని వారు 19. ఇక రాజ్యసభలో 164 మంది మద్దతు కావాలంటే 125 బలం మాత్రమే వుంది. 24 మందిది అటూ ఇటు కాని మధ్యే మార్గం, ఈ పొందికలో తుది ఫలితం ఏంటనేది ఒకటైతే రాష్ట్రాలలో చాలా చోట్ల ఎన్‌డిఎ అధికారంలో లేదు. కనుక పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందడం కూడా గగనమే గనక పార్టీలను తిప్పుకునే పథకాలు కుట్రలూ కూడా జరుగుతాయి. ఏమైనా రాష్ట్రాల హక్కులనూ ప్రజల ఎన్నుకునే హక్కును కూడా కాపాడుకోవడం ఇక్కడ కీలక సవాలు. తమ తాత్కాలిక అవసరాల కోసం వైసిపి, బిఆర్‌ఎస్ వంటివి ఆహ్వానించడం, టిడిపి భాగస్వామిగా మారడం అవాంఛనీయం.

జగడపు ధన్‌ఖర్

ఇక రాజ్యసభ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసు కూడా ఈ పరిణామాల కొనసాగింపే. ఎందుకంటే రాజ్యసభ మౌలికంగా రాష్ట్రాల సభ (రాజ్యం అంటే రాష్ట్రం). కానీ జగదీప్ ధన్‌ఖర్ వచ్చాక రాజును మించిన రాజభక్తుడిలా మోడీని మించి ఆరెస్సెస్‌ను కీర్తించడం, ప్రతిపక్షాల పీక నొక్కడం నిత్యకృత్యమైంది. దీన్ని నిరసించిన ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేతో సహా ప్రతి ఒక్కరితో ఆయన వాదనలు పెట్టుకుని అవమానిస్తున్నారు. కనుకనే అనివార్యంగా ఆయనపై అవిశ్వాసం నోటీసునిచ్చాయి. దానిపైన కూడా తగాదా పెట్టుకోవడం ధన్‌ఖర్‌కే చెల్లింది. అయితే ఆ తీర్మానాన్ని అనుమతిస్తారా లేక ఏవో సాకులతో నిరాకరిస్తారా అనే సందేహాలున్నాయి. లౌకిక ప్రతిపక్షాలు మోడీ సర్కారు కుట్రలకూ ఒత్తిళ్లకు తల వంచకుండా ఐక్యంగా నిలబడితే ఈ కుట్రలను ఛేదించడం సాధ్యమవుతుంది. ఏమైనా పార్లమెంటు ఎన్నికల తర్వాత రాజకీయంగా తీవ్రమవుతున్న ఘర్షణనే పార్లమెంటు ప్రతిబింబిస్తున్నదని చెప్పాలి.

★

కేరళ స్కూళ్లు చైతన్య కేంద్రాలు

పిల్లల మనోధైర్యానికి మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తారు. ప్రాచీన నృత్యాలలో శిక్షణ ఇస్తారు. అర్థం కాని పాఠ్యాంశాలను కళారూపాల ద్వారా మనసులో నాటుకునేలా చెప్తారు. దాంతో ఆటపాటలు చిన్నారుల నిత్య జీవితంలో భాగమైనాయి. 'సమగ్ర' అనే పోర్టల్ ద్వారా కేరళ విద్యాశాఖ వెయ్యికి పైగా ప్రభుత్వ పాఠశాలలను డిజిటల్ పాఠశాలలుగా మార్చి 45 వేల స్మార్ట్ రూములను నిర్మించింది. లిటిల్ కైట్స్, ఐ.టి క్లబ్బులను ఏర్పాటు చేసి యూనిమేషన్, షార్ట్ ఫిలిమ్స్, సైబర్ భద్రత వంటి అంశాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజనంలో గుడ్డు, వారానికి ఒకరోజు చికెన్ పెడతారు. 3 వేల మంది పిల్లలు ఒకేసారి కలిసి భోజనం చేసే డైనింగ్ హాల్, పేరెంట్స్ విజిటింగ్ హాల్, పెద్ద కిచెన్ వుంటాయి. పరిశుభ్రత విషయంలో పక్కాగా వుంటారు. ప్రతి స్కూల్లో ఇండోర్ స్టేడియం వుంటుంది. విద్య ఒకటే కాదు. ఏ విద్యార్థికి ఏ రంగంలో ఆసక్తి ఉంటే ఆ రంగంలో తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించగలిగేలా శిక్షణనిస్తారు.

పాఠశాలలంటే? ఎత్తైన భవనాలు, చుట్టూ ప్రహరీ గోడలు, ఖరీదైన స్కూల్ యూనిఫామ్‌లు కాదు. మానవ జీవితాలను తీర్చిదిద్ది, జాతి భవితను రూపొందించే జీవన నిలయాలు, చైతన్య కేంద్రాలు. మానవీయ విలువల్ని పాదుకొలిపే ఆధునిక దేవాలయాలు. అలాంటి విద్యా విధానాన్ని కేరళలో ప్రత్యక్షంగా అధ్యయనం చేశాం. అక్టోబర్ 30, 31న కోజికోడ్‌లో కేరళ బాలల సంఘం 7వ రాష్ట్ర మహాసభల సందర్భంగా సౌహార్ద సందేశకులుగా పాల్గొన్నాం. అక్కడ చదువులే కాదు. ఆటపాటలతో పాటు జీవిత పాఠాలనూ నేర్పుతారు. తరగతి గదుల్లోనే నిజమైన పౌరులను తీర్చిదిద్దుతున్నారు. మంచి వాతావరణం, సారవంతమైన నేలలో నాణ్యమైన విత్తనాలు విత్తితేనే, చక్కటి ఫలాలనిచ్చే వృక్షాలుగా ఎదుగుతాయి. తల్లిని నేల/నీరుగా.. తండ్రిని విత్తనంగా భావిస్తే.. ఉపాధ్యాయుడు సూర్యరశ్మి లాంటివాడు. వీరు ముగ్గురు మాత్రమే చిన్నారులను మంచి పౌరులుగా మలచగలుగుతారు. ఈ ముగ్గురి భాగస్వామ్యంతో నడుస్తున్నదే కేరళ విద్యా వ్యవస్థ.

మనిషి తత్వం, ప్రేమతత్వం, సోదరత్వం తోటి వారికి తోడ్పడాలన్న దృఢ సంకల్పంతో ఏర్పడినదే కేరళ బాలల సంఘం. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, జాతీయోద్యమ స్ఫూర్తితో కుల, మత, ప్రాంత, భాష లింగ వివక్ష లేని ప్రపంచ శాంతి, ప్రకృతి పర్యావరణ ఎజెండాగా, ఉచిత ఆహారం, బస్సు సౌకర్యం, సంపూర్ణ అక్షరాస్యత దిశగా... బాలల హక్కుల్ని వివరిస్తూ అడుగులు వేసింది. పల్లెల్లో ఉన్న ప్రతి పిల్లవాడికి భరోసా అయ్యింది. బాలల సంఘం కేరళ మొత్తం విస్తరించింది. 14 జిల్లాలలో 210 ప్రాంతాలలో 2,279 గ్రామాలలో 31,258 యూనిట్లలో 13 లక్షల మంది బాలలతో విస్తరించింది.

భూపతి వెంకటేశ్వర్లు

గౌతమ బుద్ధుని నుండి మహాత్మా గాంధీ వరకు మాంటిస్సోరి నుండి గిజూబాయి వరకు ఎందరో మహనీయుల బాటలో బాలబాలికలను తీర్చిదిద్దుతున్నారు. అక్కడ పెద్దలు పిల్లలతో స్నేహం చేస్తారు. పిల్లలు చెప్పింది శ్రద్ధగా వింటారు. పిల్లల అభిప్రాయాలను తల్లిదండ్రులు, పెద్దలు ఆలకించే సాంప్రదాయం వారి సంస్కృతిలోనే ఉంది. ఆంగ్ల భాషతో పాటు అన్య భాషలు ఎన్ని నేర్చినా.. పాలనలో బోధనలో మాతృభాషపై మమకారం తగ్గలేదు.

విద్యపై విజన్

విద్యపై చేసే ఖర్చులను భావితరాల భవిష్యత్తుకు పునాదిగా చూస్తున్నది కేరళ వామపక్ష ప్రభుత్వం. బడిని బాగు చేయడాన్ని రేపటి పెట్టుబడిగా గుర్తించింది. చదువుల విప్లవం తెచ్చింది. బాల కార్మిక రహిత రాష్ట్రంగా బాల కార్మికుల అక్రమ రవాణాపై పోరాడేందుకు బాలల సంరక్షణ యూనిట్‌ను ఏర్పరిచింది. అక్రమ రవాణా, పిల్లల యాచన, అర్ధాంతరంగా చదువు ఆపేసిన విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించింది. డ్రాపౌట్లు లేకుండా చూసే బాధ్యత చైల్డ్ హెల్ప్ డెస్క్ రెస్క్యూ ఫోర్స్ సహాయం సమన్వయంతో అధికారులు 24 గంటలు షిఫ్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. కార్మికుల జాడ కోసం వారానికి మూడు రోజులు తనిఖీలు నిర్వహిస్తారు. బాల కార్మికులు కనిపిస్తే విడిపించి యాజమాన్యాలపై కేసులు పెడతారు. పిల్లలు పనిలో కాదు. బడిలో ఉండాలి. బడికి రాని పిల్లలందరూ బాల కార్మికులే. బాల్యం ఒక హక్కు. పిల్లల చదువుల ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించి, కేరళ సమాజాన్ని ఒప్పించి "బాల్యం బడిలోనే" ఉండాలని తీర్మానం చేశారు. పాఠశాల మాత్రమే పిల్లలను పట్టించుకునే ఏకైక సంస్థగా గుర్తించింది. పిల్లల సర్వతోముఖ వికాసానికి తగినట్టుగా పాఠశాలలను అభివృద్ధి చేసింది. అంతర్జాతీయ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. చదువుతోపాటు ఆటపాటలు, ఆట స్థలాలు లేని స్కూళ్లకు అనుమతులుండవు. ప్రతి పాఠశాలలో పి.ఇ.టి, డ్రామా, స్క్రిప్ట్, డాన్స్ టీచర్ తప్పకుండా ఉండాలి. ఆధునిక విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. వీటికి సంబంధించిన శిక్షణ తరగతులు, ప్రణాళిక ప్రతి బిడ్డకు ఉపయోగపడేలా చూస్తారు. సమాజం భాగస్వామ్యం కాకుండా కేవలం ప్రభుత్వ కృషి ఫలితాలివ్వదు. అందుకే అన్ని రంగాల్లో ప్రజల భాగస్వామ్యంతోనే ప్రణాళికలు అమలు జరుగుతాయి. విద్యార్థులు ఫెయిల్ అయితే ఉపాధ్యాయులే ఫెయిల్, విద్యా విధానం ఫెయిల్ అయినట్టుగా చూస్తారు.

పిల్లల మనోధైర్యానికి మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తారు. ప్రాచీన నృత్యాలలో శిక్షణ ఇస్తారు. అర్థం కాని పాఠ్యాంశాలను కళారూపాల ద్వారా మనసులో నాటుకునేలా చెప్తారు. దాంతో ఆటపాటలు చిన్నారుల నిత్య జీవితంలో భాగమైనాయి. 'సమగ్ర' అనే పోర్టల్ ద్వారా కేరళ విద్యాశాఖ వెయ్యికి పైగా ప్రభుత్వ పాఠశాలలను డిజిటల్ పాఠశాలలుగా మార్చి 45 వేల స్మార్ట్ రూములను నిర్మించింది. లిటిల్ కైట్స్, ఐ.టి క్లబ్బులను ఏర్పాటు చేసి యూనిమేషన్, షార్ట్ ఫిలిమ్స్, సైబర్ భద్రత వంటి అంశాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజనంలో గుడ్డు, వారానికి ఒకరోజు చికెన్ పెడతారు. 3 వేల మంది పిల్లలు ఒకేసారి కలిసి భోజనం చేసే డైనింగ్ హాల్, పేరెంట్స్ విజిటింగ్ హాల్, పెద్ద కిచెన్ వుంటాయి. పరిశుభ్రత విషయంలో పక్కాగా వుంటారు. స్కూల్ ఆవరణలో ఒక ఆకు పడ్డా విద్యార్థులే ఏరి చెత్త బుట్టలో వేస్తారు. ప్రతి స్కూల్లో ఇండోర్ స్టేడియం వుంటుంది. విద్య ఒకటే కాదు. ఏ విద్యార్థికి ఏ రంగంలో ఆసక్తి ఉంటే ఆ రంగంలో తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించగలిగేలా శిక్షణనిస్తారు. ఒక మాటలో చెప్పాలంటే? ఒక నిరుపేద విద్యార్థికి అంతర్జాతీయ స్థాయి విద్య ఉచితంగా అందుతుంది.

భవితకు బలం బాలల సంఘాలే

పిల్లల సాంస్కృతిక ఉత్సవాలు 'వేనలుంబికల్' (వీధి నాటకాలు) ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలలో జరుగుతాయి. నాలుగు వేల మంది బాల కళాకారులు 210 బృందాలుగా బాలల సామాజిక సమస్యలపై లక్షలాది మందితో ప్రదర్శనలిచ్చి పెద్దలలో సైతం చైతన్యం కల్పిస్తారు. ఆటపాటల్లో సత్తా చాటుతున్న వారిని చిన్న వయస్సులోనే చేరదీసి ప్రోత్సహిస్తున్నారు. శిక్షణలిచ్చి విశ్వ క్రీడల్లో విజేతలుగా నిలబెడుతున్నారు. వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపులను శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్నారు.

మలయాళంలో బాల సాహిత్య అకాడమీ ఏర్పరిచారు. బాలల రచనలు, ముద్రణలు అక్కడి నుంచి వెలువడతాయి. ప్రతి ఇంట్లో లైబ్రరీ క్యాంపెయిన్ నిర్వహించి పఠనాసక్తిని పెంచుతారు. బాలల కార్యక్రమంలో కుటుంబాలు, పెద్దలు పాల్గొంటారు. రాజ్యాంగ పీఠికను చదివించడం బాలల అసెంబ్లీ, పార్లమెంటు కార్యక్రమాలు, లౌకిక, మానవత్వ, సమతా మమతల పండుగలు, వనభోజనాలు నిర్వహిస్తారు.

సూర్యచంద్ర గ్రహణాలు, మూఢనమ్మకాలను సవాల్ చేస్తూ పది వేల మంది పిల్లలు రోడ్ల మీదకొచ్చి గ్రహణాన్ని వీక్షించారు. సైన్స్ వండర్ షోలు, ఒక్క మాటలో చెప్పాలంటే? ఈ ప్రపంచం పిల్లలదే. ఎదగడానికి ఎల్లలు లేవు అన్నట్లుగా విజ్ఞాన ఆధారిత సమాజ నిర్మాణంలో కేరళ ప్రణాళిక బద్ధంగా ముందడుగు వేస్తున్నది.

అందరికీ విద్య, సమాన విద్య, నాణ్యమైన విద్య, ఉచిత విద్యా వెలుగులు అందిస్తున్నప్పటికీ మత శక్తులు మళ్లీ చీకట్లోకి తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. విజ్ఞాన వెలుగుల్లోనే "మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును" అనే దృక్పథంతో బాలల సంఘాల పిల్లలే పిల్లల్ని, పెద్దల్ని పురోగమన సంస్కృతి వైపు అడుగులు వేయిస్తున్నారు. నవ సమాజం వైపు భవితను నడుపుతున్నారు. మంచి రోజులకు మంచి విధానాలకు కేరళ ఒక తీపి గుర్తు.

/ వ్యాసకర్త తెలంగాణ బాలోత్సవ కమిటీ అధ్యక్షులు,
సెల్ : 9490098343 /

జనవాక్యం

సకాలంలో జీతాలు చెల్లించాలి కదా!

ఈ మధ్య కాలంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రతి నెలా జీతాలు అందించడంలో మన రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తున్నది. పాల బిల్లు, కరెంటు బిల్లు చెల్లించడం మొదలు...బట్టలు ఉతికే రజకులకు చెల్లించే పైకం అయితేనేమి, ఇంటి అద్దెను చెల్లించడం అయితేనేమి, ఇంట్లో పని చేసే వారికి చెల్లించే వేతనాలు అయితేనేమి, ఇక పిల్లలకు స్కూల్ ఫీజులు చెల్లించే విషయంలో అయితేనేమి అన్నీ కూడా వందల్లోనో, వేలల్లోనే ఉంటాయి. అదేవిధంగా తమ కుటుంబానికి తిండి, బత్యాలు జరగడానికి ప్రతి నెల ఇంటి సరుకుల బిల్లు సైతం ఆషామాషీగా ఉండదు. ఆ విధమైన తరహాలో ఉద్యోగులు గాని, ఉపాధ్యాయులు గాని ఎలాంటి ఇబ్బందుల పాలు కాకుండా, రుణగ్రస్తులు కాకుండా ఉండాలంటే వారికి టైంకి అంటే ప్రతి నెలా 5వ తేదీ లోపు రాష్ట్ర ప్రభుత్వం వారు జీతాలు చెల్లిస్తే వారికి ఎలాంటి సమస్య, బాదరబందీ ఉత్పన్నం కాబోదు. అలా కాకుండా రాష్ట్ర ప్రభుత్వం జీతాలు సకాలంలో చెల్లించడంలో ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించినా వారి సహనానికి పరీక్ష పెట్టినదవుతుంది. తద్వారా ఉద్యోగుల నుంచి ఉపాధ్యాయుల నుంచి తీవ్ర నిరసన, ప్రతిఘటన ఎదురయ్యే పరిస్థితి తలెత్తి వారంతా వారి వారి విధులను, పనులను బహిష్కరించే ప్రమాదం పొంచి వుంది! ప్రభుత్వం ఈ విషయమై వెంటనే చర్యలు చేపట్టాలి.

- బుగ్గన మధుసూదన రెడ్డి,
బేతంచెర్ల, నంద్యాల జిల్లా.

మీ రచనలను
పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

దక్షిణ కొరియా అధ్యక్షులు యూన్ సుక్ యోల్ అభిశంసన

- అధ్యక్ష అధికారాలను స్వీకరించిన ప్రధాని

సియోల్ : దక్షిణ కొరియా అధ్యక్షులు యూన్ సుక్ యోల్‌పై శనివారం ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం ఆమోదం పొందింది. జాతీయ అసెంబ్లీ ఈ తీర్మానాన్ని 204-85తో ఆమోదించింది. దీంతో యూన్ సుక్ యోల్ అధ్యక్ష అధికారాలు, విధులను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రధానమంత్రి హన్ డక్ సూ అధ్యక్ష అధికారాలను స్వీకరించారు. యూన్‌ను అధ్యక్షుడిగా తొలగించాలా.. లేదా అధికారాలను పునరుద్ధరించాలా అనే విషయాన్ని రాజ్యాంగ న్యాయస్థానం నిర్ధారించేందుకు 180 రోజుల గడువు ఉంటుంది. యూన్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తే నూతన అధ్యక్షున్ని ఎన్నుకోవ డానికి 60 రోజుల్లో జాతీయ ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. శనివారం తీర్మానం ఆమోదం పొందడంతో అభిశంసనకు గురైన మూడో దక్షిణ కొరియా అధ్యక్షుడిగా యూన్ నిలిచారు. 2004లో రోహ్ మూ హ్యున్, 2016లో పార్క్ గ్యున్ హై అభిశంసనకు గురయ్యారు. శనివారం యూన్‌పై అభిశంసన తీర్మానం ఆమోదం పొందగానే పార్లమెంట్ సమీపంలో వేలాదిమంది ప్రజలు ఆనందోత్సాహాలతో నినాదాలు చేశారు. బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. 'మేం రాజ్యాంగ క్రమాన్ని పరిరక్షించాం' అని నినాదాలు చేశారు. అభిశంసన తీర్మానం ఆమోదం తరువాత యూన్ ఒక ప్రకటన విడుదల చేశారు. తన అధికారాన్ని ఎప్పటికీ వదులుకోనని తెలిపారు. ప్రస్తుత పరిస్థితిని తన అధ్యక్ష పదవికి తాత్కాలిక విరామంగా పేర్కొన్నారు. ఈ నెల 3న సైనిక పాలన విధించడంతో యూన్‌పై దేశవ్యాప్తంగా విమర్శలు ప్రారంభమయ్యాయి.

ఆధార్ ఫ్రీ అప్‌డేట్..

- మరోసారి గడువు పెంపు

న్యూఢిల్లీ : ఆధార్ వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు కేంద్రం ఇచ్చిన గడువు ముగియనున్న వేళ భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ గడువును మరోసారి పెంచుతున్నట్లు 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది. 2025 జూన్ 14వ తేదీ వరకు.. అంటే ఏకంగా ఆరు నెలలు గడువు పెంచింది. దీంతో ఆధార్ కార్డులో చిరునామా మార్పులు చేసుకోవాలనుకునేవారు వెంటనే ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చు. యుఐడిఎఐ నిబంధనల ప్రకారం... ప్రతి పదేళ్లకోసారి ఆధార్‌కు సంబంధించిన వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. దీనికోసం ఆయా రుజువు పత్రాలు సమర్పించాలి. ఉచిత సేవలు 'మై ఆధార్' పోర్టల్ ద్వారా మాత్రమే అందుబాటులో ఉంటాయి. పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఉచితం గడువు ముగిశాక మునుపటిలాగే ఆధార్ కేంద్రాల్లో రూ.50 చెల్లించి అప్‌డేట్ చేసుకోవచ్చు.

ఎల్‌కె అద్వానీకి అస్వస్థత

న్యూఢిల్లీ: బిజెపి సీనియర్ నాయకులు ఎల్‌కె అద్వానీ (97) ఆరోగ్యం క్షీణించింది. ఆయన ఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అపోలో ఆసుపత్రి వైద్యులు శనివారం తెలిపారు. అనారోగ్య కారణాల రీత్యా చాలా కాలం నుంచి ఆయన ఇంటికే పరిమితమయ్యారు. ఇటీవలకాలంలో ఆయన ఆసుపత్రిలో చేరడం ఇది నాలుగోసారి. ఇదివరకు గత ఆగస్టులోనూ ఆయన ఆసుపత్రిలో చేరారు. ఇదే ఏడాది జులై 3న కూడా ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు. అంతకుముందు జూన్ 26న ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చిన్నపాటి శస్త్ర చికిత్స చేశారు. అప్పటి నుంచి ఆయన ఇంటిలోనే ఉంటూ బహిరంగ కార్యాక్రమాలకు పూర్తిగా దూరంగా ఉంటూవస్తోన్న సంగతి తెలిసిందే.

జమిలి అయినా 2029లోనే

- మేం ఇప్పటికే మద్దతు ప్రకటించాం
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

గ్రీవెన్స్‌లో వినతిని స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జమిలి ఎన్నికల విధానం అమల్లోకి వచ్చినా 2029లోనే ఎన్నికలు జరుగుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం జరిగిన గ్రీవెన్స్‌లో పాల్గొన్న అనంతరం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ 'ఒకే దేశం - ఒకే ఎన్నిక విధానానికి తాము ఇప్పటికే మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. రాష్ట్రంలో సుస్థిర పాలన సాగుతోందని, స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ ను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలతోపాటు ప్రతిచోటా దీనిపై చర్చ జరగాలని తెలిపారు. వైసిపి నాయకులు పబ్బం గడుపుకునేందుకు ఏది పడితే అది మాట్లాడుతున్నారని, వారు ప్రజల్లో విశ్వాసం కోల్పోయారని చెప్పారు. కలెక్టర్ల సమావేశంలో మార్పులు తీసుకొస్తామని చెప్పారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన అద్వానీ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

సేవ చేయకుండా పదవులు అంటే ఎలా.?

అనంతరం టిడిపికి చెందిన ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ నాయకులకు పనితీరు ఆధారంగా గుర్తింపు ఉంటుందని చెప్పారు. ప్రజలకు, పార్టీకి సేవ చేయకుండా కొందరు పదవులు ఇమ్మంటున్నారని, అది సాధ్యం కాదని చెప్పారు. కొందరు పదవులు వచ్చేశాయని, పార్టీని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలకు సేవ చేస్తే రాజకీయాల్లో కొనసాగుతారని అన్నారు. అనంతరం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంపై ఆయన సమీక్ష నిర్వహించారు. టిడిపి సభ్యత్వం 73 లక్షలకు చేరుకుందని, ఇదొక రికార్డని చెప్పారు. ప్రతి నలుగురిలో ఒకరు తెలుగుదేశం సభ్యత్వం పొందేలా చూడాలని కోరారు. కార్యకర్తలకు ఉపాధి కల్పించడంతోపాటు ఆర్థికంగా బలోపేతమయ్యేలా చూడాలని బాధ్యులకు సూచించారు.

ముగ్గురు మంత్రులకు 'పెండింగ్' బాధ్యతలు

వైసిపి ప్రభుత్వం కక్షసాధింపు ధోరణిలో భాగంగా నీరు చెట్టు, ఉపాధి హామీ పనులు బిల్లులను చెల్లించలేదని చంద్రబాబు చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత కొంత చెల్లించామని, మిగిలిందీ త్వరలోనే ఇస్తామని చెప్పారు. బిల్లులు రాక ఇబ్బంది పడుతున్న వారి సమస్యలు పరిష్కరించే బాధ్యతను అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడుకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. వీరు ఎప్పటికప్పుడు చర్చించి బిల్లులు మంజూరయ్యేలా చేస్తారని చెప్పారు.

'రివర్ వ్యూ' రిసార్ట్ వద్ద 'హైటెన్షన్'

- కూల్చివేతకు అధికారుల యత్నం
- అడ్డుకున్న వైసిపి శ్రేణులు
- సేఫ్టీ వాల్ కూల్చివేత
- మాజీ ఎమ్మెల్యేలు ఆందోళన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి పట్టణంలోని స్వర్ణముఖి నదీ ఒడ్డున నిర్మించిన 'రివర్ వ్యూ రిసార్ట్' కూల్చివేతకు శనివారం మున్సిపల్ అధికారులు యత్నించారు. దీంతో రిసార్ట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ రిసార్ట్ మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి కుమార్తెది కావడంతో ప్రతిఘటన ఎదురవుతుందనే ఉద్దేశంతో అధికారులు ముందస్తుగా పోలీసులతోపాటు ప్రత్యేక బలగాలను మోహరించారు. రిసార్ట్ కూల్చివేత సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యేలు తాటిపర్తి చెంచురెడ్డి, బియ్యపు మధుసూదన్ రెడ్డి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఘటనా స్థలికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు. సేఫ్టీవాల్ కూల్చుతున్న జేసీబీని అడ్డుకున్నారు. దీంతో అక్కడ కాసేపు హైటెన్షన్ నెలకొంది. కూటమి ప్రభుత్వ పాలన మరీ ఇంత ఘోరమా..! కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా కట్టడాలు కూల్చేస్తారా..! అదే జరిగితే ఇక్కడే మా ప్రాణాలు తీసుకుంటామంటూ మాజీ ఎమ్మెల్యేలు చెంచురెడ్డి, బియ్యపు మధుసూదన్ రెడ్డి ఎదురుతిరిగారు. దీంతో పరిస్థితులు మరింత ఉద్రిక్తలకు దారి తీశాయి. ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మీరెంత ప్రతిఘటించినా అనుమతుల్లేని రిసార్ట్ ను కూలదోయడం ఖాయమని తేల్చి చెప్పారు. బఫర్ జోన్ దాటి లోపలికి వచ్చిన కట్టడాల కూల్చివేతపై మీకే మూడు రోజుల సమయం ఇస్తున్నామని చెప్పారు. లేకుంటే తామే స్వయంగా వచ్చి కూలదోయడం ఖాయమని స్పష్టం చేసి అక్కడ నుంచి వెళ్లి పోయారు. రివర్ వ్యూ రిసార్ట్ ను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అప్రూవల్ లేకుండా నది బఫర్ జోన్ లో నిర్మించారన్నది అధికారుల వాదన. ఈ అంశాలనే కారణంగా చూపి కూల్చివేతకు పూనుకున్నారు.

మట్టి రోడ్లే గతి...!

- నేటికీ 20,428 కిలో మీటర్లు అవే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రాంతాల్లో రాకపోకలకు కీలకంగా ఉన్న రహదారులు నేటికీ మరమ్మతులకు నోచుకోవడం లేదు. అంతర్గత రహదారుల పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా, ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లేందుకు, పంట పోలాలకు, మార్కెట్ యార్డులకు వెళ్లేందుకు ఉపయోగించే రోడ్లు, లింకు రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 80,635 కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లు ఉండగా వీటిలో 20,428 కిలోమీటర్ల (25 శాతం) ఎ మట్టి రోడ్లు ఉన్నట్లు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ గణాంకాలు తెలుపుతున్నాయి. మొత్తం రోడ్లలో పటిష్టమైన సిసి రోడ్ల నిర్మాణం కేవలం 6,077 కిలోమీటర్లు, తారు రోడ్లు 28,693 కిలోమీటర్లు నిర్మించారు. మెటల్ రోడ్లు 7,824 కిలోమీటర్లు, రబ్బీసు రోడ్లు (గ్రావెల్) 17,613 కిలోమీటర్లు నిర్మించారు. అయితే, రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి విషయంలో కొంత కాలంగా నిర్లక్ష్యం జరగడంతో ప్రధాన రహదారులు అన్ని గోతుల మయంగా మారాయి. మట్టి రోడ్లను అభివృద్ధి పరిచేందుకు నిధులు ఉన్నా, ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో పరిస్థితి దారుణంగా ఉంది.పిఎంసిఎస్‌వై, ఎపిఆర్‌ఆర్‌పి, నాబార్డు, ఎస్‌డిఎంఎఫ్, పిఆర్ నిధుల నుంచి ఈ రోడ్ల నిర్మాణాలు చేపట్టడానికి అవకాశం ఉండటంతో ఆ దిశగా చర్యలు చేపట్టి వచ్చే ఏడాది వర్షాకాలం నాటికి మట్టి రోడ్లలో కొన్నింటినైనా బాగు చేయాలన్న విజ్ఞప్తులు ప్రభుత్వానికి అందుతున్నాయి.

10 నుంచి19 వరకు వైకుంఠ ద్వారదర్శనాలు

ప్రజాశక్తి - తిరుమల

వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 19 వరకు తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలకు టిటిడి విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. దర్శన టోకెన్లు/టికెట్లు ఉన్న యాత్రికులను మాత్రమే దర్శనాలకు అనుమతిస్తారు. టోకెన్లు లేని యాత్రికులకు తిరుమలకు అనుమతిస్తారు కానీ దర్శనం చేసుకునే అవకాశం ఉండదు. చంటి బిడ్డలు, వృద్ధులు, దివ్యాంగులు, రక్షణ శాఖ, ఎన్‌ఆర్ఐ మొదలైన విశేష దర్శనాలు ఈ పది రోజుల పాటు రద్దు చేశారు. ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపి బ్రేక్ దర్శనాలు పది రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు టిటిడి ప్రకటించింది.

కోడి గుడ్డు అ'ధర'హో

- రిటైల్ ధర రూ.7,00
- హోల్‌సెల్ ధర రూ.5.80
- చికెన్ ధరలు స్వల్పంగా పెంపు
- పండుగలతో పౌల్ట్రీ రైతులకు స్వల్ప ఊరట

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గుడ్డు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రిటైల్ మార్కెట్‌లో రూ.7 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. కార్తీక మాసం వెళ్లినా కూరగాయల ధరలు కొండదిగనంటున్నాయి. తాజా పరిస్థితుల్లో కోడ్డి గుడ్డు ధరలు కూడా కొండెక్కడంతో కొనుగోలుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది ఇదే సీజన్‌లో కోడిగుడ్డు ధర రూ.6 కాగా ప్రస్తుతం రూ.7కు చేరింది. రెండేళ్లుగా పౌల్ట్రీ పరిశ్రమ నష్టాల్లో ఉండటంతో రైతులు కొత్త బ్యాచ్‌లు వేయలేదు. దీంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. జనవరి 1, క్రిస్‌మస్ నేపథ్యంలో కేకుల తయారీకి వినియోగించడం, మరో వైపు కార్తీక మాసం ముగియడంతో ధరలు పెరిగటం మరో కారణమని వ్యాపారులు చెబుతున్నారు. తమకు హోల్‌సేల్ రూ.5.85 మాత్రమేనని చెల్లిస్తున్నారని రైతులు చెబుతున్నారు. జిల్లా పౌల్ట్రీ పరిశ్రమ నాలుగేళ్లుగా నష్టాల్లో ఉంది. గత నెలలోనూ కోడి గుడ్డు హోల్‌సేల్ కేవలం రూ.4.50 మాత్రమే. అయితే ప్రస్తుతం పెరుగుదుల ఊరటనివ్వగా కొనుగోలుదారులకు మాత్రం చుక్కలు కన్పిస్తున్నాయి. 2017లో గుడ్డు ధర రికార్డు స్థాయిలో రూ.5.45కి చేరింది. తాజాగా హోల్‌సేల్ ధర రూ.5.85కు చేరటంతో కొత్త రికార్డును నమోదు చేసింది. ఉమ్మడి జిల్లాలో వ్యవసాయం తరువాత పెద్ద పరిశ్రమగా పౌల్ట్రీ ఉంది. సుమారు 300 పౌల్ట్రీ ఫారాలు ఉండగా, దాదాపు 1.40 కోట్ల కోళ్ల పెంపకం సాగుతోంది. 1.10 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. 40 శాతం మేర గుడ్లు స్థానిక మార్కెట్లలో వినియోగిస్తుండగా 60 శాతం గుడ్లు ఈశాన్య రాష్ట్రాలైన ఒరిస్సా బీహార్ బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. కనీసం రూ.6.00 రైతులకు లభిస్తే నష్టాల నుంచి కొంతమేర కోలుకోగలమని రైతులు చెబుతున్నారు. గుడ్డు ఉత్పత్తికి రూ.5.50 వెచ్చిస్తున్నట్లు వివరించారు. కోళ్లకు వినియోగించే మేత, దాణా ఖర్చులు ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగాయి. మొక్కజొన్న, సోయా దాణాను అధికంగా వాడుతుంటారు. మొక్కజొన్న దాణా టన్నుకు ఏడాదిలో రూ.18 వేల నుంచి రూ.25 వేలు, సోయా రూ.50 వేల నుంచి రూ.80 వేలకు పెరిగింది. దీంతో దాణా ఖర్చు రెట్టింపైంది. అదే స్థాయిలో ధర పెరగకపోవడంతో నష్టాలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. 2019కి పూర్వం దాణా రేటు తక్కువగా ఉండటంతో ఖర్చు తగ్గి రైతులు లాభాలు పొందారు. గడిచిన నాలుగేళ్లలో దాణా, ఇతర ఖర్చులు రెండింతలు పెరగడంతో నష్టాలు చవిచూస్తున్నారు. మరోవైపు ఇక్కడి గుడ్డు ఎగుమతులు జరిగే ఈశాన్య రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, యూపీ, కోల్‌కత్తా వంటి రాష్ట్రాలలో అక్కడి ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. సబ్సిడీలు, రాయితీలు కల్పిస్తున్నాయి. దీంతో కొన్నిసార్లు స్థానిక మార్కెట్‌పైనే ఆధార పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో గత రెండేళ్ల నుంచి కోళ్ల ఫారాల్లో నష్టాల కారణంగా కొత్త బ్యాచ్‌లు వేయడం లేదు. పాతకోళ్లతోనే నడుస్తున్నందున తాజాగా పెరుగుదలకు ఒక కారణమని తెలుస్తోంది. కార్తీక మాసం అనంతరం చికెన్ ధరలూ స్వల్పంగా పెరిగాయి. గత నెలలో కేజీ రూ.150 కాగా దశల వారీగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం కేజీ రూ.220కి చేరింది.

గుడ్డుకు కనీసం రూ.6 చెల్లిస్తేనే గిట్టుబాటు
- కెవి.ముకుంద రెడ్డి, పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు.

ప్రస్తుతం పెరిగిన ధరతో ఏ మాత్రం ఊరట లభించదు. కనీసం రూ.6.00 చెల్లిస్తే కొంత మేర గిట్టుబాటు అవుతుంది. మేత ధరలు, విద్యుత్ బిల్లుల పెట్టుబడి ఖర్చు కారణంగా ఉత్పత్తి ఖర్చు రూ.5.50కు చేరింది.రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రంగానికి ఇచ్చినట్టుగానే విద్యుత్ సబ్సిడీ సౌకర్యం కల్పించాలి. కోళ్ల పరిశ్రమ పెద్ద తరహా పరిశ్రమ కిందకు రాదు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమగా గుర్తించాలి. విద్యుత్ సంస్థ నుంచి రాయితీ అమలు చేస్తే రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదా అవుతుంది. దీంతో కొంత ఊరట లభించే అవకాశం ఉంది.

మండలి చైర్మన్ మోషేనురాజు సమక్షంలో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గోపిమూర్తి, చిత్రంలో ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు తదితరులు

ఎమ్మెల్సీగా గోపిమూర్తి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తూర్పు - పశ్చిమ గోదావరి శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పిడిఎఫ్ తరపున గెలుపొందిన బొర్రా గోపిమూర్తి ఎంఎల్‌సిగా శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీలోని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు తన కార్యాలయంలో గోపిమూర్తితో ప్రమాణం చేయిం చారు. అనంతరం చైర్మన్ ఆయనకు అభినందనలు తెలపడంతోపాటు శాసన మండలికి సంబంధించిన నియమ, నిబంధనలు, కార్యకలాపాల పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు అరుణకుమారి, ఎస్‌పి మనోహర్, జ్యోతిబసు, సుభాషిణి, ఎపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి జి హృదయరాజు, బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి మనోజ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ కాలేజ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోటేశ్వరరావు, గోపిమూర్తి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ తొలి చిత్రం హీరోయిన్‌కు సత్కారం

నందమూరి తారక రామారావు తొలి చిత్రం హీరోయిన్ కృష్ణవేణిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఘనంగా సత్కరించారు. ఎన్‌టిఆర్ సినీ వజ్రోత్సవ వేడుకకు 102 ఏళ్ల వయసులో ఆమె హాజరు కావడం విశేషం.

శాంతి భద్రతల గురించి చర్చించేందుకు సమయం ఇవ్వండి

- అమిత్‌షాకు కేజ్రీవాల్ లేఖ

న్యూఢిల్లీ: ఢిల్లీలో శాంతిభద్రతల గురించి చర్చించేందుకు సమయం ఇవ్వాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. ఢిల్లీలో నేరాలు నానాటికీ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'భారత్‌లోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే అత్యధికంగా మహిళలపై నేరాలు జరుగుతున్నది ఢిల్లీలోనే. ఆ విషయంలో తొలి స్థానంలో ఉంది. హత్యలు, దోపిడీలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. నేర గణాంకాలను పరిశీలిస్తే 'నేర రాజధాని'గా మన దేశం, ఢిల్లీ మారేలా ఉన్నాయి.

పాఠశాలలు, విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు తరచూ వస్తున్నాయి. డ్రగ్స్ సంబంధిత నేరాలు 300 శాతానికి పైగా పెరిగాయి' అని లేఖలో కేజ్రీవాల్ తెలిపారు. 'బాంబు బెదిరింపుల కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎంత భయపడుతున్నారో ఊహించారా..? నిత్యం వారంతా భయంభయంగా బతుకుతున్నారు. పట్టపగలే హత్యలు, కాల్పులు, కిడ్నాప్‌లు జరుగుతున్నాయి. రాజధానిలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి. ఈ వైఫల్యాల కారణంగా ఢిల్లీకి 'రేప్ క్యాపిటల్', 'క్రైం క్యాపిటల్' అనే కొత్త పేర్లు వస్తున్నాయి. రాజధానిలో నెలకొన్న పరిస్థితి గురించి మరింత స్పష్టంగా వివరించేందుకు సమయం ఇవ్వాలని కోరుతున్నాను" అని లేఖలో పేర్కొన్నారు.

అన్నదాత సుఖీభవ అందేదెన్నడో..!

- ఏడాదిలో ఇప్పటి వరకూ దక్కని ప్రభుత్వ భరోసా
- ఏటా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ
- పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురుచూపు
- ఇప్పటికే రైతులకు పీఎం కిసాన్ సాయం

ప్రజాశక్తి- రాజోలు

అన్నదాత సుఖీభవ పథకం అందేదెన్నడోనని రైతులు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ రైతుభరోసా పథకానికి పేరు మార్చడం మినహా ఎటువంటి పురోగతి లేకపోవడం రైతుల్లో నిరుత్సాహం వ్యక్తమవుతోంది. అంబేద్కర్ కోనసీమ జిల్లా లో 1,58,129 ఎకరాల్లో 95,645 మంది రైతులు వరి సాగు చేపట్టారు.ఇందులో పీఎం కిసాన్ పథకానికి 1,22,279 మంది అర్హత పొందారు. కొత్త ప్రభుత్వం రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మార్చారు. ప్రభుత్వ వెబ్ సైట్‌లోనూ మార్పులు చేశారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.20 వేలు అందిస్తామని సిఎం చంద్రబాబు 'సూపర్ సిక్స్'లో ప్రకటించారు. ఈపథకం అమలుకు రైతులు ఎదురు చూస్తున్నారు.

పట్టించుకోని కూటమి సర్కారు

ఆరుగాలం శ్రమిస్తున్నా ప్రభుత్వం నుంచి కనీస భరోసా రైతుకు అందడం లేదు.. ఒకపక్క ప్రకృతి వైపరీత్యాలు నష్టాలు తెస్తుంటే, మరోవైపు ఇచ్చిన హామీలను కూటమి సర్కారు పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల పంట సాయం అందిస్తామన్న చంద్రబాబు ఇప్పుడా ఊసెత్తడం లేదు. అన్నదాతను ఆదుకుంటామన్న మాట నీటిమూటగానే మిగిలింది. కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి 5నెలలు పూర్తయినా అన్నదాత సుఖీభవ పథకంపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికే పంట పెట్టుబడి పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి కంటనీరు రప్పిస్తుంది.

పెరిగిన ఖర్చు.. అందని సాయం

జిల్లాలోని 22 మండలాల్లో 2024-25 ఖరీఫ్ కు సంబంధించి 1,58,129 ఎకరాల్లో 95,645 మంది రైతులు వరి సాగు చేపట్టారు.ఇందులో పీఎం కిసాన్ పథకానికి 1,22,279 మంది అర్హత పొందారు. ఈ ఏడాది జూన్ 18న రూ.2 వేల చొప్పున రూ.24.46 కోట్లు ఇవ్వగా, రెండో విడతగా అక్టోబర్ లో రూ.22.45 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అందించాల్సిన సాయంపై నోరుమెదపడం లేదు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేలను సత్వరమే అందించాలని రైతన్నలు విజ్ఞప్తి చేస్తున్నారు. వరి పంటకు మద్దతు ధర పెరగకపోగా, పెట్టుబడి మాత్రం ప్రతి సీజన్లోనూ అధికమవుతోంది. ప్రస్తుత ప్రభుత్వం అనాలోచిత వైఖరితో వరి రైతులకు సాగు కష్టమవుతుంది.

ఖరీఫ్ ముగిసింది

రైతులకు, కౌలు రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి హామీ ఇచ్చి ంది. అంతకుముందు టిడిపి ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీ ల్లో ఈ అం శాన్ని ప్రముఖంగా ప్రస్తా వించింది. వైసిపి సర్కారు 'వైఎస్ఆర్ రైతు భరోసా' పేరిట స్కీంను అమలు చేయ గా కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' అని పేరు పెట్టింది. కాగా ఇప్పటి వరకు దీనిపై విధి విధానాలు ఖరారు చేయలేదు. రబీలోనైనా ఇస్తారా అని రైతులు చూస్తున్నారు. ప్రాధాన్యతాక్రమంలో పథకాలు అమలు చేయాలని నిర్ణయించారని, ఆ మేరకు వచ్చే ఖరీఫ్‌కు ముందు పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉందని చెబుతుతున్నారు. అదే జరిగితే ఒక ఏడాది సాయం రైతులు, కౌలు రైతులు కోల్పోతారు.

కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: విజయవాడ, డోర్ నెం.59-12-6, గ్రేస్ లైన్, గాయత్రినగర్, ఘంటసాలవారి వీధి, విజయవాడ, కృష్ణా జిల్లా-520008

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(అపెండిక్స్ IV SARFAESI చట్టం నందలి రూల్-8(1) ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (2002 నందు చట్టం 54) ప్రకారం **కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, సీతారామపురం బ్రాంచ్, విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13(12) కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తమును, దానిపై వడ్డీతో కలిపి చెల్లించవలసినదిగా ఈ క్రింది పేర్కొనబడిన ఋణగ్రహీత(లు)/హామీదారులను కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.

ఋణగ్రహీత(లు) సదరు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 నందలి రూల్ 8 ప్రకారము క్రింది వివరించిన ఆస్తులను **10-12-2024వ తేదీన స్వాధీనత** తీసుకోవడమైనదని ఈ క్రింది పేర్కొనబడిన ఋణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)ను మరియు ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా దిగువ ఆస్తులతో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా క్రింది పేర్కొనబడిన ఋణగ్రహీత(లు) బాకీ మొత్తమునకు, వడ్డీ, ఖర్చులు మొదలగునవి **కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, సీతారామపురం బ్రాంచ్, విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా** వారి ఛార్జీకి లోబడి వుంటాయి. ఒకవేళ డిమాండ్ నోటీసు జారీచేసిన తరువాత జమలు ఉన్నట్లయితే అవి సర్దుబాటు చేయబడును.

సెక్షన్ 13, సబ్-సెక్షన్ (8) చట్టప్రకారము ఋణగ్రహీత(లు) తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

ఋణగ్రహీతలు, బకాయి, డిమాండ్ నోటీసు & స్వాధీనత నోటీసు తేదీలు మరియు ఆస్తుల వివరాలు	
1	**ఋణగ్రహీత: శ్రీ. తలారి వేణు గోపాలరావు, తండ్రి: యాకోబు,** డి.నెం. 4-47ఎ, హరిజనవాడ, ఎస్.సి. కాలనీ, ఆకునూరు-521245, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్. **హామీదారు పేరు మరియు చిరునామా: (1). శ్రీమతి. కామిరెడ్డి స్పందన, భర్త: తలారి వేణు గోపాలరావు,** డి.నెం. 35-6-63, యసోబు వీధి, గిరిపురం, విజయవాడ-520010, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్. **(2). శ్రీ. జెట్టి కోటేశ్వర రావు, తండ్రి: ప్రభాకర రావు,** డి.నెం.5-70/1, పట్నం మాల పల్లి, అమరావతి-522020, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. **లోన్ అకౌంట్ నెం. 96009671546, బకాయి మొత్తం: రూ. 2,96,869/- (అక్షరాల రెండు లక్షల తొంభై ఆరు వేల ఎనిమిది వందల అరవై తొమ్మిది రూపాయలు)** + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు. **డిమాండ్ నోటీసు తేది:** 08-05-2024; **స్వాధీనత నోటీసు తేది: 10-12-2024.** తేది 12-09-2024 నాటి మునుపటి స్వాధీనత నోటీసును దినపత్రికలలో 7 దినములలోగా ప్రచురించబడలేదు కావున ఆ నోటీసును రద్దుచేయబడినది. **స్థిరాస్తి వివరములు:** గుంటూరు జిల్లా, అమరావతి మండలం, సమీప డోర్ నెం.5-57, ఆర్.ఎస్. నెం. 251/B, అమరావతి ఎస్ఆర్ఓ, రిజిష్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 3174/2022 తేది 21-09-2022 ప్రకారం శ్రీ జెట్టి కోటేశ్వర రావు, తండ్రి: ప్రభాకరరావు పేరున గల **145.2 చ॥గ॥ లేదా 121.43 చ॥మీ॥ ఇంటి స్థలం యావత్తు. హద్దులు:- తూర్పు:** గుడిసె చిన్న రాములు యొక్క భూమి, **దక్షిణం:** సర్కార్ బజారు, **పడమర:** గుడిసె దేవదానంకు చెందిన ఇల్లు, **ఉత్తరం:** గుడిసె ఎస్తేరు మరియు ఇతరులకు చెందిన భూమి.
2	**ఋణగ్రహీత: శ్రీ వడ్డి తిరుమలేశ్వర రావు, తండ్రి: గంగయ్య,** డి.నెం. 43-82-24, నల్లా మస్తాన్ రోడ్డు, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ (అర్బన్), కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-520015. **హామీదారు పేరు మరియు చిరునామా: శ్రీ. వడ్డి మాలతి దుర్గా భవాని, భర్త: తిరుమలేశ్వర రావు,** డి.నెం. 43-82-24, నల్లా మస్తాన్ రోడ్డు, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ (అర్బన్), కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-520015. **లోన్ అకౌంట్ నెం. 96009752732. మొత్తం బకాయి: రూ. 1,99,547/- (అక్షరాల ఒక లక్షా తొంభై తొమ్మిది వేల ఐదు వందల నలభై ఏడు రూపాయలు)** + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు. **డిమాండ్ నోటీసు తేది:** 08-05-2024; **స్వాధీనత నోటీసు తేది: 10-12-2024.** తేది 12-09-2024 నాటి మునుపటి స్వాధీనత నోటీసును దినపత్రికలలో 7 దినములలోగా ప్రచురించబడలేదు కావున ఆ నోటీసును రద్దుచేయబడినది. **స్థిరాస్తి వివరములు :** ఎన్.టి.ఆర్. జిల్లా, జగ్గయ్యపేట మండలం, రామచంద్రునిపేట, తక్కెళ్లపాడు గ్రామపంచాయతీ, ఆర్.ఎస్. నెం.75/3 నందు **133.33 చ॥గ॥ లేదా 111.48 చ॥మీ॥ ఖాళీ స్థలం కలిగిన రెసిడెన్షియల్ ప్లాట్ నెం. 422. హద్దులు:- తూర్పు:** 33'0" అ॥ వెడల్పు రోడ్డు – 30 అ॥, **దక్షిణం:** ప్లాట్ నెం.421 స్థలం – 40 అ॥, **పడమర:** ప్లాట్ నెం.397 స్థలం – 30 అ॥, **ఉత్తరం:** ప్లాట్ నెం.423 స్థలం – 40 అ॥.
3	**ఋణగ్రహీత: శ్రీమతి. కామిరెడ్డి స్పందన, భర్త: తలారి వేణు గోపాలరావు,** డి.నెం. 35-6-63, యసోబు వీధి, గిరిపురం, విజయవాడ-520010, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్. **హామీదారు పేరు మరియు చిరునామా: (1). శ్రీ. తలారి వేణు గోపాలరావు, తండ్రి: యాకోబు,** డి.నెం. 4-47ఎ, హరిజనవాడ, ఎస్.సి. కాలనీ, ఆకునూరు-521245, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్. **(2). శ్రీ. జెట్టి కోటేశ్వర రావు, తండ్రి: ప్రభాకర రావు,** డి.నెం.5-70/1, పట్నం మాల పల్లి, అమరావతి-522020, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. **లోన్ అకౌంట్ నెం. 96009671580. మొత్తం బకాయి: రూ. 2,02,404/- (అక్షరాల రెండు లక్షల రెండు వేల నాలుగు వందల నాలుగు రూపాయలు)** + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు. **డిమాండ్ నోటీసు తేది:** 08-05-2024; **స్వాధీనత నోటీసు తేది: 10-12-2024.** తేది 12-09-2024 నాటి మునుపటి స్వాధీనత నోటీసును దినపత్రికలలో 7 దినములలోగా ప్రచురించబడలేదు కావున ఆ నోటీసును రద్దుచేయబడినది. **స్థిరాస్తి వివరములు :** గుంటూరు జిల్లా, అమరావతి మండలం, సమీప డోర్ నెం.5-57, ఆర్.ఎస్. నెం. 251/B, అమరావతి ఎస్ఆర్ఓ, రిజిష్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 3174/2022 తేది 21-09-2022 ప్రకారం శ్రీ జెట్టి కోటేశ్వర రావు, తండ్రి: ప్రభాకరరావు పేరున గల **145.2 చ॥గ॥ లేదా 121.43 చ॥మీ॥ ఇంటి స్థలం యావత్తు. హద్దులు:- తూర్పు:** గుడిసె చిన్న రాములు యొక్క భూమి, **దక్షిణం:** సర్కార్ బజారు, **పడమర:** గుడిసె దేవదానంకు చెందిన ఇల్లు, **ఉత్తరం:** గుడిసె ఎస్తేరు మరియు ఇతరులకు చెందిన భూమి.

తేది: 10-12-2024, ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్

తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలి

- సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి.రమణ

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రతి ఒక్కరూ తెలుగు భాషపై మక్కువ పెంచుకొని, తెలుగు భాషను పరిరక్షించుకోవాలని సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి.రమణ తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా కడపలోని సిపి బ్రౌన్ గ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన తెలుగు వైభవం కార్యక్రమానికి ముఖ్య అథితిగా హాజరై మాట్లాడారు. బ్రిటిష్ అధికారి అయిన సిపి బ్రౌన్ తెలుగు భాషపై మక్కువ పెంచుకొని తెలుగు భాషకు ఎనలేని కృషి చేశారన్నారు. సిపి బ్రౌన్ తన మొత్తం జీవితాన్ని తెలుగు భాష కోసం అంకితం చేశారని తెలిపారు. ఇంగ్లీష్-తెలుగు నిఘంటువును తయారు చేసి మనకు అందించారన్నారు. వేమన పద్యాలను వెలుగులోకి తీసుకొచ్చి అందులోని భావాన్ని తెలియజేసి ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచారని, ఆయన ప్రేరణతో బ్రౌన్ శాస్త్రి కుటుంబ సభ్యులు గ్రంథాలయం కోసం ఎంతో పాటుపడుతూ సిపి బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి ఎంతో కషి చేస్తున్నారని తెలిపారు. తెలుగు భాషకు ఎంతో ప్రాచీన స్థానం ఉందని, తెలుగు భాష మాధుర్యం సంగీతం లాంటిదని పేర్కొన్నారు. తెలుగు భాష అంతరించిపోతోందని యునోస్కో తన నివేదికలో తెలిపిందిన్నారు. తెలుగు భాష లో విద్యాభ్యాసం చేస్తే ఉద్యోగాలు రావనే భ్రమలో నుంచి ప్రతి ఒక్కరూ బయటికి రావాలన్నారు. తెలుగు భాషను నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. మాతృభాష ఎంత అవసరమో.. వేరే భాషలు కూడా ఉద్యోగరీత్యా అవసరమేనని వెల్లడించారు. తెలుగులో వ్యాకరణాలు, చందస్సులు నేర్చుకుంటే ఏ భాషనైనా నేర్చుకోవడం సులభతరం అవుతుందన్నారు. ఆంగ్ల భాష నేర్చుకుంటే మేధావులు అవుతారన్న అపోహలను నమ్మొద్దు అని సూచించారు. ఉద్యోగానికి భాషకు సంబంధం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, జస్టిస్ ఎన్‌వి.రమణ సతీమణి శివమాల, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, బ్రౌన్ శాస్త్రి కుమారుడు విజయభాస్కర్, పిచ్చయ్య చౌదరి, వైవియు విద్యాలయం ప్రొఫెసర్ పుట్టా పద్మ, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్ పాల్గొన్నారు.

16న ముఖ్యమంత్రి పోలవరం పర్యటన

సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - పోలవరం (ఏలూరు జిల్లా)

ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి పోలవరం పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. పోలవరంలో శనివారం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఎస్‌పి కె.ప్రతాప్ శివకిశోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు సమావేశపు హాల్లో అధికారులతో పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ ఉదయం సుమారు 10.45 నిమిషాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో పోలవరం ప్రాజెక్ట్ సైట్‌కు చేరుకుంటారని, అనంతరం డయాఫ్రమ్ వాల్, తదితర ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షించి, పనులు వేగవంతం చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతమయ్యేలా ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ముందుగా హెలీప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం డయాఫ్రమ్ వాల్, తదితర నిర్మాణ ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. పనుల ప్రగతిపై ప్రాజెక్టు ఇంజినీర్లు కలెక్టర్‌కు వివరించారు. ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిశోర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముఖ్యమంత్రి పాల్గొనే అన్ని ప్రదేశాల్లో పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్త్ ఏర్పాట్లు చేశామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటామన్నారు.

లాభాలు ఫుల్.. జీతాల పెంపు నిల్

- సంపద పోగేసుకుంటున్న కార్పొరేట్లు
- ప్రభుత్వ ప్రోత్సాహకాలు అదనం
- ఆర్థిక వ్యవస్థకు దెబ్బ
- జీవన ప్రమాణాలపై ప్రభావం

న్యూఢిల్లీ : దేశంలో కార్పొరేట్ల ఆదాయాలు అమాంతం పెరుగుతుండగా... ఆయా కంపెనీల్లో పని చేసే ఉద్యోగుల బతుకులు, జీవన ప్రమాణాల్లో పెద్ద మెరుగుదల ఉండటం లేదు. గడిచిన నాలుగేండ్లలో భారత కార్పొరేట్ కంపెనీల నికర లాభాలు నాలుగు రెట్లు పెరిగాయి. మరోవైపు 2019 నుంచి 2023 కాలంలో దేశంలోని ఆరు ప్రధాన రంగాల్లోని కంపెనీల్లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికుల వేతనాల్లో మాత్రం ప్రతీ ఏడాది 0.8 శాతం నుంచి 5.4 శాతం పెరుగుదల మాత్రమే ఉంది. పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ, టెక్ ఎనేబల్డ్ సంస్థ క్వెస్ కార్ప్ లిమిటెడ్‌లు ప్రభుత్వం కోసం తయారు చేసిన రిపోర్ట్ ప్రకారం.. ముఖ్యంగా తయారీ, ఇంజనీరింగ్, మౌలిక సదుపాయాల రంగాల్లో 0.8 శాతం పెరుగుదల ఉండగా.. ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్‌ఎంసీజీ) సంస్థల్లో 5.4 శాతం పెరుగుదల చోటు చేసుకుంది.

సంఘటిత రంగంలోనూ కార్మికుల నిజ వేతనాల్లో గొప్ప పెరుగుదల లేదు. గడిచిన ఐదేళ్లలో 2019-20 నుంచి 2023-24 మధ్య వరుసగా 4.8 శాతం, 6.2 శాతం, 5.5 శాతం, 6.7 శాతం, 5.4 శాతం చొప్పున ద్రవ్యోల్బణం పెరిగింది. సాధారంగా ద్రవ్యోల్బణం కంటే వేతనాల్లో ఎక్కువ పెరుగుదల ఉన్నప్పుడే ప్రజల జీవన ప్రమాణాలకు మద్దతు లభిస్తుంది. లేకపోతే వ్యయాలు పెరిగి.. ఆదాయాలు తగ్గినట్లవుతుంది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగం (బిఎఫ్ఎస్‌ఐ) సగటు వేతన పెరుగుదల 2.8 శాతం పెరుగుదల ఉంది. తక్కువ వేతనాలపై ప్రభుత్వంలోని అనేక అంతర్గత చర్చల్లో ఆందోళన వచ్చినట్టు తెలిసింది.

అంతంత మాత్రం పెంపు

2019-2023 మధ్య సగటు వేతనం

రంగం	2019	2020	2021	2022	2023	వేతనంలో పెరుగుదల
బీఎఫ్ఎస్ఐ	15,184	16,254	16,746	16,735	17,475	2.8%
మౌలిక వసతులు	19,659	21,155	19,608	20,608	20,509	0.8%
ఎఫ్ఎంసీజీ	14,608	15,763	16,538	17,826	19,023	5.4%
ఐటీ	40,333	44,589	45,186	47,352	49,076	4.0%
లాజిస్టిక్	15,844	17,290	17,132	18,331	19,534	4.2%
రిటైల్	15,514	18,048	18,799	17,908	18,675	3.7%

(క్వెస్ పేరోల్ ఆధారంగా)

"బలహీనమైన ఆదాయాలు వినిమయం తగ్గడానికి ప్రధాన కారణమని ప్రభుత్వ వర్గాలకు స్పష్టంగా తెలుసు. ముఖ్యంగా కరోనా తర్వాత పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ పెరిగింది. కానీ.. క్రమంగా వేతన వృద్ధి పడిపోయింది. దీంతో ఆర్థిక పునర్జీవంపై ఆందోళనలు పెరిగాయి." అంటూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఓ కథనంలో పేర్కొంది. 2023లో ఎఫ్‌ఎంసీజీ రంగంలో సగటు వేతనం రూ.19,023గా ఉండగా.. ఐటి రంగంలో అత్యధికంగా సగటున రూ.49,076గా నమోదయ్యింది.

2019-20 నుండి 2023-24 వరకు ఐదు సంవత్సరాలలో, రిటైల్ ద్రవ్యోల్బణం వరుసగా 4.8 శాతం, 6.2 శాతం, 5.5 శాతం, 6.7 శాతం మరియు 5.4 శాతం పెరిగింది. ఉద్యోగుల వేతన పెంపునకు సంబంధించి ఏదైనా కొంత చేయాలని ఫిక్కీ, క్వెస్ రిపోర్ట్‌ను ఉద్దేశించి చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ వి అనంత నాగేశ్వరన్ భారత కార్పొరేట్లకు సూచించారు. "ధరల పెరుగుదల లేదా ద్రవ్యోల్బణం కోసం సర్దుబాటు చేసినప్పుడు నిజమైన ఆదాయాలలో తగ్గుదల ఉంటే అది కార్మికులను మరింత దిగజార్చనుంది. ఇది స్వీయ విధ్వంసానికి దారి తీస్తుంది. దీనిపై భారత కంపెనీలు దృష్టి సారించాలి." అని అనంత నాగేశ్వరన్ సూచించారు. కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం లేదా కార్మికులను తగినంతగా తీసుకోకపోవడమూ ఆర్థిక వ్యవస్థకు హానికరంగ మారుతుందన్నారు.

ఐదేండ్లలో రూ.3 లక్షల కోట్ల లబ్ది

ఉద్యోగులకు ఒక్క అంకె శాతం వేతనాలు పెంచడంలో ఒక్కటికి నాలుగు సార్లు ఆలోచించే కార్పొరేట్ కంపెనీలు గడిచిన ఐదేండ్లలో ప్రభుత్వ పన్ను తగ్గింపుతో లక్షల కోట్ల ఆదాయాలను వెనకేసుకున్నాయి. మోడీ సర్కార్ రెండో దఫా అధికారంలోకే రాగానే 2019లో కార్పొరేట్లకు భారీగా పన్నులు తగ్గిస్తూ సంస్కరణలు చేసింది. దీంతో గడిచిన ఐదేండ్లలో బడాబాబులకు రూ.3.14 లక్షల కోట్లు ఆదా అయ్యింది. ఆ మొత్తం ప్రభుత్వ ఖజానకు గండి పడినట్లయ్యింది. మరోవైపు పారిశ్రామిక వర్గాలకు ఇతర ప్రోత్సాహకాలు అందిస్తూనే ఉంది. సంపద ఒక్క చోట పోగు పడటం, ఉద్యోగులు, కార్మికులకు వేతనాలు పెంచకపోవడం వల్ల వినిమయం పడిపోయి.. దేశ ఆర్థిక వ్యవస్థ మందగించడానికి దారి తీయనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మంత్రి లోకేష్‌తో ఎస్ఎఐఎల్ ఎమ్‌డి భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఎస్ఎఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సుఖ్‌బీర్ సింగ్ కలిశారు. ఉండవల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం శనివారం జరిగింది. రాష్ట్రంలో విద్యుత్ రంగంలో ఎస్ఎఐఎల్ పెట్టుబడులు పెట్టనుందని మంత్రి లోకేష్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. రెండు దశల్లో 1200 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు గురించి చర్చించినట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద తొలిదశలో 600 మెగావాట్ల ప్రాజెక్టును త్వరలో చేపట్టబోతున్నారని వెల్లడించారు. అగ్రికల్చర్ వ్యర్థాల నుంచి విద్యుదుత్పత్తి చేసే అంశంపైనా చర్చించినట్లు తెలిపారు. ఎన్‌డిబి బ్యాంక్ ప్రతినిధులు కూడా తనను కలిసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు దుర్మరణం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడప-తిరుపతి జాతీయ రహదారిపై కొత్త బోయినపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు.. రాజంపేట నుంచి కడప వైపు వెళుతున్న ఆర్‌టిసి బస్సు, కడప నుంచి రాజంపేట వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న కడప జిల్లా పులివెందులకు చెందిన బద్రీనాథ్‌రెడ్డి(20), అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.శ్రీకిరణ్‌కుమార్(20) అక్కడికక్కడే మృతి చెందారు. కిరణ్ కర్నూలు జిల్లా కోవెలకుంట్ల వాసి. పులివెందులకు చెందిన బద్రీనాథ్‌రెడ్డి చెన్నైలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నట్లు సమాచారం. తన మిత్రుడు పుట్టినరోజు సందర్భంగా చెన్నై నుంచి రాజంపేటకు బద్రీనాథ్‌రెడ్డి వచ్చినట్లు సహచర విద్యార్థులు తెలిపారు. రూరల్ సిఐ మహమ్మద్‌అలీ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంపై రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

నిండుకుండలా 'తిరుపతి' జలాశయాలు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

వరుస తుపానులతో తిరుపతి జిల్లా నిండుకుండలా తయారైంది. జిల్లాలోని ప్రధాన జలాశయాలైన అరణియార్ సామర్థ్యం 1.85 టిఎంసిలు కాగా ప్రస్తుతం 1.82.5 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 4800 క్యూసెక్కులు వస్తుండడంతో 5600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం 0.910 టిఎంసిలు కాగా ప్రస్తుతం 0.242 టిఎంసిలు నిల్వ ఉంది. 600 ఇన్‌ఫ్లో వస్తుండడంతో అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. మల్లిమడుగు సామర్థ్యం 0.181 టిఎంసిలు కాగా ప్రస్తుతం 0.181 నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 2800 క్యూసెక్కులు వస్తుడడంతో 3500 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. కాళంగి జలాశయానికి వరదనీరు పెరగడంతో మొత్తం 18 గేట్లలో 12 గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

- ముఖ్యమంత్రికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అదాని సంస్థ నుంచి సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఈ ఒప్పందాలపై న్యాయ స్థానాల్లో పిటిషన్లు పెండింగ్‌లో ఉండటం, 2024 అక్టోబరు నాటికి అందాల్సిన 3,000 మెగావాట్ల సౌర విద్యుత్ అందించకపోవడం, భారీ స్థాయిలో అవినీతి ఆరోపణల నేపథ్యమే ఇందుకు కారణాలుగా పేర్కొన్నారు. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు శనివారం లేఖ రాశారు. అదాని ఇచ్చిన ముడుపుల్లో 86 శాతం (రూ.1,750 కోట్లు) అప్పటి వైసిపి ప్రభుత్వ హయాంలో చేతులు మారాయని అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ బయట పెట్టిందన్నారు. దురుద్దేశంతో కుదుర్చుకున్న ఈ ఒప్పందాల వల్ల రాష్ట్ర ప్రజలపై రానున్న 25 ఏళ్లలో రూ.లక్ష కోట్ల భారం పడుతుందని చెప్పారు. అలాగే ఒప్పందాల్లో అవకతవకలపై సిపిఐ తరపున తాను హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేయగా, ప్రస్తుత ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కూడా అప్పట్లో మరో పిటిషన్ దాఖలు చేసినట్లు చెప్పారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని అదాని సంస్థలతో సౌర విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సిఎంను కోరారు.

నేను ఎక్కడికీ పోలేదు

- ఇంట్లోనే ఉన్నా : మోహన్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలీసులకు అందుబాటులో లేకుండా నటుడు మంచు మోహన్‌బాబు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారంటూ వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, వైద్యుల పర్యవేక్షణలో ఇంట్లోనే ఉన్నానని వెల్లడించారు. జల్‌పల్లిలోని తన ఇంటి వద్ద జర్నలిస్టుపై దాడి ఘటనకు సంబంధించి హత్యాయత్నం కేసులో స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా మోహన్ బాబు అందుబాటులో లేరంటూ సోషల్ మీడియా లో ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో మోహన్ బాబు స్పందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తన ముందస్తు బెయిల్ తిరస్కరించినట్టు వార్తలు వస్తున్నాయని, అందులో ఎలాంటి నిజమూ లేదన్నారు. తాను ప్రస్తుతం ఇంట్లో వైద్య సంరక్షణలోనే ఉన్నానని, వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు వార్తలు రాయొద్దని మీడియాను కోరుతున్నానని పేర్కొన్నారు.

అల్లు అర్జున్ విడుదల

- బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ప్రకటన

మీడియాతో మాట్లాడుతున్న అల్లు అర్జున్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చట్టాన్ని గౌరవిస్తానని, పోలీసుల విచారణకు సహకరిస్తానని ప్రముఖ నటుడు అల్లు అర్జున్ తెలిపారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట కేసులో శుక్రవారం రిమాండ్‌కు వెళ్లిన ఆయన హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడంతో శనివారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి నేరుగా గీత ఆర్ట్స్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం అక్కడి నుంచి జూబ్లీహిల్స్‌లోని తన ఇంటికి వెళ్లారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. 20 సంవత్సరాలుగా తన మామలు చిరంజీవి, పవన్ కల్యాణ్ సినిమాలు విడుదలైన మొదటి రోజే సంధ్య థియేటర్‌కు వెళ్లి చూడటం తనకు అలవాటని, ఎప్పుడూ ఇలా జరగలేదని చెప్పారు. పుష్ప-2 విడుదల సందర్భంగా రేవతి అనే మహిళ చనిపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ ఘటన ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తానని, వారికి ఆర్థికంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కేసు కోర్టు పరిధిలో ఉన్నందున ఇంతకన్నా ఎక్కువ మాట్లాడలేనని, తనకు సహకరించిన మీడియా మిత్రులకు, కుటుంబ సభ్యులకు, బంధువులకు, అభిమానులకు అల్లు అర్జున్ కృతజ్ఞతలు తెలిపారు.

పలువురు ప్రముఖుల పరామర్శ

జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్‌ను పలువురు చిత్ర రంగ ప్రముఖులు కలిసి పరామర్శించారు. వారిలో ప్రముఖ నటులు వెంకటేష్, అక్కినేని అఖిల్, అడివి శేష్ తదితరులు ఉన్నారు. చిరంజీవి సతీమణి సురేఖ తన మేనల్లుడు అర్జున్‌ని కలిసి, భావోద్వేగానికి గురయ్యారు.

నేడు డబ్ల్యుపిఎల్ మినీ వేలం

- 19 ఖాళీలకు రేసులో 120మంది ప్లేయర్లు
- సాయంత్రం 3.00గం॥లకు

బెంగళూరు: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) 2025 సీజన్‌కు సంబంధించి మినీ వేలం నేడు జరగనుంది. బెంగళూరు వేదికగా జరిగే ఈ మినీ వేలంలో మొత్తం 120 మహిళా క్రికెటర్లు రేసులో ఉన్నారు. డబ్ల్యుపిఎల్ మూడో సీజన్‌కు సంబంధించి మాత్రమే ఈ వేలం జరగనుండగా.. ఢిల్లీ క్యాపిటల్స్, యుపి వారియర్స్, గుజరాత్ జెయింట్స్ ఫ్రాంచైజీలు తమ తమ ఖాళీలను భర్తీ చేసుకొనేందుకు మాత్రమే మినీ వేలం జరగనుంది. మూడు ఫ్రాంచైజీలు కలిపి 19మంది ప్లేయర్స్‌ను మాత్రమే కొనుగోలు చేసుకోవాల్సి ఉంది. కేవలం 19మంది ప్లేయర్స్ సంబంధించి మాత్రమే వేలం జరగనుండడంతో కొద్ది గంటల్లో ముగిసే అవకాశముంది. మినీ వేలంకు సంబంధించి మొత్తం 400కు పైగా ఆటగాళ్లు తమ పేర్లను నమోదు చేసుకోగా.. బిసిసిఐ 120మంది ప్లేయర్లతో షార్ట్‌లిస్ట్‌ను తయారు చేసింది. ఇందులో 91మంది భారత్‌కు, 29మంది విదేశీ ప్లేయర్లు ఉన్నారు. ప్రతి ఫ్రాంచైజీ తప్పనిసరిగా ఐదుగురు ప్లేయర్లను కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. భారత స్టార్ క్రీడాకారిణుల్లో ఆల్‌రౌండర్ తేజల్ హసబ్నిస్, ప్రత్యేష, స్నేహ్ రాణా, శుభ సతీష్, మాన్సీ జోషితోపాటు వికెట్ కీపర్లు సుష్మా వర్మ, సుజాత పర్వీన్ ఉన్నారు. అలాగే లెక్ స్పిన్నర్ పూనమ్ యాదవ్, బ్యాటర్ మాధురీ మెహతా కూడా వేలం బరిలో ఉన్నారు. విదేశీ ప్లేయర్లలో ఇంగ్లండ్ పేసర్ లారెన్ బెల్, ఆస్ట్రేలియా పేసర్ లారెన్ చీటిల్‌తోపాటు దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ నాడిన్ డి-క్లార్క్ కూడా ఈసారి జరిగే వేలం రేసులోనే ఉన్నారు. గుజరాత్ సూపర్ జెయింట్స్ రూ.4.40కోట్ల అత్యధిక నగదును, ఢిల్లీ క్యాపిటల్స్ రూ.2.5కోట్ల తక్కువ నగదును కలిసి ఉన్నాయి.

మళ్లీ గెలుపు బాటలో టైటాన్స్

- ఉత్కంఠ పోరులో గుజరాత్‌పై విజయం
- ప్రొ కబడ్డీ సీజన్-11

పూణే: ప్రొ కబడ్డీ సీజన్-11లో తెలుగు టైటాన్స్ మళ్లీ గెలుపులో బాట పట్టింది. శనివారం జరిగిన లీగ్ పోటీలో టైటాన్స్ 36-32పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తుచేసింది. టైటాన్స్ జట్టులో పవన్ షెహ్రావత్(12), విజయ్(8) రైడ్స్‌లో రాణించగా.. సాగర్, ఆశీశ్ ట్యాకిల్స్‌లో మెరిసారు. ఆ జట్టు నాలుగుసార్లు గుజరాత్‌ను ఆలౌట్ చేయగా.. 25పాయింట్లు రైడ్‌ల ద్వారా, 6పాయింట్లు ట్యాకిల్స్ ద్వారా సాధించింది. ఇక గుజరాత్ జట్టులో రాకేశ్(10), గుమన్(9) రైడ్స్‌లో రాణించగా.. ట్యాకిల్స్‌లో నీరజ్, మనుజ్ రాణించారు. కానీ ఆ జట్టు రైడ్‌ల ద్వారా కేవలం 22పాయింట్లు మాత్రమే సాధించి, రెండుసార్లు మాత్రమే టైటాన్ జట్టును ఆలౌట్ చేయగల్గింది. ఈ గెలుపుతో తెలుగు టైటాన్స్ 20మ్యాచ్‌లు ముగిసేసరికి 11గెలుపులతో సహా 60పాయింట్లతో 5వ స్థానానికి ఎగబాకింది.

హాలీవుడ్‌తో మంచు విష్ణు వ్యాపార భాగస్వామ్యం

తరంగ వెంచర్స్ పేరుతో మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీలోకి నటుడు మంచు విష్ణు ప్రవేశిస్తున్నారు. హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్‌తో కలిసి భాగస్వామ్యమయ్యేందుకు సుముఖంగా ఉన్నానని ఆయన ప్రకటించారు. 50 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నారు. తరంగ వెంచర్స్ ద్వారా ఓటీటీ, యానిమేషన్, గేమింగ్, బ్లాక్ చెయిన్, సరికొత్త టెక్నాలజీలైన ఎఆర్, విఆర్, ఎఐ వంటి సాంకేతికకు సంబంధించిన సేవలు అందించనున్నారు. ఇందులో మంచు విష్ణు, ఆదిశ్రీ, ప్రద్యుమన్ ఝూలా, వినయ్ మహేశ్వరి, విల్‌స్మిత్, దేవేష్ చావ్లా, సతీష్ కటారియాలు భాగస్వాములుగా ఉన్నారు. వీరితో పాటుగా మరికొందరు చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లుగా సమాచారం. కుటుంబ వివాదాలతో మంచు విష్ణు ఇప్పటికే సతమతమవుతున్నారు. ఆయన తాజా మూవీ 'కన్నప్ప' షూటింగ్ పూర్తయ్యింది. షూటింగ్ అనంతర కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వచ్చే ఏప్రిల్ 25న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమాలో విష్ణుతోపాటు మోహన్‌బాబు, శరత్‌కుమార్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, కాజల్ అగర్వాల్ తదితులు అతిథి పాత్రల్లో నటిస్తున్నారు.

'యమజాలీ లవ్‌మీ లైలా' టైటిల్ లోగో ఆవిష్కరణ

ఎస్‌పి క్రియేషన్ నిర్మాణ సారధ్యంలో కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం సాయి పవన్ సుంకర తెరకెక్కుతున్న కొత్త చిత్రం 'యమజాలీ లవ్‌మీ లైలా'. నిర్మాత కె.మహేశ్వర. ఈ సినిమా టైటిల్ లోగో ఆవిష్కరణ కార్యక్రమం అనంతపురంలో శనివారం జరిగింది. డాక్టర్ సామ్రాట్, కె.బి.మధు, భువనేశ్వరి సినీ నిర్మాణ సంస్థ నిర్మాత కె.విశ్వాచారి, ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ చెన్నా రామమ్మూర్తి, సూపరింటెండెంట్ రఘునాథ్‌ప్రసాద్, డాక్టర్ కుమారయ్య, కశిరెడ్డి సూర్యనారాయణరెడ్డి తదితరులు టైటిల్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిపవన్ సుంకర, కె.మహేశ్వర మాట్లాడారు. వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ పూర్తిచేస్తామన్నారు. అన్ని తరగతుల ప్రేక్షకులు మెచ్చేలా ప్రేమ కథను తెరకెక్కిస్తున్నామన్నారు. సినీ సంగీత దర్శకులు ఎ.శేషు రాయల్‌తోపాటుగా నాగరాజు, వెంకటాద్రి, కలిమిశెట్టి వెంకటేశ్వర్లు, సిఎం నర్సింహులు, శ్రీనివాస్, జగదీష్, మల్లికార్జున, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అఖిల్‌కు జోడీగా శ్రీలీల

అఖిల్ అక్కినేని, శ్రీలీల జోడీగా కొత్త సినిమా తెరకెక్కనుంది. అన్నపూర్ణ-సితార బ్యానర్‌లో ఈ సినిమా రానుంది. నాగచైతన్యతో మరో సినిమాలో శ్రీలీల నటించనుంది. ఇప్పటికే రవితేజతో 'సితార'లో నటిస్తోంది. అదే బ్యానర్‌లో సిద్ధు జొన్నలగడ్డ సినిమాకు కూడా శ్రీలీల హీరోయిన్. సితార బ్యానర్‌లోనే మూడు సినిమాల్లో శ్రీలీల నటించనుంది.

వెంకట దత్తసాయితో పివి సింధు నిశ్చితార్థం

జైపూర్: రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పివి సింధు త్వరలో వెంకట సాయిదత్తతో వివాహం చేసుకోనున్నారు. నిశ్చితార్థం సందర్భంగా ఇరువురు రింగ్స్ మార్చుకున్న ఫొటోలను సింధు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకుంది. ఈ సందర్భంగా 'ఒకరి ప్రేమనకు దక్కిన సమయంలో.. తిరిగి మనం ప్రేమించాలి' అని క్యాప్షన్‌తో ఫొటోను షేర్ చేసింది. ఎంగేజ్‌మెంట్ సందర్భంగా ఇద్దరూ కేక్ కట్ చేశారు. పివి సింధు వివాహ వేడుక ఈ నెల 22న రాజస్థాన్‌లో జరగనుంది. ఉదయ్‌పూర్‌లోని ప్యాలెస్‌లో వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కాబోయే వరుడు హైదరాబాద్‌కు చెందిన ఐటీ ప్రొఫెషనల్. పొసిడెక్స్ టెక్నాలజీస్‌లో వెంకట దత్త సాయి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. వివాహం అనంతరం 24న హైదరాబాద్‌లో రిసెప్షన్‌ను నిర్వహించనున్నట్లు, పెళ్లి వేడుకలు ఈ నెల 20 నుంచి మొదలుకానున్నట్లు సింధు తండ్రి రమణ తెలిపారు.

న్యూజిలాండ్ 315/9

లాథమ్, సాంట్నర్ అర్ధసెంచరీలు

హామిల్టన్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో, చివరి టెస్ట్‌లో న్యూజిలాండ్ ఓపెనర్, కెప్టెన్ టామ్ లాథమ్, ఆల్‌రౌండర్ మిచెల్ సాంట్నర్ అర్ధసెంచరీలతో మెరిసారు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ జట్టు 9వికెట్ల నష్టానికి 315పరుగులు చేసింది. టాస్‌ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు శుభారంభం దక్కింది. ఓపెనర్ లాథమ్(63), యంగ్(42) కలిసి తొలి వికెట్‌కు 105పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత విలియమ్సన్(44) రాణించినా.. రచిన్ రవీంద్ర(18), మిచెల్(14), బ్లండెల్(21), ఫిలిప్స్(5) నిరాశపరిచారు. దీంతో న్యూజిలాండ్ జట్టు ఒక దశలో 231పరుగులకే 7వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో సాంట్నర్(50నాటౌట్), సోథీ(23) మరో వికెట్ కోల్పోకుండా వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. ఇంగ్లండ్ బౌలర్లు పోట్స్, అట్కిన్సన్‌కు మూడేసి, కర్సేకు రెండు, కెప్టెన్ స్టోక్స్‌కు ఒక వికెట్ దక్కాయి.

ఆఫ్ఘనిస్తాన్‌దే సిరీస్

- చివరి టి20లో జింబాబ్వేపై మూడు వికెట్ల తేడాతో గెలుపు

హరారే: జింబాబ్వేతో జరిగిన మూడు టి20ల సిరీస్‌ను ఆఫ్ఘనిస్తాన్ జట్టు చేజిక్కించుకుంది. తొలి టి20లో ఓడిన ఆఫ్ఘనిస్తాన్.. ఆ తర్వాత జరిగి రెండు టి20ల్లోనూ నెగ్గి సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. హరారే స్పోర్ట్స్‌క్లబ్‌లో శనివారం జరిగిన మూడో చివరి టి20లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే 19.5ఓవర్లలో 127పరుగులకు కుప్పకూలింది. జింబాబ్వే బ్యాటర్ బెన్నెట్(31), మధెర్వే(21)మాత్రమే బ్యాటింగ్‌లో రాణించగా.. ఆఫ్ఘనిస్తాన్ కెప్టెన్ రషీద్ ఖాన్‌కు నాలుగు, ముజీబ్, నవీన్, అజ్మతుల్లాకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ లక్ష్యాన్ని ఆఫ్ఘనిస్తాన్ జట్టు 19.3ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి చేదించింది. ఒమర్జాయ్(34), గులాబుద్దీన్(22), మహ్మద్ నబీ(24నాటౌట్) మ్యాచ్‌ను ముగించారు. జింబాబ్వే బౌలర్లు ముజరబ్బాని, ట్రేవియర్, కెప్టెన్ సికిందర్ రాజాకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రషీద్ ఖాన్‌కు దక్కింది.

స్థానిక సంస్థలకూ 'జమిలి'!

- టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జమిలి ఎన్నికల్లో.. స్థానిక సంస్థలను కూడా మిలితం చేయాలని టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. శనివారం లోక్‌సభలో రాజ్యాంగంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా అప్రజాస్వామికంగా ఆంధ్రప్రదేశ్‌ను విభజించారని చెపాపరు. విభజనను రాష్ట్ర అసెంబ్లీ తిరస్కరించినా నాటి పాలకులు పట్టించుకోలేదన్నారు. రాజ్యాంగ నిర్మాణంలో 389 మంది పాలుపంచుకోగా, వారిలో 13 మంది తెలుగు వారు కూడా ఉన్నారని, తెలుగుజాతికి ఇది ఎంతో గర్వకారణమని తెలిపారు. టిడిపికి రాజ్యాంగంపై అచంచలమైన విశ్వాసం ఉందని, భవిష్యత్తు తరాలకు ప్రజాస్వామ్య ఆదర్శాలను కాపాడేందుకు నిబద్ధతతో పనిచేయుటకు కట్టుబడి ఉంటుందని ఆయన తెలిపారు.

మాజీ కేంద్ర మంత్రి ఇళంగోవన్ కన్నుమూత

చెన్నయ్ : తమిళనాడుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి ఇవికెఎస్ ఇళంగోవన్ (73) శనివారం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రభృతులు సంతాపం తెలిపారు. ఇళంగోవన్ గతకొంతకాలంగా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. నవంబర్ 13న స్థానిక ఎంఐఒటి ఆసుపత్రిలో ఆయన చేరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఇళంగోవన్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు తిరుమహన్ ఇదివరకే మరణించారు. 2023 ఫిబ్రవరిలో జరిగిన ఉప ఎన్నికల్లో .. ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గం నుంచి ఆయన అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆయన కుమారుడు తిరుమహన్ ఇవెర మతిచెందిన నేపథ్యంలో అక్కడ ఉప ఎన్నిక నిర్వహించారు. ద్రావిడ ఉద్యమ నేత పెరియార్ ఈవీ రామస్వామి సోదరుడి మనవడే ఇళంగోవన్. చిన్న వయసులోనే ఇళంగోవన్ రాజకీయాల్లోకి వచ్చారు. 1984లో ఆయన తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2004లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో ఆయన కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రిగా చేశారు. తమిళనాడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కూడా చేశారు.

సాయాన్ని.. తిరిగి ఇచ్చేయాలంటే ఎలా?

- విజిఎఫ్ ఫండ్‌పై కేంద్రం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- ప్రధానికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ లేఖ

తిరువనంతపురం : కేరళలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి తామెంతో సహకరిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్న మోడీ సర్కార్ వాస్తవంలో తీవ్ర వివక్షత చూపుతోంది. ఈ క్రమంలోనే విజింజం పోర్టు కోసం ఖర్చు చేసిన వయబిలిటీ గ్యాప్ ఫండ్ (విజిఎఫ్)ను విడతల వారీగా కేంద్రానికి కేరళ ప్రభుత్వం తిరిగి ఇచ్చేయాంటూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని కేరళ ప్రభుత్వం తీవ్రంగా నిరసించింది. సాయంగా నిధులు ఇచ్చినట్టే ఇచ్చి తిరిగి ఇచ్చేయాలనడం సమంజమా అని నిలదీసింది. ఇదివరకే అనేక విధాలుగా విన్నవించినా..కేంద్రం పెడచెవిన పెట్టిన నేపథ్యంలో తాజాగా ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాశారు. కేంద్రం ప్రభుత్వం డిమాండ్ చేసినట్లుగా విజిఎఫ్‌ను కేరళ తిరిగి చెలిస్తే.. దేశంలో విజిఎఫ్ తిరిగి చెల్లించిన ఏకైక పోర్టుగా విజింజం పోర్టు నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. 'విజిఎఫ్‌ను కేరళ తిరిగి చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం పట్టుబట్టినట్లయితే, కేంద్రం అందించే సహాయం మూలధన గ్రాంట్ కాదు, రుణం అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇది స్పష్టంగా పథకం ఉద్దేశానికి విరుద్ధం' అని లేఖలో పేర్కొన్నారు. కేరళ ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్ట్‌లో రూ. 4,777.80 కోట్లు పెట్టుబడి పెడుతోంది. పరిమిత ఆర్థిక వనరులు ఉన్నప్పటికీ జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాజెక్టులో గణనీయమైన మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు కేరళ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను గుర్తించండి' అని సిఎం కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాల (పిపిపి)లతో ఏర్పాటు చేసే మౌలిక వసతుల ప్రాజెక్టులకు మద్దతుగా కేంద్ర ఆర్థిక శాఖకు చెందిన ఆర్థిక వ్యవహారాల విభాగం (డిఇఎ) ఈ విజిఎఫ్‌ను మంజూరు చేస్తోంది. అదే విధంగా విజింజం పోర్టుకు రూ. 817.80 కోట్లు మంజూరు చేసింది. అయితే దీన్ని కేరళ తిరిగి చెల్లించాలని ఆర్థిక శాఖ కొత్తగా షరతు విధించింది. దీనిన్ని ఉపసంహరించుకోవాలని కేరళ ప్రభుత్వం కోరుతోంది.

విషాదంలోనూ వివక్షేనా !

- కేంద్రం తీరుపై కేరళ ఎంపీలు నిరసన
- వయనాడ్‌కు న్యాయం చేయాలని ఆందోళన

పార్లమెంట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎంపిలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అంతులేని విషాదాన్ని చవిచూసిన కేరళలోని వయనాడ్ ప్రాంతాన్ని తగిన నిధులు మంజూరు చేసి ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కేరళకు చెందిన అఖిలపక్ష పార్లమెంటు సభ్యులు విమర్శించారు. కేరళ పట్ల మోడీ సర్కార్ నిధుల కేటాయింపుల్లో వివక్ష చూపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకృతి విపత్తుకు కకావికలమైన వయనాడ్‌ను ఆదుకునేందుకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 'జస్టిస్ ఫర్ వయనాడ్ (వయనాడ్‌కు న్యాయం చేయాలి)' అనే నినాదంతో కేరళ ఎంపీలు శనివారం పార్లమెంట్ ఆవరణంలో ఆందోళన చేపట్టారు. కొండచరియలు విరిగిపడిన విషాద ఘటనలో భారీగా నష్టం వాటిల్లిన వాయనాడ్‌కు సహాయ ప్యాకేజీ కోసం ప్రకటించాలని డిమాండ్ చేశారు. వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా, సిపిఎం ఎంపిలు జాన్ బ్రిట్టాస్, వి శివదాసన్, కాంగ్రెస్ ఎంపిలు కెసి వేణుగోపాల్, కె సురేష్, ఐయుఎంఎల్ ఎంపి మహ్మద్ బషీర్, ఆర్‌ఎస్‌పి ఎంపి ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్‌తో సహా కేరళలోని అన్ని పార్టీల ఎంపిలు పార్లమెంటులోని 'మకర ద్వారం' వద్ద ఆందోళన చేపట్టారు. 'వయనాడ్‌కు న్యాయం చేయండి. వివక్ష చూపవద్దు' అని నినాదాలతో ఆ పరిసర ప్రాంతాలు హోరెత్తాయి. ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ వయనాడ్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తోందన్నారు. వయనాడ్‌తో పాటు హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రకృతి విపత్తుల బాధితులను రాజకీయాల కారణంగా మోడీ సర్కార్ ఆదుకోవడం లేదని విమర్శించారు. విపత్తుల సమయంలో పాలకులు వివక్ష చూపరాదని ఆమె అన్నారు. ఈ నెల 3న కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసి అఖిలపక్ష నేతలు ఇప్పటికే వినతిపత్రం సమర్పించారు. ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి వయనాడ్‌ను ఆదుకోవాలని కోరారు. ఈ ఏడాది జులై 30న భారీ వర్షాలకు వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగిన సంగతి తెలిసిందే.

కొల్‌కతాలో మళ్లీ వైద్యుల నిరసనలు

- బెయిల్ మంజూరుపై ఆందోళన

కొల్‌కతా : పశ్చిమబెంగాల్‌లో వైద్యులు మరోమారు ఆందోళన బాట పట్టారు. ఆర్‌జి కర్ ఆసుపత్రి హత్యాచారం కేసులో ఇద్దరు కీలక నిందితులకు బెయిల్ ఇవ్వడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ కొల్‌కతాలో వివిధ ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో జూనియర్ డాక్టర్లు, వైద్య సిబ్బంది పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. వీరి పోరాటానికి వామపక్షాలు, కాంగ్రెస్ మద్దతు ప్రకటించాయి. కేసు దర్యాప్తులో సిబిఐ మీనమేషాలు లెక్కిస్తోందని, బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. రవీంద్ర సదన్ నుంచి నిజాం ప్యాలెస్‌లోని సిబిఐ కార్యాలయం వరకూ ఈ ప్రదర్శన సాగింది. సిబిఐ అలసత్వం, అసమర్థత కారణంగానే నిందితులు బెయిల్ దక్కించుకోగలిగారని కాంగ్రెస్ విమర్శించింది. అనంతరం ర్యాలీలో పాల్గొన్నవారిని పోలీసులు నిజాం ప్యాలెస్ వద్ద అడ్డుకున్నారు. కరుణామోయి నుంచి సాల్ట్ లేక్‌లోని సిజిఒ కాంప్లెక్స్ వరకూ మరో ర్యాలీ నిర్వహిచంఆరు. కాలేజ్ స్ట్రీట్ ప్రాంతంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ (డబ్ల్యుబిజెడిఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో హత్యాచార బాధితురాలి తల్లి కూడా పాల్గొన్నారు. న్యాయం కోసమే తాము పోరాడుతున్నామని, న్యాయం పొందడం తమ హక్కు అని ఆమె నినదించారు. ఆర్‌జికర్ ఆసుపత్రికి చెందిన జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం కేసులో సదరు ఆసుపత్రి మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్, పోలీసు అధికారి అభిజిత్ మండల్‌కు శుక్రవారం సీల్దాహ కోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

అస్సాంలో దారుణం

- ఆలయ పరిసరాల్లో సామూహిక అత్యాచారం
- వీడియో చిత్రీకరించి వైరల్ చేయడంతో వెలుగులోకి
- 8 మంది అరెస్టు

గౌహతి : దేశంలో మహిళలపై ఆకృత్యాలు, హత్యలు కొనసాగుతూనేవున్నాయి. అస్సాంలో ఓ యువతిని ఆలయ పరిసరాల్లో సామూహిక అత్యాచారం చేసి, వీడియో చిత్రీకరించి దానిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన పైశాచిక ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానిక మీడియా కథనం ప్రకారం..గౌహతిలోని ఓ ఆలయ పరిసరాల్లో గత నవంబరు నెల 17న ఓ యువతిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఆ దశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన నిందితులు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. అవి వైరల్‌గా మారి పోలీసుల దష్టికి వెళ్లడంతో అత్యాచారానికి పాల్పడిన 8 మంది నిందితులను అరెస్టు చేశారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. అయితే, బాధితురాలు ఎవరు అనే విషయం తెలియాల్సి ఉంది. నిందితుల వయస్సు 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ ఘటన సమయంలో నిందితులు మద్యం మత్తులో ఉన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు. కాగా ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయొద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

గంటకు 30 మంది జలసమాధి

- 2021లో 3 లక్షల మంది మృతి
- 'నీట మునక' ప్రమాదాలపై
- ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక

జెనీవా : గత కొన్ని సంవత్సరాలుగా నీటి ప్రమాదాల వల్ల మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. నీట మునిగి మృతి చెందారనే వార్తలు తరచూ వింటూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో ఒక్క 2021 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా మూడు లక్షల మంది నీటిలో మునిగి చనిపోయినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ఈ నెల 13న ఒక నివేదిక తెలిపింది. ఈ గణాంకాలను పరిశీలిస్తే ..సుమారు ప్రతి గంటకు 30 మంది నీటి ప్రమాదాల వల్ల చనిపోయారని డబ్ల్యుహెచ్ఒ అంచనా వేసింది. ప్రత్యేకించి తక్కువ ఆదాయం, మధ్యస్థ ఆదాయం గల దేశాల్లో ఈ ప్రమాదాలు 92 శాతం సంభవించాయని పేర్కొంది. 2021లో ఆగ్నేయాసియా దేశాల్లో (భారత్‌తో సహా) 83 వేల మంది చనిపోయారు. మొత్తం మరణాలలో ఈ దేశాల వాటా 28 శాతంగా ఉందని తెలిపింది.

ఈ సందర్భంగా జెనీవాలో జరిగిన సమావేశంలో డబ్ల్యుహెచ్ఒ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయసస్ మాట్లాడుతూ.. నీటి ప్రమాదాలపై దేశాలు అవగాహన పెంచుకోవడానికి, నివారణ వ్యూహాలకు సంబంధించి మార్గనిర్దేశం చేయడానికి, నీటి ప్రమాదాల కేసుల్ని ట్రాక్ చేయడానికి ఈ నివేదిక ఉపయోగపడుతుందన్నారు. 2000 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా భారత్‌తో సహా 139 దేశాల్లో నీటి ప్రమాదాలతో చనిపోయేవారి శాతం 38 శాతం తగ్గింది. 2000 కంటే.. 2021లో అంటే గడచిన ఇరవై ఏళ్లలో ఈ మరణాల నివారింపులో పురోగతి ఉన్నప్పటికీ.. వివిధ దేశాల మధ్య అసమానత ఉంది. యూరోపియన్ దేశాల్లో ఈ ప్రమాదాల్లో మరణించే వారి శాతం 68 శాతం, ఆగ్నేయాసియా దేశాల్లో 48 శాతం తగ్గినట్టు నివేదిక తెలిపింది. ముఖ్యంగా చిన్నారులు, యువతే ఈ ప్రమాదాల్లో ఎక్కువగా చనిపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న చిన్నారుల మరణాల శాతం దాదాపు 24 శాతం ఉంది. ఇక 5-14 సంవత్సరాల మధ్య వయసులో గలవారు 19 శతం, టీనేజ్ అండ్ యూత్ 15-29 మధ్య వయసుగలవారు 14 శాతంగా ఉంది. భారత్‌లో 26 శాతం (30-44 మధ్య వయసు), 25 శాతం (18-29 వయసు), 17 శాతం (45-59 వయసు), 12 శాతం (0-13 వయసు), 10 శాతం (14-17), 10 శాతం (60 ఏళ్లకు పైబడినవారు)గా ఉంది.

'ఓపెన్ ఎఐ' ప్రజావేగు సుచిర్ అనుమానాస్పద మృతి



శాన్‌ఫ్రాన్సిస్కో : ప్రముఖ కృత్రిమ మేధ సంస్థ చాట్‌జిపిటి మాతసంస్థ అయిన 'ఓపెన్ ఎఐ' ప్రజావేగు ఇండో అమెరికన్ సుచిర్ బాలాజీ (26) అనుమానాస్పద స్థితిలో మరణించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని తన నివాసంలో ఆయన విగతజీవిగా కనిపించారు. ఈ ఘటన నవంబర్ 26న చోటు చేసుకోగా..ఆ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై తాజాగా అంతర్జాతీయ మీడియాలో విస్తృత కథనాలు వెలువడుతున్నాయి. అయితే ప్రాథమిక దర్యాప్తులో సుచిర్ ఆత్మహత్య చేసుకున్నట్లుగా తెలుస్తోందని పోలీసులు చెప్పారు. అయితే ఓపెన్ ఏఐ నిర్వహిస్తున్న ఆపరేషన్లు, అనుసరిస్తున్న విధానాలు ఆందోళనకరంగా ఉన్నట్లు గతంలో సుచిర్ పేర్కొన్నారు. ఈ ఏడాది ఆగస్టులో ఓపెన్ ఏఐకి రాజీనామా చేసిన తర్వాత ఆ కంపెనీ పలు కాపీరైట్ల ఉల్లంఘనలకు పాల్పడుతోందని కూడా ఆయన విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో సుచిర్ చనిపోవడం అనుమానాలకు తావిస్తోంది.

'ఉపాధి' కార్మికులకు వేతనాలు పెంచాలి

- పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదన

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్ఇజిఎ) కింద కార్మికులకు తక్కువ వేతనాలను ఇస్తున్నారని పార్లమెంటరీ కమిటీ ఎత్తిచూపింది. ప్రస్తుత ద్రవ్యోల్బణానికి తగినట్టుగా ఉపాధిహామీ వేతనాల రేట్లను కూడా పెంచాలని, అందుకు తగ్గట్టుగా గ్రామీణాభివృద్ధి శాఖ వేతనాల సూచికలో మార్పులు చేయాలని పార్లమెంటరీ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ సందర్భంగా 'పట్టణాల్లో కానీ, గ్రామాల్లో కానీ ద్రవ్యోల్బణం, జీవన వ్యయం పెరుగుతోంది. ఈ తరుణంలో చాలా రాష్ట్రాల్లో ఎంజిఎన్‌ఆర్‌జిఇజిఎ కింద రోజువారీ వేతనం రూ. 200 గానే ఉంది. ఈ చట్టం అమల్లో ఉన్న అదే రాష్ట్రంలో లేబర్ రేట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఉపాధి వేతనం మాత్రం పెరగలేదు' అని కాంగ్రెస్ ఎంపి సప్తగిరి శంకర్ ఉలక నేతృత్వంలోని గ్రామీణాభివృద్ధి ప్యానెల్ పేర్కొంది. ద్రవ్యోల్బణానికి తగినట్టుగా ఎంజిఎన్‌ఆర్‌జిఎ కూలీల వేతనాలు లేవు? వాటిని పెంచలేదు. ఈ పథకం కింద కూలీ పనికివచ్చే వివిధ వర్గాల వారు వేతనం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. వేతనాలకు సంబంధించి పున:సమీక్షించుకుని ఈ పథకం కూలీలకు వేతనాలను పెంచడానికి ఒక యంత్రాంగాన్ని రూపొందించాలని డిఓఆర్‌డి (గ్రామీణాభివృద్ధి శాఖ)ని పార్లమెంటరీ కమిటీ కోరింది. వివిధ రాష్ట్రాల్లో వేతనాల్లో అసమానతలు ఆందోళన కలిగిస్తున్నాయని ఈ కమిటీ పేర్కొంది. పురుషులతో సమానంగా స్త్రీలకు సమాన వేతనం ఇవ్వాలని, రాష్ట్రం దాన్ని అనుసరించాలని రాజ్యాంగంలోని ఆర్టిక్ 39లోని క్లాజ్ (డి) నిబంధన పేర్కొంటోంది. ఆర్టికల్ 39 నిబంధన ప్రకారం ఎజిఎన్ఇఆర్‌జిఎ పథకం కింద వివిధ రాష్ట్రాలకు వేర్వేరు వేతనాలు ఉండకూడదు. ఈ నిబంధన ప్రకారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఎంజిఎన్‌ఆర్ఇజిఎ పథక లబ్ధిదారులకు అసమానతలు లేని వేతనాలు చెల్లించాలని కమిటీ సిఫార్సు చేసింది. ఈ పథకం కింద ఆర్థిక నిర్వహణ, వేతనాలు, కూలీలకు అందించే మెటీరియల్స్‌లోనూ మరింత మెరుగ్గా ఉండాలని ఈ కమిటీ సిఫార్సు చేసింది. వంద రోజుల పనిదినాలను 150 రోజులకు పెంచాలని కమిటీ సూచించింది.

మన ప్రజాస్వామ్యం స్ఫూర్తిదాయకం

(మొదటి పేజీ తరువాయి)

(ఎమర్జన్సీ) విధించారు. యావద్దేశాన్ని ఒక జైలుగా మార్చారు. మీడియాను నోరెత్తనీయలేదు. కాంగ్రెస్ పార్టీపై పడిన ఈ మరక ఎప్పటి తొలగిపోదు' అని విమర్శించారు.

ప్రజలకు మేం అభయమిస్తే...మీరు వారి బొటనవేళ్లను నరుకుతున్నారు: రాహుల్ గాంధీ

ప్రజలకు మేం అభయమిస్తుంటే, మీరు వారి బొటనవేళ్లను నరుకుతున్నారని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ బిజెపిని విమర్శించారు. లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చలో రాహుల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకలవ్యుని బొటనవేలు తీసుకుని ద్రోణుడు అతడిని విలువిద్యకు దూరం చేసినట్లే.. ప్రభుత్వం ప్రజలను అభివృద్ధికి దూరం చేస్తోందని విమర్శించారు. 'సైన్యంలోకి అగ్నివీర్ వ్యవస్థను ప్రవేశపెట్టినప్పుడే మీరు దేశ యువత బొటన వేళ్లను నరికేశారు. ఏకంగా 70 పరీక్షల పేపర్ లీకేజీలు జరిగినప్పుడే మీరు దేశ యువత బొటన వేళ్లను తెగగొట్టారు.

అదానీకి ధారావి ప్రాజెక్టును అప్పగించినప్పుడు ఇక్కడి చిన్న, మధ్య తరహా వ్యాపారుల బొటనవేళ్లను కోసేశారు. దేశంలోని నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, రక్షణ పరిశ్రమను అదానీకి అప్పగించినప్పుడు దేశంలో నిజాయితీగా పనిచేసే వ్యాపారుల వేళ్ల కత్తిరించారు. ఇప్పుడు కూడా మీరు ఢిల్లీ సరిహద్దుల్లో దేశ రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్నారు. లాఠీచార్జి చేస్తున్నారు. ఇంతకంటే దారుణం ఏముంటుంది రైతులు మిమ్మల్ని కనీస మద్దతు ధర కల్పించమని కోరుతున్నారు. తమ పంటకు తగ్గ ధర కావాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ మీరు మాత్రం అదానీ, అంబానీలకు లాభాలు కట్టబెట్టి రైతుల బొటన వేళ్లను నరికేశారు' అని తీవ్రంగా విమర్శించారు.

రాజ్యాంగానికి, మనుస్మృతికి మధ్య పోరాటం జరుగుతోందన్నారు. మనుస్మృతి సిద్ధాంతాలను అనుసరించి రాజ్యాంగం ఉండాలని సావర్కర్ విశ్వసించారని, రాజ్యాంగం మనుస్మృతికి అతీతంగా ఉందని తన రచనల్లో చాలా స్పష్టంగా సావర్కర్ పేర్కొన్నారని రాహుల్ అన్నారు. 'రాజ్యాంగం తెరిచినప్పుడు అంబేద్కర్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ ఆలోచనలు, వారి మాటలు అందులో కనిపిస్తాయని అన్నారు. మన రాజ్యాంగం ఆలోచనల సమాహారమని, జీవిత తత్వశాస్త్రం, మన సంస్కృతికి సంబంధించిన ఆలోచనలు రాజ్యాంగంలో ప్రతిబింబిస్తాయని చెప్పారు. రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పిస్తోందని, కానీ బిజెపి మాత్రం దానిపై దాడి చేస్తూనే ఉందని ఆరోపించారు. కలిసికట్టుగా రాజ్యాంగ పరిరక్షణ ఆలోచనతోనే 'ఇండియా' బ్లాక్ ఏర్పాటైందని అన్నారు. ప్రస్తుతం రాజకీయ సమానత్వం లేదని, దేశంలోని సంస్థలన్నింటినీ గుప్పిట్లో పెట్టుకున్నారని, సామాజిక సమానత్వం లేదని, ఆర్థిక సమానత్వం అంతకంటే లేదని రాహుల్ విమర్శించారు. ఆ కారణంగానే కులగణనతో తాము ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

కార్పొరేట్, మతతత్వ పాలనకు వ్యతిరేకంగా

ఐక్య పోరాటాలు

- సిపిఎం పంజాబ్ రాష్ట్ర మహాసభలో నేతల పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్వాతంత్ర్య సంగ్రామం, ఖలిస్తానీ వేర్పాటువాదులపై పోరాటం మొదలు ఢిల్లీలో సంవత్సరం పాటు కొనసాగిన చారిత్రాత్మక రైతు ఉద్యమం వరకు పంజాబీలు అద్వితీయమైన, త్యాగాలతో కూడిన పోరు సల్పారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, నీలోత్పల్ బసు కొనియాడారు. సిపిఎం పంజాబ్ రాష్ట్ర 24వ మహాసభ శనివారం జలంధర్‌లోని దేశ్ భగత్ యాద్గార్ హాలులో నిర్వహించారు. ఈ మహాసభ ప్రారంభోపన్యాసంలో ధావలే మాట్లాడుతూ సామ్రాజ్యవాదం, జియోనిజానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని, అలాగే కార్పొరేట్ అనుకూల, మతతత్వ ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. విశాల ప్రజా పోరాటాలు నిర్మించాలని, సిపిఎం, ఇతర వామపక్షాలు తమ స్వతంత్ర బలాన్ని పెంచుకోవాలన్నారు. అనంతరం నీలోత్పల్ బసు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ నేతృత్వ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న వినాశకర విధానాల ఫలితంగా రైతులు, కార్మికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సవాళ్లతో కూడిన ఈ సమయంలో శ్రమజీవల ఏకైక ఆశ ఎర్ర జెండాయేనని తెలిపారు.

ఏచూరికి, బుద్ధదేవ్‌కు ఘన నివాళి

తొలుత మహాసభ ప్రారంభసూచికగా సీనియర్ నాయకులు సీతాల్ సింగ్ సంఘా ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరజీవులు సీతారాం ఏచూరి, బుద్ధదేవ్ భట్టాచార్య, తదితర నాయకులకు మహాసభ ఘనంగా ఉద్యమ నివాళులర్పించింది.

పంజాబ్‌తో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన ఛండీగఢ్ నుంచి 239 మంది ప్రతినిధులు, పరిశీలకులు హాజరయ్యారు. ఆహ్వానం కమిటీ ఛైర్మన్, న్యాయవాది గురిక్బాల్ సింగ్ ధిల్లాన్ స్వాగతోపన్యాసం చేశారు. రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు సుఖ్వీందర్ సింగ్ సెఖోన్ రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. చర్చలో 34 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. కొన్ని చేర్పుల తరువాత నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణమాఫీ, ఎంఎస్‌పికి చట్టబద్ధమైన హామీ, ఉపాధి ఆధారిత విద్య, విద్యార్థి సంఘాల ఎన్నికల పునరుద్ధరణ, ప్రజాస్వామ్య మానవ హక్కుల పరిరక్షణ, మహిళలపై నేరాలు, మాదక ద్రవ్యాల మహమ్మారి తదితర సమస్యలపై సదస్సు తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

రాష్ట్ర కార్యదర్శిగా సుఖ్వీందర్ సింగ్

మహాసభ 36 మందితో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రాష్ట్ర కార్యదర్శిగా సుఖ్వీందర్ సింగ్ సెఖోన్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నలుగురు సభ్యుల రాష్ట్ర కంట్రోల్ కమిషన్‌ను కూడా ఎన్నుకుంది. కాగా లెహెంబర్ సింగ్ తగ్గర్ రచించిన 'పంజాబ్ కమ్యూనిస్టు ఉద్యమ సమగ్ర చరిత్ర' పుస్తకాన్ని మహాసభలో ఆవిష్కరించారు.

మోడీని తొలగించండి

- మణిపూర్‌లో ప్రభుత్వ ప్రేరేపిత హింసను ఆపేయండి
- ఢిల్లీలో కుకీ బిజెపి ఎమ్మెల్యేల నిరసన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం

న్యూఢిల్లీ : మణిపూర్‌లో రావణకాష్టంలా రగులుతున్న హింసను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాన్ని ఎండగడుతూ ఆ రాష్ట్రానికి చెందిన శాసనసభ్యులు రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే నిరసన చేపట్టింది ప్రతిపక్ష సభ్యులో, హక్కుల కార్యకర్తలో కాదు...సాక్షాత్తూ పాలక బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలే. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో మైనారిటీ కుకీ జాతికి చెందిన ఏడుగురు బిజెపి శాసనసభ్యులు పాల్గొన్నారు. వీరందరూ నల్ల మాస్కులు ధరించి నిరసన తెలిపారు. తమ డిమాండ్లు కేంద్రానికి తప్ప అందరికీ తెలిసినవేనని, అవి చాలా స్పష్టంగా ఉన్నాయని ఓ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. గత 19 నెలలుగా కేంద్ర ప్రభుత్వం తమను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మోడీని తొలగించండి', 'గిరిజనులు, మైనారిటీల గోడు పట్టదా', 'మణిపూర్‌లో ప్రభుత్వ ప్రేరేపిత కార్యక్రమాన్ని ఆపేయండి' అని రాసివున్న బ్యానర్లను వారు ప్రదర్శించారు. ప్రధాని మోడీని కలుసుకునేందుకు గతంలో అనేక ప్రయత్నాలు చేశామని, అయితే తమ అభ్యర్థనను ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానితో సమావేశమయ్యేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌కు మాత్రమే అనుమతి లభించిందని, అది కూడా కేవలం పదిహేను నిమిషాల పాటు మాత్రమే జరిగిందని వారు తెలిపారు.

శంభు సరిహద్దులో రైతులపై కర్కశం

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స కూడా అందించడం లేదని, వారికి సరైన చికిత్స అందేలా చూడాలని రైతు నాయకుడు సర్వాన్ సింగ్ పంజాబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా తమ భవిష్యత్ కార్యాచరణను కూడా సింగ్ వెల్లడించారు. ఈ నెల 16న పంజాబ్ వెలుపల ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తామని, ఈ నెల 18న రైల్ రోకోకు పిలుపునిచ్చామని తెలిపారు. ఈ రైల్ రోకోలో పంజాబీ రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని సర్వాన్ సింగ్ కోరారు. ప్రతిపక్షాలు తమపాత్రను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రైతులకు మద్దతుగా కేవలం ప్రకటనలతో సరిపెట్టుకోవద్దని హితవు పలికారు. ఇతర అంశాలపై పార్లమెంట్‌ను స్తంభింపజేసినట్టే రైతు సమస్యలపై కూడా పార్లమెంట్‌ను స్తంభింపజేయాలని డిమాండ్ చేశారు.

ఐక్యంగా ముందుకు వెళతాం : రాకేష్ టికాయిత్

సమస్యల పరిష్కారం కోసం అన్ని రైతు సంఘాలు ఐక్యంగా ముందుకు వెళతాయని ఎస్‌కెఎం నేత రాకేష్ టికాయిత్ తెలిపారు. రైతు సంఘాలను విచ్ఛిన్నం చేయడం కేంద్ర ప్రభుత్వ విధానమని, అన్ని సంఘాలు కలిసి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎంఎస్‌పి చట్టం కోసం పోరాటానికి అన్ని సంఘాలు ఏకం కావాలని పిలుపు ఇచ్చారు. ఎంఎస్‌పి చట్టం డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేసిన రైతు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యం క్షీణించడంతో ఆయనను టికాయిత్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ "దల్లేవాల్ తన ఆమరణ నిరాహార దీక్షను వెనక్కి తీసుకుంటాడని నేను అనుకోను. ఎంఎస్‌పి చట్టం డిమాండ్‌ను మోడీ ప్రభుత్వం అంగీకరించే వరకు ఆందోళ కొనసాగుతుంది. ఆయన ఆరోగ్యం పట్ల మేమంతా ఆందోళన చెందుతున్నాం. రైతులు ఒకే వేదికపైకి రావాల్సిన సమయం ఆసన్నమైంది. అప్పుడే ప్రభుత్వంతో భారీ పోరాటానికి నాయకత్వం వహించగలం" అని ఆయన అన్నారు. 'ఖతాలు' (హత్యలు)పై ఏర్పడిన ప్రభుత్వాన్ని త్యాగాలతో కదిలించలేమని అన్నారు. "సిక్కు సమాజం త్యాగాల నిండి ఉంది. వారు న్యాయమైన కారణాల కోసం తమ ప్రాణాలను అర్పించడానికి భయపడరు" అని అన్నారు, నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కనీసం రైతులతో చర్చలు ప్రారంభించాలని కోరారు. క్రాంతికారి కిసాన్ యూనియన్ నేత దర్శన్ పాల్, బజరంగ్ పూనియా దల్లేవాల్‌కు, శంభు మోర్చాకు మద్దతుగా నిలిచారు. ఈ మేరకు దర్శన్ పాల్ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. రెజ్లర్, ఒలింపియన్ బజరంగ్ పునియా కూడా ఢిల్లీ చలో మోర్చాకు మద్దతు ప్రకటించారు. ఎంఎస్‌పి చట్టం కోసం రైతులు చేస్తున్న నిరసనకు అన్ని విధాలుగా మద్దతు ఇవ్వాలని పునియా ప్రజలకు ఉద్వేగభరితమైన విజ్ఞప్తి చేశారు. దల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్షను నవంబర్ 26న ప్రారంభించారు. శనివారానికి 19వ రోజుకు చేరుకుంది.

మీకోసం
అప్పడాలు వేయించే ముందు కొద్దిసేపు ఎండలో పెడితే నూనె ఎక్కువగా పీల్చకుండా ఉంటాయి.

జీవన సౌరభం
పైవారితో గౌరవంగా సాటివారితో స్నేహంగా మెలగడం కాదు, తనకన్నా తక్కువవారితో మెలిగే తీరే వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది.

అమ్మా, నాన్న.. ఓ అబ్బాయి..

ఏడేళ్లప్పుడే ఆ అబ్బాయి ఓ కల కన్నాడు. చెస్ క్రీడలో ప్రపంచ ఛాంపియన్ కావాలని లక్ష్యం పెట్టుకున్నాడు. అది చాలా ఖర్చుతో కూడుకున్నదని ఆ రోజు తనకి తెలియదు. అయినా కొడుకు కోరిక నెరవేర్చాలని తండ్రి పూనుకున్నాడు. డాక్టరు ప్రాక్టీసుని పక్కనబెట్టి మరీ కొడుకుతో కలసి ప్రయాణించాడు. తండ్రీ, కొడుకులిద్దరూ లక్ష్యప్రయాణంలో నిమగ్నమైపోతే, మైక్రోబయోలజిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్న తల్లి, ఒంటిచేత్తో కుటుంబాన్ని నడిపింది. చుట్టూ ఆర్థికంగా ఎన్నో సమస్యలు. పోటీల్లో పాల్గొనేందుకు స్నేహితుల సాయం అర్థించాల్సిన పరిస్థితి. ఇన్ని సమస్యల మధ్యే, ఆ కొడుకు తన కల నెరవేర్చుకున్నాడు. డిసెంబరు 12 గురువారం ప్రపంచ చెస్ ఛాంపియన్ పోటీల్లో విజేతగా నిలిచిన గుకేష్ గురించే ఇప్పుడు మనం చెప్పకుంటోంది. ఆ క్షణం ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. ఆట గెలిచి వచ్చిన కొడుకుని అమాంతం హత్తుకున్న తండ్రి కళ్లవెంట నీళ్లు జలపాతాల్లా కారుతూనే ఉన్నాయి.. తన కోసం తండ్రి చేసిన త్యాగాలు గుర్తుకువచ్చి కొడుకూ అదే రీతిగా ఉన్నాడు. ఈ దృశ్యాన్ని ఎక్కడో దూరాన బాధ్యతలతో ఇంట్లోనే ఉండి పోయిన తల్లి చూస్తూ అంతకంటే ఎక్కువ ఆనందభాష్పాలు రాల్చింది.

2006లో చెన్నయ్‌లో డాక్టర్ రజనీకాంత్, డాక్టర్ పద్మకుమారి దంపతులకు గుకేష్ జన్మించాడు. వృత్తిరీత్యా వైద్యులైనా తల్లిదండ్రులిద్దరికీ ఆటలంటే మక్కువ ఎక్కువ. ఆ ఇష్టంతోనే కొడుకుని ఆ దారిలో నడిపించాలనుకున్నారు. ఆ విషయాన్నే గుకేష్ ఇలా చెబుతున్నాడు. 'అమ్మానాన్న ఇద్దరికీ ఆటలంటే చాలా ఇష్టం. కానీ వారు ఆ రంగంలో రాణించలేకపోయారు. అందుకే నా లక్ష్యాన్ని సాధించేందుకు శక్తివంచనలేకుండా కష్టపడ్డారు. మేము డబ్బున్నవాళ్లం కాదు. నా చెస్ ప్రయాణం చాలా కష్టాలు, కన్నీళ్లు, త్యాగాలతో నిండిపోయింది' అని పోటీకి వెళ్లేముందు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో గుకేష్ చెప్పాడు. చెస్‌పై తనకి ఎప్పటినుండి ఇష్టం ఏర్పడిందో కూడా తన మాటల్లోనే తెలుసుకుందాం.

పదేళ్ల ముందే ఈ కల కన్నా..

2013లో ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ చెన్నయ్‌లో నిర్వహించారు. అప్పుడు విశ్వనాథన్ ఆనంద్, మాగ్నస్ కార్ల్‌సన్‌ల మధ్య పోటీ జరిగింది. అందులో విశ్వనాథన్ ఓటమిపాలయ్యారు. ఆ మ్యాచ్ చూసేందుకు నేను అక్కడికి వెళ్లాను. కూర్చొని చూసేందుకు నాకు సీటు దొరకలేదు. నుంచొనే గ్లాస్ డోర్ లోంచి ఆ మ్యాచ్ చూశాను. ఏదో ఒక రోజు నేను కూడా ఆ అద్దాల లోపల ఉంటే బాగుణ్ణు అనుకున్నాను. ఆ తరువాత ఆ మ్యాచ్ మాగ్నస్ గెలిచినప్పుడు ఎప్పటికైనా భారత్ టైటిల్‌ని నా పేర తీసుకురావాలని కంకణం కట్టుకున్నాను' అని చెబుతున్నాడు. చిన్న వయసులో అతడు ఏర్పర్చుకున్న దృఢసంకల్పం, దాన్ని నెరవేర్చేందుకు తల్లిదండ్రుల కృషి, ప్రోత్సాహమే గుకేష్ విజయానికి బాటలువేశాయి.

అమ్మను చూసే నేర్చుకున్నాను..
గుకేష్

ఆటతీరు గమనిస్తే, ప్రత్యర్థి ఎంతలా ఒత్తిడి తెస్తున్నా, ఎంతో ప్రశాంతతతో ఆడినట్లు అనిపిస్తుంది. ఒత్తిడిని అధిగమిస్తూ తనకు తానే శక్తిని కూడదీసుకోవడం అతనికి చిన్నప్పటి నుండే అబ్బింది. ఈ విషయంపైనే గతంలో ఒకసారి గుకేష్ ఇలా చెప్పాడు. 'కోవిడ్ టైంలో అమ్మ వృత్తిరీత్యా హాస్పటల్‌లో 24 గంటలూ పనిచేయాల్సి వచ్చింది. సెలవు తీసుకోమని నేను చాలాసార్లు చెప్పాను. కానీ ఒప్పుకునేది కాదు. తన చుట్టూ చాలా ఒత్తిడి ఉందని నాకు అర్థమయ్యేది. కానీ ఎప్పుడూ ఆమె దాన్ని వ్యక్తపరచలేదు. ప్రశాంతంగా ఉండడం అమ్మ నుండే నేర్చుకున్నాను. అమ్మని చూసి నేను చాలా పాఠాలు నేర్చుకున్నాను. కఠిన పరిస్థితులను ఎలా నెట్టుకురావాలో తెలుసుకున్నాను' అని అమ్మపై తన ప్రేమను వ్యక్తపరిచాడు గుకేష్.

నాన్న ఉద్యోగం వదిలేశాడు..

చెస్‌లో గుకేష్ రాణిస్తున్న కొద్దీ అతనితో ఉండాలని, తండ్రి నిర్ణయించుకున్నాడు. అందుకోసం ఇఎన్‌టి వైద్యుడిగా రాణిస్తున్న రంగాన్ని తృణప్రాయంగా వదిలేశాడు. కొడుకుతో కలసి ప్రయాణాలు చేశాడు. ఈ సమయంలోనే పద్మకుమారి కుటుంబ బాధ్యతలు తీసుకున్నారు. ఉమ్మడి కుటుంబాన్ని ఒంటిచేత్తో నడిపిస్తున్నారు.

'నా తల్లిదండ్రులిద్దరూ ఎన్నో త్యాగాలు చేశారు. వాళ్లు లేకపోతే నేను కాదు, నా విజయాలే లేవు.

కెరీర్‌లో నేను సాధించిన ప్రతి లక్ష్యం అమ్మానాన్న వల్లే సాధ్యమైంది' అంటూ తల్లిదండ్రుల పట్ల తన ప్రేమను చెబుతున్నాడు గుకేష్.

నమ్మలేకపోయాను..

గురువారం పోటీ ప్రారంభమైన రోజు ప్రపంచ చెస్ అభిమానులందరూ ఎంతో ఉత్కంఠను అనుభవించారు. గుకేష్ తల్లి పద్మకుమారి అయితే అంతకుమించిన ఉత్కంఠతో ఉన్నారు. తన ఫోన్, కంప్యూటర్ రెంటినీ స్విచ్ఛాఫ్ చేసి ఉంచారు. సింగపూర్‌లో టైటిల్ మ్యాచ్ ఆడుతున్న కొడుకు ఆటని ప్రతి క్షణం ఆస్వాదించాలని మనసు ఎంతలా ఆరాటపడుతున్నా, ఆ తల్లి ధైర్యం చేయలేదు. ప్రత్యర్థి డింగ్ లిరేన్ ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ, 58వ ఎత్తుతో అతన్ని చిత్తుగా ఓడించిన గుకేష్ ప్రపంచ విజేతగా గెలిచిన వార్త ఆమె చెవిన పడిన క్షణం.. 'నేను నమ్మలేకపోయాను. పది నిమిషాల వరకు ఏడుస్తూనే ఉన్నాను' అని కొడుకుని కలిసేందుకు విమానం ఎక్కేందుకు వెళ్తున్న పద్మకుమారి చెప్పారు.

ట్రోఫీ అందుకున్న వేళ..

వరల్డ్ ఛాంపియన్‌గా నెగ్గిన గుకేష్‌కి అవార్డు ప్రదానోత్సవం తరువాత నిర్వాహకులు ఓ అభినందన సభ ఏర్పాటుచేశారు. అప్పుడు జరిగిన ఓ సంఘటన, విజయం పట్ల గుకేష్, అతని తల్లిదండ్రులు ఎంతలా తపించారో అర్థమవుతుంది. ముందు వరుసలో కూర్చొన్న గుకేష్, బహుమతి ట్రోఫీని వెనుక వరుసలో కూర్చొన్న తండ్రికి అందించాడు. అతను, ఆ వెనక కూర్చొన్న భార్య పద్మకుమారికి అందజేశాడు. దాన్ని ఆమె ఎంతో ఆప్యాయంగా అందుకుంది. ట్రోఫీ శిరస్సును ఎంతో తన్మయత్వంతో చెమ్మగిల్లిన కళ్లతో ముద్దాడింది. ఆ దృశ్యం చూస్తున్న చుట్టూ ఉన్న ప్రేక్షకులు ఆ తల్లి వంక కన్నార్పకుండా అలా చూస్తూనే ఉన్నారు. గుకేష్ కెరీర్‌ని తీర్చిదిద్దేందుకు కుటుంబం చేసిన త్యాగాలన్నింటినీ ప్రతిబింబించే క్షణం అక్కడ కనిపించింది.

అతిథి మర్యాద

సుందరమను అడవి ఒకటి
అందులోన ఎలుగుబంటి
అది దారిని వెళుతుండగ
పెద్దపులియు చూచె నొకటి

ఎలుగు బంటి పరిగెత్తెను
ఒక చెట్టు పైన ఎక్కెను
దాని పైన కోతి ఉండె
అది ఎలుగు తోడ పలికెను

ఎలుగు మామ! భయపడకుము
నీకు లేదు ప్రాణ భయము
అనుచు ఆహారము పెట్టె
దాన్ని తిన్న భల్లూకము

నీవెంత మంచి దానివి
ఆశ్రయము నా కొసగితివి
ఆకలితో ఉన్న నాకు
ఆహారమును పెట్టితివి

ఇట్లు ఎలుగు పలికినంత
కోతి సంతసించె నంత
ఎలుగు గని కోతి పిల్లలు
చేరిరేమొ దాని చెంత

పిల్లలేమొ వెక్కిరించె
తల్లి వాటి నెచ్చరించె
అయినా ఆ పిల్లలంత
ఎలుగును ఆట పట్టించె

ఎలుగు ఎంతో బాధ పడెను
వాటి నేమి అనకుండెను
కోతి పిల్లల అల్లరియు
దాని పట్ల శ్రుతి మించెను

ఒక్క పిల్ల క్రింద పడెను
అది మిక్కిలి గాయ పడెను
ఎలుగు చెట్టును దిగి వెళ్లి
చెట్ల ఆకులను తెచ్చెను

ఆ ఆకుల పసరు తీసి
కోతి గాయముపై పూసి
దాని బాధ పోగొట్టెను
తల్లి కోతి ఎలుగు చూసి

నీ సాయము మరవనమ్మ
ఎంత మంచి దానవమ్మ
అపకారుల కుపకారము
చేయు జంతునీవెనమ్మ

ఆ పిల్ల మన్నించమనె
పిల్లలును అల్లరి మానె
తల్లి కోతి సంతసించె
దాన్ని సాగ నంపె తానె

పిల్ల లారా! అతిథులను
మీరు గౌరవించవలెను
ఆదరించిన పదిమంది
మెచ్చుకొందురు జగమునను

- సంగనభట్ల
చిన్న రామకిష్టయ్య,
99085 54535

కనుక్కోండి చూద్దాం

పిల్లలూ, అమ్మ వంటింట్లో చాలా పదార్థాలతో వంట చేస్తుంది కదా! వాటిల్లో కొన్నింటి పేర్లు ఇక్కడ ఇచ్చాం. అయితే వాటిల్లో కొన్ని అక్షరాలు లేవు. అవి రాసి, వాటి పేర్లేంటో కనుక్కోండి చూద్దాం.

కం-పప్పు	ల-గా-
ఆ-లు	పె-రప-
పం-దా-	గో-మర-
జీ-క-	ఉ-
ధ-యా-	కా-

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి.
ఇదిగో మెయిల్ ఐడీ:
chinnaarips@gmail.com

నేను గీసిన బొమ్మ

జె.యశస్విని, 6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
పోతారెడ్డిపేట, జిల్లా సిద్దిపేట.

తొలిరోజు 13.2 ఓవర్లే..!

- బ్రిస్బేన్ టెస్ట్‌కు వర్షం అడ్డంకి
- ఆస్ట్రేలియా 28/0

బ్రిస్బేన్: బోర్డర్-గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లో భాగంగా బ్రిస్బేన్ వేదికగా మూడో టెస్ట్ ప్రారంభమైంది. తొలిరోజు వర్షం కారణంగా కేవలం 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. మ్యాచ్ ప్రారంభమైన 5.3 ఓవర్లకు తొలుత వర్షం కురిసింది. దాంతో అరగంటపాటు మ్యాచ్ నిలిచి పోయింది. ఆ తర్వాత 13.2 ఓవర్ల వద్ద మరోసారి వర్షం రావడంతో ఆటను పూర్తి నిలిపివేశారు. ఆ తర్వాత మ్యాచ్ తిరిగి సాధ్యపడలేదు. తొలుత టాస్ గెలిచిన కెప్టెన్ రోహిత్ శర్మ బౌలింగ్ ఎంచుకున్నాడు. పేస్‌కు సహకరించే గబ్బా మైదానంలో భారత బౌలర్లు 13.2 ఓవర్లు వేసినా ఒక్క వికెట్ పడగొట్టలేకపోయారు. బుమ్రా, సిరాజ్ విసిరిన బంతులు ఏమాత్రం స్వింగ్ కాకపోవడంతో బౌలర్లు కాస్త నిరాశకు గురయ్యారు. తొలిరోజు ఆటముగిసే సమయానికి ఆస్ట్రేలియా జట్టు వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖవాజా(19), నాథన్ మెక్‌స్వీనీ(4) క్రీజ్‌లో ఉన్నారు. తొలి రోజు వర్షం అంతరాయం కలగడంతో రెండోరోజు ఆదివారం 98ఓవర్లు వేయనున్నారు. మ్యాచ్ నిర్ణీత సమయానికంటే అరగంటే ముందే మొదలుకానున్నది. ఈ మ్యాచ్‌లో టీమిండియా రెండు మార్పులు చేసింది. రవిచంద్రన్ అశ్విన్, హర్షిత్ రాణాను పక్కనపెట్టి.. రవీంద్ర జడేజా, ఆకాశ్ దీప్‌కు తుదిజట్టుల్లో ఛాన్స్ ఇచ్చింది. ఇక ఆస్ట్రేలియా జట్టు స్కాట్ బోలాండ్ స్థానంలో జోష్ హేజిల్‌వుడ్‌ని తీసుకుంది.

భారీ వర్షంతో చిత్తడిగా మారిన బ్రిస్బేన్ మైదానం

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఉస్మాన్ ఖవాజా (నాటౌట్) 19, మెక్‌స్వీనీ (నాటౌట్) 4, అదనం 5. (13.2ఓవర్లలో) 28పరుగులు. **బౌలింగ్:** బుమ్రా 6-3-8-0, సిరాజ్ 4-2-13-0, ఆకాశ్‌దీప్ 3.2-2-2-0.

రా.ఇ.సూ.ప్రౌ.సం NIELIT
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (NIELIT)
ప్రజలకు సాధికారత కల్పించడం, దేశానికి సేవ చేయడం
Ministry of Electronics and Information Technology, Government of India
సత్యమేవ జయతే

ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ యొక్క అటానమస్ సైంటిఫిక్ సొసైటీ, భారత ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం.

NIELIT: డిజిటల్ విభజనను తగ్గించడం

NIELIT అనునది IECT ప్రాంతంలో శిక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధి మరియు సామర్థ్యాన్ని పెంపొందించే కార్యకలాపాలలో నిమగ్నమై ఉంది &పరీక్ష మరియు ధృవీకరణ కోసం ప్రమాణాలను స్థాపించడానికి ప్రయత్నిస్తుంది. ఇది 52 స్వంత కేంద్రాల నెట్‌వర్క్ ద్వారా పాన్-ఇండియా స్థాయిలో అనగా ఐజ్వా, అజ్మీర్, ఔరంగాబాద్, భువనేశ్వర్, బికనీర్, బక్సోర్, కాలికట్, చండీగఢ్, చుచుయిమ్లాంగ్, చురాచంద్‌పూర్, చెన్నై, దామన్, ఢిల్లీ, దిబ్రూఘర్, దిమాపూర్, ఈస్ట్ ఢిల్లీ, గ్యాంగ్‌టక్ గోరఖ్‌పూర్, గౌహతి, హరిద్వార్, హైదరాబాద్, ఇంఫాల్, ఇటానగర్, జమ్మూ, కార్గిల్, కోహిమా, కోక్రాఝర్, కోల్‌కతా, కురుక్షేత్ర, లేహ్, లక్నో, లుంగ్లీ, మజులి, మండి, ముజఫర్‌పూర్, నోయిడా, పాలి, పాసిఘాట్ పాట్నా, రాంచీ రోపర్, సేనాపతి, షిల్లాంగ్ ఢిల్లీ, శ్రీనగర్, తేజ్‌పూర్, తేజు, తురా న్యూ ఢిల్లీలో దాని ప్రధాన కార్యాలయం. సొంత కేంద్రాలు, NIELIT కూడా 700+ గుర్తింపు పొందిన సంస్థలు మరియు 9000+ద్వారా బాగా నెట్‌వర్క్ చేయబడింది. శిక్షణ & నైపుణ్యం కోసం సులభతర కేంద్రాలు, గత 11 సంవత్సరాలలో, NIELIT సగటున 7 నుండి 8 సిమ్లా, సిల్చార్, సౌత్ వెస్ట్ జోర్హాట్‌తో అభ్యర్థులు కంటే ఎక్కువ శిక్షణ పొందింది/సర్టిఫై చేసింది, ప్రతి ఒక్కరికి 86 లక్షల లక్షల శిక్షణ గణాంకాలతో పాటు సంవత్సరం. NIELIT రాబోయే 5 సంవత్సరాలలో కోటి మంది నైపుణ్యం కలిగిన మానవశక్తిని సృష్టించాలని భావిస్తోంది.

దిగువ ప్రోగ్రామ్‌లకు అక్రిడిటేషన్ అందించబడింది
దీర్ఘకాలిక కోర్సులు NSQF ALIGNED
- NIELIT 'O' లెవెల్ (IT) - లెవెల్ 4
- NIELIT 'A' లెవెల్ (IT) - లెవెల్ 5
- NIELIT 'B' లెవెల్ (IT) - లెవెల్ 6
- NIELIT 'C' లెవెల్ (IT) - లెవెల్ 8
- డిప్లొమా ఇన్ కంప్యూటర్ హార్డ్‌వేర్ మెయింటెనెన్స్ టెక్నీషియన్ (CHM-T 'O' లెవెల్) కోర్సు - లెవెల్ 4

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి http://onlineaccr.nielit.gov.in

APPROVED
NCVET ఆమోదించబడింది
అవార్డింగ్ బాడీ & అసెస్‌మెంట్ ఏజెన్సీ

అక్రిడిటేషన్ భాగస్వాముల కోసం పథకాలు/ప్రాజెక్ట్‌లు
- DGE: IT O లెవెల్ మరియు CHM-O లెవెల్ కోసం ఎస్సీ/ఎస్టీ ఉద్యోగార్థులు
- ఐ.టి ఫర్ మాసెస్
- మెయిటీ పథకం, భారత ప్రభుత్వం యొక్క SCSP/TSP
- ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సోషల్ మొబైల్‌పై ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ ప్రాజెక్ట్.
- ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (PMKVY)
- పని ఆధారిత అభ్యాసం (WBL)

ప్రమోషన్ అవార్డు పథకం
ఎస్సీ/ఎస్టీ/శారీరక వికలాంగులు మరియు స్త్రీలకు విద్యార్థులు గుర్తింపు పొందిన సంస్థల నుండి శిక్షణ పొందారు
వివరాలకు : www.nielit.gov.in/content/scholarship

గుర్తింపు పొందిన సంస్థ జాబితా (ఢిల్లీ మరియు ఉత్తరప్రదేశ్ మినహా)

NIELIT సెంటర్ గౌహతి (JACCR-01543) ఫోన్-9435526410, నీలిట్ షిమ్లా (ACCR-00776) ఫోన్-177-2804216, నీలిట్ శ్రీనగర్ (ACCR-01283) ఫోన్-1950-249030, తేజ్‌పూర్ సెంటర్, నీలిట్ గువాహటి (ACCR-01084) పిన్-784001 ఫోన్-3712-233461, 233473. ఎలక్ట్రానిక్స్‌సర్వీసెస్& ట్రైనింగ్ సెంటర్ (ACCR-00716) ఫోన్-22451504515 ESS DEE ఎడ్యుకేషన్ (EDES) సొసైటీ (ACCR-00967) ఫోన్-9419200507. EXEL మైక్రో సిస్టమ్స్ (ACCR-01483) ఫోన్-9437052414, ఫ్యాక్ట్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ (యూనిట్ ఆఫ్ ఫ్యాక్ట్ ఎడ్యుకేషన్ సొసైటీ) (ACCR-01762) పిన్-176202 ఫోన్: 7618425641842, హిలాల్ ఇన్‌స్టిట్యూట్ (ACCR-00944) పిన్-192101 ఫోన్-9622545555. ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ACCR-01185) పిన్-788026 ఫోన్9435176265, ఇన్ఫోనెట్ కంప్యూటర్లు (ACCR-02020) పిన్-190011, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఏసీసీఆర్-01155) పిన్-248001 ఫోన్-9411106542. పెంటాసిస్ కంప్యూటర్స్ (ACCR-01295) పిన్-753001, ఫోన్: 9238649324, ప్రొఫెషనల్ అకాడమీ ఆఫ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ (ACCR-00834) పిన్-756001, ఫోన్-9437267606, రాజస్థాన్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ (ACCR-01346) పిన్-305001 ఫోన్- 9828785637, REINZ ఇన్ఫర్మాటిక్స్ (ACCR-00942) పిన్-766001 ఫోన్-9437224260, 585 ఇన్ఫోసిస్టమ్స్ (ACCR-01412) ఫోన్-9858555040, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్-00096010 మేనేజ్‌మెంట్ (ACCR-01734) పిన్-342010 ఫోన్-9414134616. ఎస్ఎంటి కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ (ACCR-01191) పిన్-249401, ఫోన్-9719174443.సూపర్‌టెక్ (ఇండియా) కంప్యూటర్ ఎడ్యుకేషన్ (ACCR-01309) పిన్-180001 ఫోన్-9419191592. కరీంగంజ్ కాలేజ్ కంప్యూటర్ సెంటర్ (ACCR-02066) పిన్-788710. మాస్టర్‌మైండ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (ACCR-02070) పిన్-192124, ఫోన్-979797849,. టెండ్రిల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఐ.టి ACCR-02073) ఫోన్-990670 3045. నీలిట్ సెంటర్, అజ్మీర్ (ACCR-02074) ఫోన్-9096985835, నీలిట్ సెంటర్, అజ్మీర్ (ACCR-2075) ఫోన్-9096985835.
[illegible]
ఫోన్-805493544444 స్మార్ట్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ సొసైటీ (ACCR-03403) పిన్-147002, ఫోన్-9530994404, శ్రీ టెక్నికల్ &మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ACCR-03406) పిన్-3043001, ఫోన్-9460593302. అస్సాం ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్. (ACCR-00895) ఫోన్-2550724.
బి.ఎస్.ఎం.(ఎం) సెంటర్ ఫర్ కంప్యూటర్ అప్లికేషన్ (ACCR-01058) పిన్-247667, ఫోన్-7900631870, బిఎస్‌జి కంప్యూటర్ సెంటర్ (ACCR-01521) పిన్-335001 ఫోన్-9829733422. కంప్యూటర్ హట్ (ACCR-01843) పిన్-753003, ఎస్‌టిడి-671 టెలి-2547939, జమ్ము సెంటర్, నీలిట్ శ్రీనగర్ (ACCR-00820) ఎస్‌టిడి-191,టెలి-2455515. నీలిట్, చండీగఢ్ (IETE క్యాంపస్, చండీగఢ్) (ACCR-00144) ఫోన్-702262. విజన్ ఎడ్యుకేషనల్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ACCR-00623) ఫోన్-9837402211. వివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ (ACCR-01281) ఫోన్-9837235471. సిఆస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్ (ACCR-01910), పిన్-182101, ఫోన్-9419161301. ఈస్టర్న్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ (ACCR-01918) పిన్-768036, ఎస్టీడీ-6683 టెలి-223518, నీలిట్ ఇటానగర్ (ACCR-01946). ఫోన్-9863429681, KASHOFT కంప్యూటర్స్, కార్గిల్ (ACCR-02031) పిన్-194103, ఫోన్-9419014599. జోర్హాట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ సైన్స్ యూనిటీస్) (ACCR-02043), పిన్-760001 ఫోన్-9438009992. ఆన్‌లైన్ కంప్యూటర్ అకాడమీ (ACCR-02049) పిన్-756100, ఫోన్-9437266850, గీతా మిట్టల్ కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్, జైపూర్) (ACCR-02055) ఫోన్-7665650555.

CBC 06102//12/0009/2425

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68